# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

జూన్
2025

వెల: రూ.
25/-





# శ్రీవేంకటేశం


ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18 సంచిక: 6


**సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్

**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| మహత్తరం.. మహిమోపేతం | |
| నిర్జల ఏకాదశీ వ్రతం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| తిరుప్పావై | 21 |
| రథోత్సవం | 26 |
| దశపాపహర దశమి | 27 |
| పురాణాలు – సుహృత్ సమ్మితాలు | 31 |
| రామాయణ రత్నాకరం | 36 |
| కూటసాక్ష్యం | 40 |
| ముకుందమాల | 42 |
| మీ ప్రశ్న మా సమాధానం | 46 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 47 |
| శ్రీకృష్ణ తత్త్వం | 54 |
| తిరుమల సర్వస్వం | 56 |
| తిరుమల వేంకటేశ్వరునికి నిత్యమూ జరిపే సేవలు | 61 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# ఈ జన్మ భగవత్ సాధన కొరకే!

ఈ భూమిపై జీవించు ప్రతి మనిషి భగవంతుణ్ణి సదా ధ్యానించాలి. భగవంతుని ధ్యానానికి భూలోకం అనువైనది. దేవతలు కూడా భగవంతుని సాధన చేయాలంటే ఈ భూలోకంలో జన్మించవలసి ఉంటుందట. అంతటి ప్రశస్తమైన ఈ లోకంలో పుట్టిన మనం దీనిని సద్వినియోగ పరచుకోవాలి. సదా భగవంతుని ధ్యానంతో పాటు ఎలాంటి కల్మష భావాలు మన మనసులోకి రానివ్వకుండా జాగ్రత్త పడుట కూడా అంతే విలువైనది. మనిషి ధ్యాన స్థితిలో ఉన్నప్పుడు రకరకాల భావాలు రాకమానవు. కాని వాటిని అక్కడే తృంచివేసి, భగవంతునికి అర్పణ చేసి మరింత కొనసాగించకుండా చూచుకొనుట మన కర్తవ్యం. అప్పుడే మన ధ్యానము సన్మార్గములో పయనిస్తుంది. ఈ కల్మష భావాలు క్షణకాలము సంతోషము కలిగించినప్పటికీ మనను వెనుకకు నెట్టివేస్తూ, చివరికి మనిషిని భ్రష్టు పట్టిస్తాయి. ఒకే భావం కదా అని అలుసిస్తే ఎన్నో భావాలకు దారి తీస్తుంది. ముఖ్యంగా భగవంతునికి ఇలాంటి కల్మష భావాలు నచ్చవు. భక్తుని ఆలోచనా విధానం సదా భగవంతుడు మెచ్చే రీతిగానే ఉండాలి. మన మనస్సులోకి వచ్చే ప్రతి భావము భగవంతునికి తెలుస్తుంది. నిజానికి ఈ భావము మన కర్మఫలము, పూర్వజన్మ సుకృతము, చివరికి మన సాధనను అనుసరించి ఉంటుందంటారు. మనం పొందే మంచి, చెడు ప్రతి భావము మన వ్యక్తిత్వము ననుసరించి, అది భగవంతుని నుండి ప్రయాణించి మనను చేరి తిరిగి ఆయన వద్దకు చేరుతుంది కాబట్టి మనలోని మంచి చెడు అన్ని భావాలు ఆయనకు స్పష్టంగా తెలుస్తాయి. భగవత్ ధ్యానము, మంచి ఆలోచనలతో భగవంతుడు సంతోషిస్తే, చెడు ఆలోచనల వలన ఆయనకు మనపైన విరక్తి కలుగుతుంది. అంతే కాకుండా మనం భగవంతుని నుండి దూరానికి తరిమివేయబడతాము. భక్తుడు సదా ఇతరుల మేలు గురించి మాత్రమే తాపత్రయపడాలి. ఇతరులకు సహాయం చేయు అవకాశం కొరకు వేయి కళ్ళతో ఎదురు చూస్తుండాలి. తనవల్ల లోకానికి, భావి తరాలకు ఎంతో కొంత మేలు జరగాలనే దృఢ సంకల్పం ప్రతి భక్తుని మదిలో ఉండాలి. మన చుట్టూ ఉన్న ప్రతి వ్యక్తీ భగవత్ స్వరూపునిగా భావించి చేతనైన సహాయము చేయాలి తప్ప అపకారము చేయాలనే ఆలోచన దరిదాపుల్లోకి కూడా రాకూడదు. ఇలా సద్భావనతో భగవంతుని ధ్యానించే భక్తుడంటే భగవంతునికి ఎంతో ఇష్టం. సద్గ్రంథ పఠనము, పెద్దల ఉపన్యాసముల ద్వారా మంచి చెడుల గురించి విషయ జ్ఞానము వృద్ధి పరచుకోవాలి. కొన్ని సందర్భాలలో ధర్మ మార్గమున నడిచేవారికి కష్టాలు కలుగుట సహజము. కాని వాటిని తట్టుకుని నిలిచి ధైర్యంగా ముందుకెళ్ళేవాడే నిజమైన భక్తుడు. భగవంతుని ధ్యానము ఈ కష్టాలను అధిగమించు శక్తిని మనకు తెలియకుండానే ప్రసాదిస్తుంది. "నన్ను నమ్మినవాడు ఎన్నటికీ చెడిపోడు" అని భగవంతుడు స్వయంగా చెప్పాడు కాబట్టి ఎన్ని కష్టాలు వచ్చినా, చెడు ఆలోచనలకు తావివ్వక సదా భగవంతుని ధ్యానించువారు ధన్యులు. ఈ రకంగా జీవించు భక్తుడు తృప్తిని కూడా అలవరచుకోవాలి. తనువు చాలించు ఏ వ్యక్తీ ఈ భూమిపై ఉన్నదేనినీ తనతో తీసుకుపోలేడనే సత్యాన్ని గుర్తించి జీవించాలి. భగవంతుని ధ్యానము కొరకే ఈ భూమి మీదికి వచ్చాము. మరియు జీవించుటకు, అంటే అన్నపానాదులకు ఇబ్బంది లేనంతవరకు సంపాదించితే సరిపోతుంది తప్ప అధిక మొత్తం అవసరం లేదని గ్రహించాలి. ఎలాగైనా భగవంతుని ప్రేమకు పాత్రులు కావాలనే కోరిక బలంగా ఉన్నవారు ధన్యులు.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో

చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________


మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com


**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**




**– డా॥ కె.వి. రాఘవాచార్యులు**

**శ్లో ॥ శ్రీమన్! కృపాజలనిధే! కృత సర్వలోక**
**సర్వజ్ఞ! శక్త! నతవత్సల! సర్వశేషిన్!**
**స్వామిన్! సుశీల! సులభాశ్రిత పారిజాత!**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే**

తాత్పర్యం – అనపాయిని అయిన లక్ష్మీదేవిని గలిగి దయా సముద్రుడవై, సకల లోక సృష్టికర్తవై, సర్వజ్ఞుడవై, శక్తి సంపన్నుడవై, నమస్కరించిన వారియెడ వాత్సల్యము గలవాడవై, సర్వశేషివైన ఓ స్వామీ! వేంకటేశా! సుశీలుడా, సులభుడా, ఆశ్రయించినవారికి కల్పవృక్షమా! నీ పాదములను శరణముగా వేడుచున్నాను. ఈ శ్లోకమును తవ (నీ) పదమును అధ్యాహారము చేసి, దానిని పదము ముందు చేర్చి తవ చరణౌ సమాసమునకు అర్థం చెప్పవలెను. ఈవిధంగానే 'చరణౌ శరణం ప్రపద్యే' అను మకుటము గల అన్ని శ్లోకములకు అర్థము చెప్పుకోవాలి. 'శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే' అను ద్వయ మంత్రములోని పూర్వ వాక్యము యొక్క భావమే 'శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే' అను వాక్యము యొక్క భావముగా గ్రహించాలి.

శ్రీమన్ – పురుషకార స్వరూపిణి యగు లక్ష్మీదేవి యొక్క నిత్య అనపాయినీ సంబంధమును వేంకటేశుడు కలిగి ఉన్నాడని భావము.

**శ్లో ॥ ఆనూపురార్పిత సుజాత సుగంధి పుష్ప**
**సౌరభ్య సౌరభకరౌ సమసన్నివేశౌ!**
**సౌమ్యౌ సదాఽనుభవనేఽపి నవానుభావ్యౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే**

తాత్పర్యం – వేంకటేశ్వరా! మంగళకరములై, ఒకదానితో ఒకటి పొందికగా తగియున్న అందమును కల్గినవి, ఎల్లప్పుడు సేవింపవలెనను భావము కల్గించునవి, పాదములను అర్చించిన పిదప 'ఇవి మంచి జాతికి చెందిన పుష్పములు అని సుగంధముచే తెలియజేయునవి' కాలి అందెలవరకు పూజింపబడిన పుష్పములు గలవియగు నీ పాదములను శరణు పొందుచున్నాను.

# ముక్తిమార్గము



భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య

ఇతరులకు నిను – నెఱుఁగఁ దరమా
సతత సత్యవ్రతులు – సంపూర్ణ మోహ విర
హితు లెఱుంగుదురు నిను – నిందిరా రమణా! || పల్లవి ||

1. నారీకటాక్ష పటు – నారాచభయరహిత
శూరు లెఱుఁగుదురు నినుఁ – జూచేటి చూపు,
ఘోరసంసార సం – కుల పరిచ్ఛేదులగు
ధీరు లెఱుఁగుదురు నీ – దివ్య విగ్రహము || ఇత ||

2. రాగ భోగ విదూర – రంజితాత్ములు మహా
భాగు లెఱుఁగుదురు నినుఁ – బ్రణుతించు విధము
ఆగమోక్త ప్రకా – రాభిగమ్యులు మహా
యోగు లెఱుఁగుదురు నీ – వుండేటి వునికి || ఇత ||

3. పరమభాగవత పద – పద్మసేవానిజా
భరణు లెఱుఁగుదురు నీ – పలికేటి పలుకు,
పరమ నిత్యానంద – పరిపూర్ణ మానస
స్థిరు లెఱుంగుదురు నినుఁ – దిరువేంకటేశ! || ఇత ||





భావము – ఓ రమా రమణా! సర్వదా సత్యము పాటించువారు, సంపూర్ణముగా మోహము నుండి విడివడినవారు నిన్ను తెలిసికొనగలరు గాని ఇతరులకు నిన్ను తెలిసికొన వీలగునా?

స్త్రీల కడగంటి చూపులనెడు పదునైన బాణముల వలన గలుగు భయము లేని శూరులు, అనగా జితేంద్రియులు మాత్రమే నిన్నెట్టి చూపుతో చూడవలెనో ఎఱుంగుదురు. భయంకరమైన సంసారపు చిక్కును దెంచుకొన్న ధీరులు మాత్రమే నీ దివ్యమంగళమూర్తిని గుర్తింపగలరు.

లౌకిక వస్తువులకు సంబంధించిన అనురాగమునకును, భోగమునకును దూరమై రంజిల్లిన అనగా వైరాగ్య సంపన్నమయిన హృదయముగల పుణ్యాత్ములు మాత్రమే నిన్ను స్తుతించు ప్రకారము నెఱుంగుదురు. శాస్త్రోక్త విధి ననుసరించి పయనించు పెద్ద యోగులు మాత్రమే నీవున్న చోటు తెలిసికొందురు.

శ్రీవేంకటేశ్వరా! శ్రేష్ఠులైన భాగవతుల యొక్క చరణ సరోజముల సేవయే ఆభరణముగా గల భక్తులు మాత్రమే నీ మాటలలోని అర్థమును గ్రహింపగలరు. శాశ్వతానందముచే నిండిన చిత్తముచే కదలిక లేని స్థితప్రజ్ఞులు మాత్రమే నీ స్వరూపము నాకళించుకొందురు.

## మహత్తరం... మహిమోపేతం...

# నిర్జల ఏకాదశీ వ్రతం

చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో|| "యత్కల్యాణ గుణాభిరామ మమలం మంత్రాణి సంశిక్షితే**
**యత్సంశేతి పతి ప్రతిష్ఠొతమిదం విశ్వం వదత్యాగమః**
**యో యోగేంద్ర మనః సరోరుహతమః ప్రధ్వంస విద్యాభనుమాన్**
**ఆర్తత్రాణ పరాయణః సభగన్నారాయణో మే గతిః**

జ్యేష్ఠా నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం జ్యేష్ఠ మాసం. రక్తవర్ణంతో, మూడు నక్షత్రాలతో గొడుగు కర్ర ఆకారంలో ఉంటుంది జ్యేష్ఠా నక్షత్రం. దీనికి అధిపతి ఇంద్రుడు. దశాధినాధుడు బుధుడు. జ్యేష్ఠ ఆషాఢములు గ్రీష్మ ఋతువు. సూర్యుడు తన కిరణాలతో భూమిని తపింపచేస్తాడు. ఫలితంగా ఎండలు ఎక్కువవుతాయి. నదులు, చెరువులు ఎండిపోతాయి. ఎండల తీవ్రత నుండి శిరస్సును కాపాడడానికి ఛత్రము, కాళ్ళకు చెప్పులు దానం చేయాలి. ప్రతి వ్యక్తి శక్త్యానుసారం నీటిని ఇతరులకు దానం చేయాలి. అందించాలి.



సంవత్సరమునకు పన్నెండు మాసములు. ప్రతి మాసమునకు రెండు ఏకాదశులు వస్తాయి. ''తిథేశ్చ శ్రియమాప్నోతి'' తిథి మానవులకు శ్రేయస్సును కలిగింపచేస్తుంది. తిథులలో పదకొండవ తిథిని ఏకాదశి అంటారు. ఏకాదశి శ్రీమన్నారాయణునకు అత్యంత ప్రీతికరం. గంగతో సమానమైన తీర్థం, మాతృ సమానమైన గురువు, విష్ణు సమమైన దైవం, నిరాహారమును మించిన తపము, ఏకాదశిని మించిన తిథి లేవని పురాణాలు పేర్కొంటున్నాయి. ఏకాదశి విష్ణువుకు ప్రీతికరమైనందున 'విష్ణువాసరం' లేక 'హరివాసరం' అని పేరు పొందింది. విష్ణుభక్తులకు ఏకాదశి మహాపర్వదినం. అయిదు కర్మేంద్రియములు, అయిదు జ్ఞానేంద్రియములు, మనసు – మొత్తం పదకొండింటి యందు భగవంతుని లగ్నం చేసి సేవించిన వారికి తప్పక ముక్తి లభిస్తుంది. ఈ సత్యాన్ని తెలియజేసేందుకే ఏకాదశికి అంతటి ప్రాముఖ్యత కలిగింది.

**'ఏకాదశి నామ సర్వకామ ఫలప్రదం కుర్వన్తి సర్వదా'**
సర్వ కామితములు తీర్చగలది ఈ తిథి. ఈ రోజున

''ఏ కాదశ్యముపవసేనన కదాచితి క్రమేత్'' ఏకాదశి నాడు విగ్రహారాధన, ఉపవాసముండుట మున్నగునవి ముఖ్యమైనవి. మనిషి ఇంద్రియములకు అధీనుడై ప్రవర్తిస్తాడు. సుఖభోగాలు మనిషిని దైవానికి దూరం చేస్తాయి. ఉపవాసాది కఠిన నియమాల వల్ల ఇంద్రియాల ప్రభావం తగ్గి, ఆధ్యాత్మిక సాధనలకు మార్గం సుగమం అవుతుంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసములలో దైవచింతన ఇమిడిపోవాలి. మనస్సు నిర్మలంగా ఉండి సదా భగవద్భజన యందు విహరించాలి. ఉపవాసము అనగా ఉప – వాసం = ఉప యనగా సమీపాన. దేనికి సమీపాన యనగా భగవంతుని సమీపాన యని అర్థము. 'వాసము' యనగా నివసించుట అని అర్థము. భగవంతునికి సమీపంలో ఉండి హరి నామస్మరణ నిరంతరం చేస్తుండాలి. బుద్ధిని భగవంతుని మీద కేంద్రీకరించాలి. కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలను త్యజించాలి. పరనింద చేయరాదు. అసందర్భపు ప్రేలాపనలు పనికిరాదు. అప్పుడే సర్వకామితములు ఈడేరుతాయి. పది ఇంద్రియాలు ఏక రూపమై నియంత్రించేందుకు మనస్సు సాధనముగా మలచబడింది. కావున ఏకాదశి అయింది. మనో వికాసం, సమయ పాలన, సాత్విక చింతన, సత్కర్మాచరణ, సత్యనిష్ఠ, జ్ఞానపిపాస, మోక్షాసక్తికి సోపానం ఏకాదశి అనడం అక్షరసత్యం. ఈ ఏకాదశి తిథి అనే పర్వం దేవదేవుడు, అనంత శక్తిస్వరూపుడు అయిన శ్రీమహావిష్ణువు భక్తుల కష్టాలను తీర్చి, వారి కోరికలను తీర్చి, ముక్తిని కలిగింపచేసే పర్వంగా, పునీతులను చేసే పర్వంగా సాగుతోంది.

జ్యేష్ఠమాస శుక్లపక్ష ఏకాదశిని నిర్జల ఏకాదశి అంటారు. నిర్జలం అంటే జలమును (నీటిని) తీసుకోకుండా ఆచరించే విధానం. ఏకాదశి పర్వము నాడు సూర్యోదయం నుండి మరుసటి రోజు ఆహారము తీసుకునేంతవరకు ఏమాత్రము నీటిని స్వీకరించకుండా కఠిన నియమాలు పాటిస్తూ, ఇంద్రియాలను నిగ్రహించుకుంటూ ఆధ్యాత్మిక సాధనలకు మార్గమును సుగమం చేసుకోవటం. బుద్ధిని భగవంతుని మీద కేంద్రీకరించుకుంటూ మనసులలో, తలపులలో దైవచింతన ఇమిడిపోయే విధంగా, మనస్సును నిర్మలంగా, పవిత్రంగా ఉంచుకుంటూ సదా భగవద్భజన యందు విహరించేటట్లు తనువును సంసిద్ధం చేసుకోవడం వలననే ఏకాదశి తిథికి సార్థకత ఏర్పడుతుంది. అయితే భగవంతుని పూజించి, అభిషేకించి పరమాత్మ చరణోదకమును (స్వామి తీర్థము) మాత్రము తీసుకోవచ్చు. ఎందుకంటే స్వామివారి అభిషేకజలం అకాల మృత్యువును హరించేది కనుక నిర్జల ఏకాదశి వ్రతాన్ని ఎవరైతే భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారో వారికి ఏడాది పొడవునా వచ్చే ఇరువది మూడు ఏకాదశుల ఫలం తప్పనిసరిగా లభించి తీరుతుంది. వారు నిశ్చయంగా ముక్తిని పొందుతారు.

నిర్జల ఏకాదశీ వ్రతాన్ని చేయదల్చుకున్నవారు దశమి నాటి రాత్రి భోజనము చేయకుండా ఫలహారమును స్వీకరించాలి. ఏకాదశినాడు బ్రాహ్మీ ముహూర్తంలోనే నిద్ర లేచి కాలకృత్యములు తీర్చుకుని నారాయణునకు నమస్కరించి స్నాన సంధ్యాదులను పూర్తి చేసుకుని ఉతికిన శుభ్రమైన వస్త్రములను ధరించాలి. నుదుటన విభూతి ధరించి విభూతి నడుమ గంధమును ధరించి కుంకుమ పెట్టుకోవాలి. గణపతిని ప్రార్థించి నమస్కరించి స్వామి ఆశీస్సులను పొందాలి. గోమయంతో పూజాగృహాన్ని శుభ్రం చేసి మంటపాన్ని ఏర్పాటు చేసుకోవాలి. మంటపాన్ని అలంకరించి విష్ణుమూర్తి పటాన్ని కానీ, విగ్రహమును కానీ ఉంచి అర్చనలు చేయాలి. పసుపుతో గణపతిని తయారు చేసుకొని భక్తి శ్రద్ధలతో పువ్వులు, గరిక, చందనం, మారేడులతో అర్చించాలి. గణపతికి ప్రీతికరంగా అరటిపండ్లను నివేదన చేయాలి. అనంతరం విష్ణుమూర్తిని అష్టోత్తర శతనామాలతో పూజించి విష్ణు సహస్ర నామమును పఠించాలి. పాలను, అరటిపండ్లను నివేదన చేయాలి. విష్ణుమూర్తికి నమస్కరించి –

**''ఏకాదశ్యాం నిరాహారో భూత్వాహమ పరేహని**
**భోక్ష్యామి పుండరీకాక్ష శరణం మే భవాచ్యుత''**

''ఓ పుండరీకాక్షా! నీకు ఎంతో ప్రీతిపాత్రమైన ఈ ఏకాదశినాడు ఉపవాసం ఉండి, జలమును ఏమాత్రం స్వీకరించకుండా ఉండి, ద్వాదశి నాడు భోజనం చేస్తాను. నీ శరణు కోరిన నాపై దయ ఉంచు'' అని సంకల్పించి ఏకాదశి ఉపవాసం చేయాలి. ''ఓం నమో నారాయణాయ'' లేక ''ఓం నమో భగవతే వాసుదేవాయ'' అంటూ మన శక్తి మేర జపం చేయాలి. శక్తి ఉన్నవారు పై రెండు మంత్రములను భక్తితో తాదాత్మ్యముతో జపము చేయవచ్చు.

ద్వాదశి రోజున యథావిధిగా పూజాదికములను పూర్తి చేసుకుని అన్నదానం చేయాలి. శక్తిలేని వారు భాగవతోత్తముడైన బ్రాహ్మణుని పిలిపించి, ఆ బ్రాహ్మణునిలో నారాయణుని తిలకించి, వారిని భక్తి శ్రద్ధలతో పూజించి భోజనము పెట్టాలి. ఈరోజు చేసే గంగాస్నానం అక్షయ ఫలితాలను ఇస్తుందని బ్రహ్మాండ పురాణం చెబుతోంది. ఈ నాడు చేసే అన్న, వస్త్ర, పాత్రల, చెప్పుల, విసనకర్ర, గొడుగు, బంగారం లేదా వెండి లేదా మట్టితో చేసిన పాత్ర, పండ్లు మొదలైన వాటిని యథాశక్తి దానం చేయాలి. ఈరోజు నీటితో నిండిన కడవను బంగారంతో పాటు దానం చేయడం ఉత్తమం.

వ్రతాన్ని ఆచరించేవారు మూడు జాములలో స్నానం చేసి, జపం చేస్తూ ఒక తపస్సుగా నిర్వహిస్తారో వారికి అనంతమైన ఫలం లభిస్తుంది. ఎవరైతే ఈరోజు హోమాదులను నిర్వహిస్తారో వారికి లభించే ఫలం మాటలలో వర్ణించ నలవికానిది. ఏకాదశి వ్రతం వల్ల మానవుడు విష్ణులోకానికి చేరుకుంటాడు. ఈనాడు భోజనం చేసినవారు విష్ణుభగవానుని కృపను కోల్పోతారు. నరకలోకానికి

చేరుకుంటారు. నిర్జల ఏకాదశీ వ్రతాన్ని ఆచరించువారు నేరుగా స్వర్గానికి చేరుకుంటారు. నిర్జల ఏకాదశికి సంబంధించిన కథ ఈ విధంగా గొప్ప ప్రచారంలో ఉంది.

పంచపాండవులలో ఒకడైన భీమసేనుడు పూజ్యుడైన వ్యాసమహర్షి సన్నిధానమునకు వెళ్ళి పూజించి వారితో "ఓ పితామహా! మా సోదరులైన యుధిష్ఠిరుడు, అర్జునుడు, నకుల సహదేవులు, మా తల్లిగారైన కుంతీదేవి, ధర్మపత్నియైన ద్రౌపది మొదలైన వారందరూ ప్రతి ఏకాదశీ వ్రతాన్ని ఆచరిస్తూ ఉంటారు. నన్నూ ఏకాదశీ వ్రతాన్ని ఆచరించమని చెబుతూ ఉంటారు. పరమ పవిత్రమైన ఏకాదశీ తిథి అనిన విష్ణుమూర్తికి ప్రీతిపాత్రమైనదని, ఆనాడు అన్నం తినవద్దని, ఒకవేళ తింటే నరకానికి వెడతారని నాతో అంటుంటారు. తల్లి, సోదరులతో కలిసి నాక్కూడా ఏకాదశీ వ్రతాన్ని ఆచరించాలని ఉన్నప్పటికిని ఆకలికి మాత్రం తట్టుకోలేను. అన్నం తినకుండా ఉండలేను. ప్రతి పదిహేను రోజులకొకసారి వచ్చే ఏకాదశినాడు నాతో వాదిస్తూ ఉంటారు. దయచేసి దీనికి పరిష్కారమార్గం సూచించండని" పలికాడు.

భీముని మాటలను విన్న వ్యాసుడు తల్లీ సోదరులు నీ మంచి కోసమే కదా చెబుతున్నారు. ఏకాదశి నాడు అన్నం తినకుండా, కఠిన నియమాలను పాటిస్తూ ఉండమని పలికాడు. అందులకు భీముడు తిరిగి బదులిస్తూ మహాత్మా! నేను అన్నం తినకుండా, కఠిన నియమాలు పాటిస్తూ యుండలేను. నాకోసం కాకపోయినా మా వారి తృప్తి, సంతోషం కోసం వ్రతాన్ని ఆచరించడానికి ప్రయత్నిస్తాను. ప్రతి ఏకాదశికీ అన్నం తినకుండా ఉండే బదులు సంవత్సరంలో ఏదైనా ఒకరోజు చేసే వ్రతాన్ని తెలియజేయండి. ఆ వ్రతంతో నాకు స్వర్గప్రాప్తి, మా వారికి ఆనందం లభించాలి అని పలికాడు.

అంత వ్యాసుడు భీమునితో పూర్వం మునీశ్వరులు, ఋషీశ్వరులు వేదాలను, శాస్త్రాలను శోధించి ఈ నియమాన్ని ఏర్పరచారు. ఏర్పరచడమే కాకుండా వారు స్వయంగా పాటించి చూపారు. వారు చూపిన బాటలో నడవడానికి కష్టమైతే కొద్దిపాటి సాధనతోనే అనంత ఫలాన్ని పొందవచ్చు. అన్ని ఏకాదశులూ నిరాహారంగా నీవు ఉండలేకపోతే జ్యేష్ఠమాసంలో, శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని నిర్జల ఏకాదశి అంటారు. ఆనాడు ఈ వ్రతాన్ని ఆచరించు. స్నానం చేసిన తరువాత ఆచమనం తప్ప మరే విధంగా నీటిని తీసుకోరాదు. నిర్జల ఏకాదశి నాడు భోజనం పనికిరాదు. అయితే భగవంతుని చరణోదకమును మాత్రం తీసుకోవచ్చును. ఎందుకంటే స్వామి తీర్థం అకాల మృత్యువును దరి చేరనీయదు. నిర్జల ఏకాదశిని ఎవరైతే నియమ నిష్ఠలతో, భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారో వారికి ఏడాది పొడవునా వచ్చే ఏకాదశుల ఫలం తప్పనిసరిగా లభించి తీరుతుంది. అటువంటివారు నిశ్చయంగా, స్వర్గానికి చేరుకుంటారని పలికాడు.

పూజ్యులైన వ్యాస మహర్షి ఆజ్ఞ ననుసరించి భీముడు నిర్జల ఏకాదశీ వ్రతాన్ని భక్తితో ఆచరించాడు. తన సోదరులకు, తల్లికి, అందరికీ ఆనందాన్ని కలిగింప చేశాడు. తద్వారా నరకలోక ప్రాప్తి కలగకుండా తన జీవిత గమనాన్ని మలచుకున్నాడు. ఒకే ఒక రోజు నీరు కూడా తాగకుండా వ్రతదీక్షతో ఉన్నవారు వారికి యమదూతల దర్శనం కలగదు. కనుక లోకంలో అన్నిటికంటె శ్రేష్ఠమైనది, గొప్ప మహాత్మ్యము కలది నిర్జల ఏకాదశి.

విష్ణు ప్రీతికరమైన నిర్జల ఏకాదశి వ్రతాన్ని ఆచరించి నియమ నిష్ఠలతో పాటించి, భక్తి శ్రద్ధలతో ఆచరించి తరిద్దాము. జీవితమును చరితార్థము చేసుకుందాం.

"నారాయణ నారాయణ జయ గోవింద హరే
నారాయణ నారాయణ జయ గోపాల హరే"


# జపము వ్రాసే భక్తులకు మనవి

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి 23వ పర్యాయంగా 7 కోట్ల జపమును వ్రాసే భక్తులకు మనవి. మీరు వ్రాసే ఈ జపమును తేది 25.07.2025 వరకు మా పీఠం అడ్రస్‌కు అందేలా పంపగలరని మనవి.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

**1-1-53, వీధినం. 1, హబ్సీగూడ, హైదరాబాద్-500007.**

**ఫోన్: 040-27175050**



27వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

— **గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)



**దిశా నిర్దేశం :** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 27 వ భాగపు లీలల ప్రచురణ. (నవంబర్ 2012 నుండి ఆగస్ట్ 2013).

ఈ కాలంలో వ్యాపారం వద్దంటూ కఠినంగా వ్యవహరించారు. మరోప్రక్క హరినామక్షేత్రం ఏర్పాటు చేస్తే నాకు జన్మ జన్మల సేవాభాగ్యం లభించునని చెప్పారు. ఒకరకంగా నేను తృప్తి చెందేవరకు సేవాభాగ్యం ప్రసాదిస్తానన్నారు. ప్రతిగా తాను చెప్పినట్లు వినమన్నారు.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు పూర్వంలాగా లీలలను చూపుట ఆపివేశారు. నెల రెండు నెలలకు ఒక్కటి చొప్పున చూపుతున్నారు. దీనిని భరించలేకపోయాను. నాకు ఏమీ వద్దని, ప్రతి వారం పది రోజులకు ఒక లీలను చూపమని, వాటిని చూస్తూ సంతోషంగా ఉంటానని ప్రార్థించాను. బహుశా దీని ప్రకారం గత నెల నుండి ప్రతి వారం పది రోజులకు ఒక లీలను చూపుతున్నారు.

### ఆలయ నిర్వాహకుడిగా ఉంటావని చెప్పట

**తేది 05-11-2012 కల:** ఈ కలలో నేను ఒక పురాతనమైన దేవాలయమునకు పోయాను. ఆ గుడిలో, ఇరుప్రక్కల వరుసగా మూడు నాలుగు ఉప ఆలయాలు ఉన్నవి. ఒక్కొక్క ఆలయం 10'X10' సైజుతో ఒకే ఒక అంతస్తుతో రాతి కట్టడముతో ఉన్నది. ఇది రకరకాల పూలతో, ఆకర్షణీయంగా అలంకరించబడి ఉన్నది. నేను ఈ ఆలయాల సముదాయానికి నిర్వాహకుడిగా ఉన్నానట. మరియు మూలమూర్తియైన శివుని యొక్క బ్రహ్మోత్సవము లాంటి పెద్ద ఉత్సవాన్ని నిర్వహించుటకు సిద్ధంగా ఉన్నానట. ప్రక్కన ఇతర ఆలయాలు, అందులో దేవతలు ఉన్నారు. కాని వారు నాకు కనబడలేదు. కల చెదిరింది.

భవిష్యత్తులో నేను ఒక ఆలయాల సముదాయమునకు నిర్వాహకుడిగా ఉందునని, స్వామివారిని అత్యంత భక్తిశ్రద్ధలతో సేవిస్తూ,

వారి ఉత్సవాల నిర్వహణకు తపించుదునని దీని అర్థం. వెండి వాకిలి వ రకు ఉన్న తిరుమల ఆలయంలో ఇరుప్రక్కల ఎన్నో ఉపాలయాలను గమనించవచ్చు.

## నా మనోభావం తెలుపుట : ఉదయం 6.20 గంటలకు స్వామి దర్శనం

శ్రీవేంకటేశ్వరుడు ఒక ప్రత్యేక లీలను చూపాడు. అందులో నేను వారిని 6 గంటల 20 నిముషాలకు దర్శించుకున్నాను. ఇది ఒక ప్రత్యేకమైన కల ఐనప్పటికీ నా హృదయాంతరంగాన్ని బయట పెట్టారు. 2002 సంవత్సరం నుండి భక్తి మార్గములో ఉన్నాను, మరియు శ్రీవేంకటేశం మాసపత్రికను నడుపుచున్నప్పటికీ నాకు మంచి, చెడ్డ విషయాలు తెలియవు. సదా స్వామివారి రూపాన్ని దర్శిస్తూ, ఆయన నామాన్ని స్మరిస్తే సరిపోతుంది, దీనితో అన్నీ సాధించుకోవచ్చుననే దృఢవిశ్వాసం కలవాణ్ణి తప్ప మరో విషయం తెలియదు. తేది 13-11-2012 దీపావళి నాడు స్వామివారిని మనసారా స్మరించుకుని దర్శనమీయమని ప్రార్థించాను. తేది 14-11-2012 ఉదయం 6 గంటల 20 నిముషాలకు ఈ కల వచ్చింది.

**14-11-2012 కల:** ఒక ఊరిలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి దర్శనార్థం వెళ్ళాను. అది పురాతనమైన ఆలయం, ఆర్భాటంగా లేదు కానీ విశాలంగా ఉంది. ఇది ఒక ప్రత్యేకమైన ఆలయం. ఈ ఆలయం భక్తులకై ప్రతి రోజు ఉదయం మరియు సాయంత్రం తెరచి ఉండదు. మంచి ముహూర్త కాలమందే ఆలయ ద్వారాలు తెరువబడును. మిగిలిన సమయంలో మూసివేస్తారు. మూసి ఉన్న సమయంలో ఆలయ ద్వార తలుపులకు గల ఒక 6''X 6'' సైజు కలిగిన కన్నం గుండా స్వామివారిని భక్తులు దర్శించుకుంటారు. కాని పూజలు, హారతులు వగైరాలు ఉండవు, పూజారి కూడా ఉండడు. భక్తుల సౌకర్యార్థం, ఆలయం తెరువబడే ఆ కొద్దిపాటి మంచి సమయం ద్వారం పైన, ఆ ఆలయ పూజారి వ్రాసి పెడతాడు. ఆ సూచించిన సమయమందే భక్తులు లోనికి వెళ్ళి దర్శించుట, పూజలు, హారతులు నిర్వహించుట జరుగును. నేను ఒకరోజు ఈ ఆలయానికి స్వామి దర్శనార్థం వెళ్ళాను. కాని ఆ సమయాన ఆలయ ద్వారం మూసి ఉన్నది. ద్వారం పైన గత పూజ సమయం 6.20 అని వ్రాసి ఉన్నది. చేయునది లేక ద్వారానికి గల కన్నం గుండా స్వామివారిని దర్శించి వెళ్ళిపోయాను. తిరిగి తెల్లవారి ఇదే ఆలయానికి, సూచించిన సమయంలో స్వామి దర్శనార్థం వస్తున్నాను. మార్గమధ్యంలో కొందరు బైబిల్ గ్రంథమును పట్టుకుని వారి మత ప్రచారము చేస్తున్నారు. కలలో బైబిల్ గ్రంథమును స్పష్టంగా చూచాను. నేను వారితో ఇలా అన్నాను. "గోవిందుని స్మరించండి మీకు మంచి జరుగుతుంది" అని అన్నాను. ఆ తరువాత వారు నన్ను ఏమైనా తిక్క ప్రశ్నలు అంటే మంచి ఎలా జరుగుతుంది? వంటివి అడిగితే ఏమని చెప్పాలని తటపటాయించాను. ఎందుకంటే నేను సదా మనో నేత్రంతో సంవత్సరం పొడవునా ఆ గోవిందుని దర్శిస్తూ, స్మరిస్తూ ఉంటేనే తప్ప మిగిలిన మంచి, చెడు విషయాలు తెలియవు. తిథి, వార నక్షత్రాల గురించి కాని, మరే ఇతర విషయాల గురించి కాని పట్టించుకోను. వీటిని తెలుసుకోవాలనే ఇచ్ఛ కూడా ఉండదు. ఒకవేళ ఎవరైనా చెబితే విని వెంటనే మరచిపోతాను. ఎందుకంటే నాకు నా స్వామి ఏమి ఇచ్చినా ఇవ్వకపోయినా సర్వము నా స్వామియే! ఆయననే విశ్వసిస్తూ, స్మరిస్తూ ఆయనే లోకంగా ఉంటాను. స్వామివారిని ఒక్కరిని పట్టుకుంటే లోకంలో మరేదీ తెలుసుకోవలసిన అవసరం లేదు, కావలసినవన్నీ ఆయనే చూసుకుంటారనే దృఢభిప్రాయము కలవాణ్ణి కాబట్టి ఇతర విషయాలపై రవ్వంత కూడా మనస్సు మరలదు. అందుకని నాకు ఇతర విషయాలు, చివరికి ఆయన తత్వం కూడా తెలియదు. అందుకని తటపటాయించాను. చివరికి వారు ఏమీ అడగలేదు. నేను స్వామి ఆలయానికి నడుచుకుంటూ వెళ్ళిపోయాను. ఆలయం ముందు నిలుచున్నాను. అప్పుడే ఆ ఆలయ పూజారి లోనుండి స్వామివారికి హారతి ఇచ్చి, తలుపులు తీసి నాకు హారతి తీసుకోండని ఇచ్చాడు. హారతి తీసుకున్నాను. వెంటనే పూజారి ఆ ఆలయ తలుపుల పైన ఈ ఆలయం తెరచి ఉండే సమయాన్ని వ్రాయుచున్నాడు. 6.25 గా వ్రాశాడు. నేను పూజారి వ్రాయుటను ఎంతో ఆసక్తిగా చూశాను. ఆయన 6 గంటలు అని వ్రాసి నిమిషాలు వ్రాయునప్పుడు, ఎక్కువ వ్రాస్తే బాగుండునని తహ తహలాడాను. పూజారి వ్రాయుట ముగియగానే మరోసారి ఆలయంలోకి ప్రవేశించి, స్వామివారి ఎదురుగా నిలబడి ప్రణామాలను అర్పిస్తూ దర్శించుకున్నాను. వారు 4'-6'' ఎత్తు కలిగి నల్లని రూపముతో గంభీరమైన ముఖము కలిగి శంఖు చక్రాదులతో నిగ నిగ మెరుస్తున్నారు. ఆయన ముఖము నన్ను మరీ ఆకర్షించింది. వారినే చూస్తూ మైమరచిపోయాను. ఇంతలో నా భార్య ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు లేచేటాయన ఇంకా లేవలేదని నా వద్దకు వచ్చి లేపింది. వెంటనే టైం ఎంత అని అడిగాను. దానికామె 6.20 నుండి 6.25 అయింది లేవండి అని లేపింది. కల చెదిరింది. కాని స్వామి కనబడునని మళ్ళీ అలాగే పడుకున్నాను కాని కనబడలేదు. నాకు స్వామివారు 6.20 గంటలకు కనబడినారని భావము. నాకు ప్రాప్తమున్నంతనే ఆయన దర్శనం లభించింది.

దీనర్థం నాకు స్వామి వారు తప్ప మరే ఇతర విషయాలు తెలియవు, ఆసక్తీ లేదు. మరియు అన్నీ స్వామివారే చూచుకొనుననే దృఢమైన భావము కలవానిగా నాస్వభావాన్ని తెలిపారని భావించాను. స్వామివారిని దర్శించి ధన్యుణ్ణైనాను.

## వ్యాపారం మానివేస్తే భగవంతునితో పాటు, ఆరోగ్యం లభిస్తుందని తెలుపుట

శ్రీవేంకటేశ్వరుడు ఆయా సమయాలలోని నా మానసిక స్థితికి తగినట్లు సామ దాన భేద దండోపాయాలతో వారి మార్గము లోనికి తెచ్చుకునే వారు. గతంలో మేము వ్యాపారము చేయకూడదని చెప్పారు. కాని ఆ సమయంలో దీనిని సరైన విధంగా గుర్తించలేదు. పైగా వ్యాపారము పైన మనస్సు చావని కారణాన సైనిక్ పురి ప్రాంతమున 4 అంతస్తుల చిన్న అపార్టుమెంట్ కట్టాము. ఈ ప్రాజెక్టు సమయంలో నాకు, నా భార్యకు వ్యాపారము చేయరాదంటూ ఎన్నో లీలలు చూపెట్టారు. డబ్బు సంపాదించలేవని, ఆరోగ్యం చెడిపోవునని, చివరికి ఐటి సమస్యల్లో ఇరుక్కుందువని ఇలా నా మూలంలో మార్పు జరిగే వరకు చెప్పుచునే ఉన్నారు. ఇప్పుడు నా ఆరోగ్యాన్ని ఎలా టార్గెట్ చేశారో చూద్దాం.

ఈరోజు రెండు కలలు వచ్చాయి. చూచుటకు భిన్నంగా కనబడినప్పటికీ, విశ్లేషిస్తే ఒకే విషయాన్ని సూచిస్తాయి.

**తేది 05-12-2012 కల:** నేను శ్రీవేంకటేశ్వరుని లీలల గురించి ఏదో ఆలోచిస్తున్నాను. ఇంతలో ఏదో ఒక అనారోగ్యం కారణంగా, మా ఇంటి ప్రక్క డాక్టరుచే చెక్ చేయించుకున్నాను. ఇది మొదటి కల. ఇక రెండవ దానిలో నేను ఒక బజారు వెంట వెళ్ళుచున్నాను. ఒకచోట బ్రహ్మకుమారీల ప్రచారాన్ని చూచాను. వారు శివుని ప్రదర్శనను నెలకొల్పారు. నేను వెళ్ళి నా ప్రభువు యొక్క ద్వితీయ రూపంగా పరమశివుడిని దర్శించుకున్నాను. శివ పార్వతులను విగ్రహ రూపములుగా దర్శనము చేసుకున్నాను. ఇంతే కల. ఈ కల కన్నప్పుడు దీని భావమును గ్రహించలేదు. కాని 2020 సంవత్సరంలో స్వామివారు నా పూర్తి అనుభూతులను చదువుమన్నప్పుడు దీని అర్థమును ఇలా గ్రహించాను.

"స్వామి వారు చెప్పినట్లు వింటే భగవంతుణ్ణి పొందగలవు మరియు ఆరోగ్యము బాగుంటుంది, లేనట్లైతే చెడిపోదువని హెచ్చరించారు". అంటే... వ్యాపారము పూర్తిగా మానివేసి ఆయన స్మరణలో కాలం గడపమన్నారని అర్థం. ఇదే విధమైన హెచ్చరిక నా భార్యకు కూడా కలిగించారు. కాని భిన్నమైన రీతిలో ఆమె మనస్సు మార్చే రకంగా, ఈ విధంగా ప్రసాదించారు.

## వ్యాపారం చేస్తే ఫలితం దక్కదని చెప్పుట

**తేది 14-12-2012 కల:** ఒక ప్రాంతములో నాలుగు, ఐదు అంతస్తుల భవనము ఉన్నదట, దాని పనులు చివరి దశలో ఉన్నవట. ఒక పర్యాయం కలరింగ్ కూడా అయిపోయింది. ఇది మాదేనట, ఒకరోజు నా భార్య సురేఖ, ఆ భవనము పై అంతస్తుకు వెళ్ళి భవనం ఎలా ఉందని పరిశీలిస్తున్నదట. తన వెంట మా రెండవ కుమారుడు చి॥ అరవింద్ రెడ్డి కూడా ఉన్నాడట. ఆ భవనమునకు ఇంకా కిటికీలు బిగించలేదట. రెడీమేడ్ అల్యూమినియం కిటికీలు బిగించుటకు సిద్ధంగా ఉన్నాయట. చక్కని గాలి కిటికీల గుండా వీస్తున్నదట. ఆ గాలికి సురేఖ ఎంతో సంతోషించిందట. సురేఖ మరింత సుఖాన్ని అనుభవించుటకు కిటికీ దగ్గరికి వెళ్ళి వీచే గాలిని ఆస్వాదిస్తూ బయటి దృశ్యములను చూస్తున్నదట. అప్పుడు సురేఖ చేతిలో డాలర్ కరెన్సీ కట్ట ఉన్న ఒక తెల్లని కవర్ ఉన్నదట. ఈ కవర్ ని పట్టుకుని క్రిందికి మరియు ఆ పరిసర ప్రాంతాలను చూస్తూ ఆనందిస్తున్నదట.




డబ్బులు జారవిడిచిన సురేఖ

ఇంతలో తన చేతిలోని డాలర్ కరెన్సీ కవరు జారి క్రింద పడ్డదట. అయ్యో... అయ్యో... అంటూ అటు ఇటు చూచిందట. ఇంతలో క్రింద నుండి ఒక బాలుడు అటుగా వెళ్ళుచున్నాడట. ఆ బాలుణ్ని పిలిచి, "బాబూ! బాబూ! పొరపాటుగా నా నుండి కవరు క్రిందికి జారిపడ్డది కొంచెము పట్టుకోండి, నేను పైనుండి క్రిందికి వస్తున్నానని" చెప్పిందట. ఆ బాలుడు ఆమె చెప్పింది

విని సరే అన్నట్లు తల ఊపాడట. సురేఖ వెంటనే క్రిందికి దిగి ఆ బాలుని కొరకు అటూ ఇటూ వెతికినదట. కాని ఆ బాలుడు, ఈ కవరు కనబడలేదు. ఈమె చాలా భయపడి, బాధపడుచు, ఆ ప్రాంతము, ఈ ప్రాంతము ఇలా పలుచోట్ల శోకతప్త హృదయముతో ఆ బాలుడికై, ఈ కవరుకై వెతకసాగిందట. ఎంత వెతికినా కనబడలేదు. గంటల తరబడి, వెతికిందట. కాని ఆ బాలుడు మాత్రము దొరకలేదు. చివరికి బాధాకరమైన హృదయంతో ఇంటికి వచ్చిందట. హృదయము ద్రవించిందట, ఇంతటి బాధను తను ఎన్నడూ అనుభవించలేదట. ఇంతే కల. చాలా బాధపడ్డానని నాతో చెప్పింది.

అప్పుడు మేము దీనిని సరైన విధంగా అర్థం చేసుకోలేదు. వచ్చే వైకుంఠ ఏకాదశి నాడు భజగోవిందం ఏర్పాటు చేయుటను తప్పించుకోవద్దనే సూచన ఇచ్చి ఉంటాడని అనుకున్నాము. కాని దీని నిజమైన అర్థం ఇలా ఉంది : ‘‘నీవు నాలుగైదు అంతస్తుల భవనమును నిర్మించినప్పటికీ, మంచి లాభము పొందినప్పటికీ ఆ లాభము లేదా ఫలితము నీకు దక్కదని దీని అర్థం. అంటే మమ్ములను వ్యాపారము వదలి, స్వామివారి సేవే లక్ష్యంగా పని చేయమని మా భార్యా భర్తలకు స్వామివారు ఆజ్ఞాపించారు.

నిజానికి, నేను వ్యాపారము చేసినట్లైతే స్వామి సాధనలో ఆటంకము కలుగునని వద్దన్నారు. కాని ఈ విషయం గ్రహించలేదు. వ్యాపారానికి స్వామి సేవకు సంబంధం ఏమిటని ఆలోచించాను. స్వామివారు అర్థం పర్థం లేని విషయాలు చెప్పుచున్నారని భావించాను. ఇలా వ్యాపారం చేయరాదని, మా మూలంలో మార్పు జరగని కారణంగా, ఈ ప్రాజెక్టు తరవాత కనీసం కాలక్షేపము కొరకు చిన్నగా వ్యాపారము చేద్దామనుకున్నాము.

## ‘భజగోవిందం’ నిర్వహణ ద్వారా గోవిందుని పొందగలవని చెప్పిన శ్రీగోదాదేవి

ప్రతి తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి పర్వదినమున ‘భజగోవిందం’ నిర్వహించుట ఆనవాయితీగా పెట్టుకున్నాము. వచ్చే వైకుంఠ ఏకాదశి తేది 23-12-2012 నాడు కూడా తప్పక భజగోవిందమును నిర్వహించాలని దృఢ నిర్ణయం తీసుకున్నాను. గత కొన్ని నెలల క్రితము ఈసారి భజగోవిందం చేయకూడదని డబ్బులు మిగులుతాయనుకున్నాను. డా॥ రమణాచారి గారు కూడా ఈసారి వద్దన్నారు. కాని గతంలో స్వామివారు చూపిన లీలల ప్రభావంతో నాలో నూతనోత్సాహం నిండింది. నా భార్య కూడా సంపూర్ణ సహకారం అందించి చేయవలసిందిగా ప్రోత్సహించింది. కాబట్టి ఎలాగైనా స్వామివారి ఈ సేవను, ఏ లోటు రానీయకుండా అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చాము. డా॥ రమణాచారి, డా॥ రమాప్రభ బృందం వారికి భజగోవిందం నిర్వహించుదామని తెలిపాను. సన్నాహాలు చేసుకుంటున్నాను. నా ఆత్రుతను గమనించిన స్వామివారు చక్కని లీలతో ఈ భజగోవిందం నిర్వహించుట వలన కలిగే లాభాన్ని చూపెట్టారు.

**ఒక విషయం :** స్వామివారు నాకు ప్రసాదించిన ప్రతి సేవ అంటే... జపసమర్పణ, రథయాత్ర, శ్రీవేంకటేశం మాసపత్రిక వీటిని సమర్థవంతంగా నిర్వహిస్తే గోవిందుని పొందగలవని స్వామివారు గతంలో స్పష్టంగా చెప్పారు. కాని ఈ భజగోవిందం సేవను నిర్వహిస్తే ఏమి లభించునో తెలియదు. డా॥ రమణాచారి గారు టిటిడి ఈఓగా ఉన్నప్పుడు నిర్వహించమని చెప్పారు కాబట్టి దీనిని స్వామివారి ఆజ్ఞగా భావించి నిర్వహిస్తున్నాను తప్ప దీనిని నిర్వహిస్తే కలిగే భాగ్యం గురించి ఇంతవరకు తెలియదు. కాని ఈనాటి లీలలో స్వామి వారు ఈ సేవను నిర్వహిస్తే కూడా గోవిందుని పొందగలవని చెప్పారు. ఈ మాటను సాక్షాత్ శ్రీగోదాదేవి ద్వారా చెప్పించారు. ఆ లీల ఈవిధంగా ఉంది.

**తేది 16-12-2012 కల:** నేను స్వామివారి భజగోవిందమును ఒక ఇంటి మేడపైన అంటే మొదటి అంతస్తులో ఉన్న ఒక ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నాను, ఈ ఫంక్షన్ హాల్ ముందు పెద్ద ఓపెన్ బాల్కనీ ఉంది. దీనిలో ఎందరో భక్తులు పాలు పంచుకుంటున్నారు. భజనలు చేసేవారు, పాటలు పాడేవారు, వినేవారు ఎందరో ఉన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములో అన్నమయ్య ప్రాజెక్ట్ డైరెక్టర్ గా పనిచేసిన శ్రీమాన్ కామిశెట్టి శ్రీనివాసులు కూడా వచ్చారు. ఫంక్షన్ హాలు ముందున్న పెద్ద బాల్కనీలో భక్తులు భజనలను సరి చేసుకుంటున్నారు. ఇంతలో మా ప్రక్క ఇంటి మొదటి అంతస్తులో ఉన్న దాదాపు 20 సంవత్సరాల పెండ్లికాని యువతి చక్కని అందం కలిగి పసుపు రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి కనబడ్డది. ఈమె శ్రీచూర్ణంతో చక్కని నామం ధరించి, బహుచక్కగా, అందంగా, ఉబ్బు చెంపలతో నిజంగా శ్రీఆండాళ్ మాతలాగానే దర్శనమిచ్చింది. ఈమె వారింటి బాల్కనీలో నిలబడి మమ్ములను, మా ఆత్రుతను జాగ్రత్తగా పరిశీలించింది. మా ఫంక్షన్ హాల్, వీరి బాల్కనీ అత్యంత సమీపంలో ఉండుట వలన ఈమెను చాలా స్పష్టంగా దర్శించాను. మనం ఫొటోలో దర్శించే శ్రీఆండాళ్ మాతకు, ఈమెకు ఎలాంటి తేడా లేదు. ఇంతలో ఈమె మా భజనలను ఉద్దేశించి ఏదో ఒక తమిళ పాశురం పాడింది. నేను ఈ పాశురమును మరిచిపోయాను కాని దీనర్థం మాత్రం... గోవిందుని చేరుటకు ఇదంతా చేస్తున్నారు అని అర్థం. దీనిని విన్న శ్రీమాన్ కామిశెట్టి శ్రీనివాసులు గారు ఆమె మాటలకు ముగ్ధులైనారు. ఈమె ఎవరని నన్ను అడిగారు. నాకు ఆమె సుపరిచితురాలు (కలలో మాత్రమే) కాన ఆమె పేరు ‘‘ఆండాళ్’’ అని అతనితో అన్నాను. ఆ తరువాత భజనలను సాగించుటకు



గోవిందుడిని పొందడానికి భజగోవిందం నిర్వహిస్తున్నారని చెప్పిన గోదాదేవి

హాలులోనికి వెళ్ళాము. అక్కడ నాకు పరిచయమున్న ఒక వ్యక్తి బహు చక్కగా నేను ఊహించని విధంగా పాటలను పాడాడు. అందరం చాలా సంతోషించాం. కల చెదిరింది.

ఈ విధంగా నేను అత్యంత ఉత్సాహముతో ఏ లోటూ లేకుండా భజగోవిందమును నిర్వహిస్తే గోవిందుని పొందవచ్చునని సాక్షాత్ గోదాదేవి మాతతో స్వామివారు చెప్పించారు. దీనిని మరో రకంగా చెప్పాలంటే... నాకు నిర్దేశించిన ప్రతి సేవ లక్ష్యం గోవిందుని పొందుటకే... అని అర్థం.

## ధైర్యం వహించి ముందుకు సాగుట

శ్రీవేంకటేశ్వరుడు అది వద్దు, ఇది వద్దు అంటూ కఠినమైన శిక్షణ ఇచ్చుట ప్రారంభించారు, పైగా వారు నాకు గురువు, దైవం, యజమాని సర్వం ఆయనే! దీనికి భయపడి నేనేమి చేయాలో... ఎలా జీవించాలో... తెలియని అయోమయ స్థితికి చేరాను. ఈ సందర్భంగా గతంలో స్వామివారి ఒక హృదయాంతర భావం గుర్తుకొచ్చింది. ‘‘నీవు ముందుకు పోతూ ఉండు, తప్పులుంటే వెనక సరిచేస్తాను’’ అని చెప్పారు. దీనర్థం: నేను వక్రమార్గంలో పయనిస్తున్నప్పుడు స్వామివారు తగిన సూచనలు ఇస్తారని భావించి మురిసిపోతూ ధైర్యం వహించి తోచిన విధంగా ముందుకు సాగాను.

## భజ గోవిందం

**తేది 23-12-2012:** ఈరోజు వైకుంఠ ఏకాదశి. హిమాయత్ నగర్ లోని టిటిడి హాలులో సాయంత్రం భజగోవిందం ఏర్పాటు చేశాము. దీనిని అత్యంత ఉత్సాహంగా డబ్బులకు వెరవక చక్కని ఏర్పాట్లు చేశాము. సాయంత్రం 4 గంటల నుండి ఎన్నో భజన బృందాలు వంతుల వారీగా హరినామ సంకీర్తన చేశారు. సాయంత్రం 6.45నుండి భజగోవిందమును ప్రారంభించాము. డా॥ రమాప్రభ బృందం వారు భజగోవిందమును చక్కగా ఆలపించారు. శ్రీమాన్ రమణాచారి గారు మరియు చాలామంది భక్తులు పాల్గొన్నారు. భజన బృందాలకు బహుమతులను అందించాము. రాత్రి 9.00 గంటలకు ప్రసాద వితరణ తరువాత స్వామివారిని దర్శించి ఇంటికి వచ్చాము. ఎంతో సంతోషం కలిగింది.

## జన్మ జన్మల సేవను ప్రసాదించుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్ శ్రీమన్నారాయణుడు, నాకు ప్రభువు. నేను వారి ఎన్నో సేవలను చేస్తున్నప్పటికీ

ఏనాడూ ముక్తిని కాంక్షించలేదు. ఆయన సేవలో పరమానందం అనుభవించేవాణ్ణి కాబట్టి మరింత సేవా భాగ్యాన్నే కోరుకున్నాను. స్వామివారు కూడా ఎన్నో మహత్తరమైన లీలలను ప్రసాదించారు. అందులో కొన్ని నా జీవితాన్ని ధన్యము చేసే ఆణిముత్యాలుగా, మరికొన్నింటికి పరవశుణ్ణైనా నా పూర్తి జన్మను ఈ అనుగ్రహానికి ప్రతిగా సేవ చేసి ఋణం తీర్చుకుందునని కేటాయించుకున్నాను. స్వామి ప్రసాదించిన ప్రతి లీల వ్రాసుకున్నప్పటికీ, వారం, పది రోజుల తరువాత మరిచేవాడిని. అందుకని వారి ఋణం తీర్చుకొనుటకు అంకితం చేసిన జన్మలు కేవలం ఐదు ఆరు ఉండవచ్చునని భావించేవాణ్ణి. కాని 2008 సంవత్సరం ప్రాంతములో "పూర్తి జన్మను కేటాయించి స్వామి రుణం తీర్చుకోగలిగే అనుగ్రహాలు14 పొందినట్లు చెప్పారు". అంటే నేను 14 జన్మలు ఎత్తి ఈ జన్మలో చేసినంత సేవ చేస్తే తప్ప ఆయన ఋణమును తీర్చుకోలేనన్నమాట. ఈ విషయాన్ని కూడా 2013 సంవత్సరం వరకు పూర్తిగా మరచిపోయాను. అందుకని గత కొన్ని రోజుల నుండి స్వామివారిని తీవ్రంగా ప్రార్థించసాగాను. నేను మీ సేవలో తృప్తి చెందలేదని, తృప్తి చెందేవరకు సేవాభాగ్యాన్ని ప్రసాదించమని గాఢంగా ప్రార్థించాను. అంతేకాకుండా భవిష్యత్తులోని ప్రతి జన్మలో నా మనస్సు మీ పాద పద్మాల పైననే ఉండాలని, ఈ జన్మలో లభించిన సేవ లభించాలని, ఆ విధంగా కరుణించమని ప్రార్థించసాగాను. నేను జన్మ జన్మలకు మీ సేవకుడిగా ఉండే వరాన్ని ప్రసాదించుమని దీనాతి దీనంగా వేడుకున్నాను. బహుశా దీని సమాధానమే ఈ లీల. ఇది ఒక మహత్తరమైన వరము. ఈ వరముతో నేను పరవశించిపోయాను. స్వామివారికి ఏవిధంగా కృతజ్ఞతలు తెలపాలో తెలియలేదు. పూర్వం అల్పాయుష్కుడైన మార్కండేయుణ్ణి ఏ విధంగా పూర్ణాయుష్కుడిగా చేశాడో నన్ను కూడా ఆ విధంగా అనుగ్రహించుదునన్నారు. కాని ఈ లీలను పొందినప్పుడు దీని అర్థమును గ్రహించలేదు. 2020 సంవత్సరంలో నా పూర్తి అనుభూతులను చదివినప్పుడు మాత్రమే అర్థం చేసుకున్నాను. ఆ లీల ఈ విధంగా ఉంది.

మా సొంత గ్రామం చిన్నగుండవెల్లిలో 'తోటబావి' అనే పేరుగల ఒక బావి ఉంది. అది దీర్ఘచతురస్రాకారంగా 20'X 70' సైజు కలిగి 100' లోతు ఉంటుంది. నేను ఎన్నోసార్లు ఈ బావిలోనికి దిగి రకరకాల పనులతో పాటు పూడిక కూడా తీశాను. ఈ బావి లోపల ఉన్న దరులు లేదా వరలు నాకు సుపరిచితము. ఈ లీలలో స్వామివారు ఈ బావిని ఉపయోగించుకున్నారు.

**తేది 18-01-2013 కల:** ఈ కలలో నాకు మా ఊరి తోటబావి కనబడ్డది. నేను ఆ బావి గడ్డ మీద ఉన్నాను. లోనికి చూచాను, సగము వరకు నీరు ఉన్నటుల కనిపించింది. నాలో ఏదో తెలియని కోరికచే, నేను ఈ బావిలోనికి ఎలాగో దిగి నీటిలో ఈత కొడుతున్నాను. ఇంతలో ఆ బావి లోపల ఒక దరిలో గుహ కనబడ్డది. ఎప్పుడూ చూడని ఈ గుహను చూచి ఆశ్చర్యపోయాను. అత్యంత ఉత్సాహముతో దాని లోపలకు అలాగే చూశాను. ఆ గుహలో చిన్నపాటి ఒక పురాతన ఆలయాన్ని చూశాను. ఈ ఆలయానికి తలుపులు లేవు. తెరచియే ఉన్నది. అందులో శివుడు కూర్చుండి ధ్యానభంగిమలో ఉన్నాడు. ఈ బావిలోని నీరు గుడి లోపల పాదము మునిగే వరకు ఉన్నవి. ఈ శివునికి కొంచెం ముందర శివలింగం కనబడ్డది. దానిని ఒక బాలుడు గట్టిగా అదిమి పట్టుకుని ఉన్నాడు. ఏవిధంగా మార్కండేయుడు శివలింగాన్ని తన హృదయానికి గట్టిగా అదిమి పట్టుకుంటాడో... అలా పట్టుకున్నాడు. శివుడు, శివలింగం, ఈ బాలుడు ప్రాణం ఉన్నవారిలాగా కనబడ్డారు. దీనిని పరీక్షగా కొంత తడవు చూచాను. వెంటనే ఈ శివలింగం మరియు శివలింగమును పట్టుకున్న బాలుడు ఒక రాతి శిల్పం లాగా మారి కనబడ్డారు. గతంలో ఎప్పుడో రంగులతో అలంకరించి ఉన్న రాతి శిల్పం మాదిరిగా మారిపోయారు. బాలుడు తన చేతులతో లింగమును తన హృదయానికి హత్తుకుని తన తలను లింగంపై ఏటవాలుగా పెట్టి చూస్తున్నట్లుగా ఆ చిత్రము ఉన్నది. ఇంతలో ప్రక్కనే ఈ గుహకు ఆనుకుని మరొక గుహ ఉన్నటుల, అందులోను ఈ బావి నీరు అదే స్థాయిలో ఉన్నటుల కనబడ్డది. వెంటనే ఆ నూతన గుహలో దాదాపు ఒకటిన్నర అడుగుల ఎత్తు కలిగిన మరొక నల్లని లింగం కనబడ్డది. ఆ నూతన లింగం నన్ను బాగా ఆకర్షించింది. ఆ లింగం నన్ను తన హృదయానికి హత్తుకొమ్మని అంటున్నట్లు ఒక హృదయాంతర భావం ఏర్పడ్డది. వెంటనే పరవశంతో వెళ్ళి గట్టిగా అదుముకున్నాను. నా తలను ఆ లింగంపై మార్కండేయుని లాగా ఏటవాలుగా పెట్టి ప్రభూ! అంటూ నిట్టూర్చాను. కల చెదిరింది.

ఇది ఒక విశ్లేషణాత్మక కల. ఈ కల కన్నప్పుడు దీని అర్థమును గ్రహించలేదు. ఏదో స్వామి కరుణించారని మాత్రమే అనుకున్నాను. కాని కొంత యోగ్యత సాధించిన తరువాత దీని నిజమైన అర్థమును తెలుసుకున్నాను. "పూర్వం అల్పాయుష్కుడైన మార్కండేయుణ్ణి ఏవిధంగా దీర్ఘాయుష్కుణ్ణి చేశానో... నీకు కూడా జన్మ జన్మల స్వామివారి అనుగ్రహాన్ని లేదా సేవా భాగ్యాన్ని కలిగించుదుననే" వరమును ప్రసాదించారని భావించాను. ఎంతో ఆనందించాను. మరియు దీనిని మా తోటబావిని ఉపయోగించి చెప్పారు కావున నేను స్వామి వారు కోరినట్లు హరినామ క్షేత్రం ఏర్పాటు చేస్తేనే ఈ అనుగ్రహం లభించునని భావించుకున్నాను. దీన్ని మరో రకంగా అన్వయించుకున్నాను. ఈ జన్మలో నేను హరినామ క్షేత్రం ఏర్పాటు చేస్తే... స్వామివారు నా కారణంగా తరతరాలుగా స్మరింపబడతారు, మరియు తరతరాల భక్తులను అనుగ్రహిస్తారు. కాబట్టి నాకు హరినామ




మార్కండేయుడి ఆయుష్షు పెంచినట్లు జన్మ జన్మల సేవను ప్రసాదిస్తానని తెలుపుట

క్షేత్ర సేవను ప్రసాదించబోతున్నారని అర్థం.

## హరినామ క్షేత్రానికి భక్తులు రాగలరు

స్వామివారు విశ్లేషణాత్మకమైన మరో కలను ప్రసాదించారు. దీని అర్థం కూడా మా తోట బావి వద్ద హరినామ క్షేత్రము ఏర్పడునని సూచించే విధంగా ఉంది.

**తేది 26-01-2013 కల :** ఈ కలలో నాకు అత్యంత పరిచయమున్న బహుశా నేను పుట్టి పెరిగిన మా అమ్మమ్మ ఊరు లాంటి ప్రదేశములో తిరునాళ్ళు జరుగుచున్నవట. నేను ఈ తిరునాళ్ళకు యాత్ర చేస్తున్నాను. ఈ తిరునాళ్ళను చూచుటకు చాలామంది యాత్రికులు పోవుచున్నారు. యాత్రికుల సంఖ్య అధికంగా ఉంది. ఒక చీమల దండు లాగా ఎడతెగని సంఖ్యలో భక్తులు, యాత్రికులు ఆ ఊరికి పోవుచున్నారు. నేను కూడా ఈ తిరునాళ్ళను చూచుటకు ఒంటరిగానే నడిచిపోవుచున్నాను. మేము వెళ్ళు దారి, సిమెంట్ లేదా డాంబరుతో కాక మట్టి బాటనే ఉంది. ఇంకా ఆ ప్రాంతము అభివృద్ధి చెందలేదు. ఈ మట్టిబాటకు ఇరువైపులా అక్కడక్కడా చెట్లు, గుట్టలు ఉన్నవి. చాలామంది పోవుచున్నారు కావున నేను వారి మధ్యలో నడుచుకుంటూ పోవుచున్నాను. అది అడవి ప్రాంతము. అనుకోకుండా నా చూపు కుడిప్రక్కకు మళ్ళింది, దూరాన ఒక గుట్టను చూచాను. నా చూపు ఆ గుట్టపై పడగానే ఆ గుట్టకు ఇరువైపులా స్వామివారి శంఖు చక్రములు మరియు ఆ గుట్ట శిఖరము స్వామివారి ముఖము, కిరీటముగా మారి, నా ప్రభువైన శ్రీవేంకటేశ్వరుడుగా దర్శనమిచ్చారు. అప్పుడు నా మదిలో ఇలా అనుకున్నాను. ప్రతి గుట్ట, పుట్ట నా ప్రభు శ్రీవేంకటేశ్వరుని రూపమే, ఆయన అన్నింటిలోనూ ఉన్నాడని భావించాను. మరియు నా నడకను అలాగే ముందుకు సాగించాను. తరువాత నా చూపు దారిలో నా ముందు నడిచే వారిపై పడింది. శ్రీమాన్ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, అప్పటి టిటిడి ఈఓ గారు, ఆయన సహజమైన వస్త్రాలు అంటే ధోవతి, అంగీ మరియు కండువా ధరించి నాకు ఎదురుగా నడిచి వస్తున్నారు. చూచుటకు ఈయన ఈ తిరునాళ్ళను నా కంటే ముందే తిలకించి వస్తున్నారని అర్థం అయ్యింది. కల చెదిరింది.

బహుశా ఎలాంటి అభివృద్ధి చెందని, రోడ్డు మార్గం కూడా సరిగా లేని మా ఊరిలో హరినామ క్షేత్రం ఏర్పడునని, ఎంతో మంది భక్తులు రాగలరని భావం కావచ్చు. లేదా నేను భవిష్యత్తులో ఒక యాత్ర చేయుదునని కూడా కావచ్చును, సరియైన అర్థం తెలియదు.

## కుంభమేళా దర్శించుట

**తేది 06-02-2013:** స్వామివారు సూచించినట్లు అలహాబాద్ లో జరిగిన మహా కుంభమేళాకు నేను, నా భార్యా, మిత్రులతో

కలిసిపోయాము. అక్కడ శ్రీశ్రీశ్రీ వ్రతధర్ నారాయణ రామానుజ జీయర్ స్వామివారి ఆశ్రమములో రెండు రోజులు ఉన్నాము. కుంభమేళాలో స్నానం చేసి వారణాసిని దర్శించి వచ్చాము.

## నలుగురితో కలవకూడదని సూచించుట, అపరాధము మన్నించుట

నా మనస్సు స్వామివారిపై కాకుండా అన్య విషయాలపై లేదా విలాస వస్తువులపై మరలినప్పుడు వెంటనే స్వామి వారు అది మంచిది కాదంటూ అలా చేయకూడదంటూ సూచనలిచ్చేవారు. ఈరకమైన సంఘటన ఒకటి జరిగింది.

గ్రీన్ కార్డు ఉంది కాబట్టి ఒక పదిహేను రోజుల కొరకు తేది 20-03-2013 నుండి 05-04-2013 వరకు అమెరికా వెళ్ళాము. ఫిలడెల్ఫియాలో నివసిస్తున్న మేనల్లుడు, శ్రీమాన్ మొసర్ల మాధవరెడ్డి ఇంట్లో ఉన్నాము. అతడు నాకంటే రెండున్నర సంవత్సరముల చిన్నవాడు ఒకే కాలములో యూనివర్సిటీలో చదువుకున్నాం, కాబట్టి అతని మిత్రులు కొందరు నాకు తెలుసు. మొదటిసారి వాడింటికి వెళ్ళాను, పైగా కొత్త ప్రాంతము, విలాసవంతమైన పరిస్థితులు, వాడికి సంబంధించిన స్నేహితుల మాటలు మరియు పార్టీలు చూడగానే నేను సాధారణ మానవునిగా రెండు మూడు రోజులు ప్రవర్తించాను. ఫలితంగా నిరంతరం అంతర్ముఖంగా నాలో సాగే స్వామి ధ్యానానికి విఘాతం ఏర్పడింది. మరియు లౌకిక విషయాల పట్ల ఆకర్షితుడనైనాను. దీనిని ప్రతిబింబించే విధంగా ఈనాటి కల వచ్చింది.

**తేది 25-03-2013 కల:** ఇది అంత ఎక్కువ గుర్తులేదు కాని ఎవరో కాష్టం అవుతున్నటుల, నేను చూస్తున్నటుల చెడుకు సంబంధించిన అపశకునపు కలను కన్నాను. ఇంతే కల.

తెల్లవారి దీనిపై ఆలోచించి తప్పు తెలుసుకుని స్వామివారిని క్షమించుమని నా సేవను స్వీకరించుమని, అపరాధము చేసినట్లైతే మన్నించమని ప్రార్థించాను. వెంటనే ఈ రాత్రి మరో కల వచ్చింది.

**తేది 26-03-2013 కల:** ఈ కలలో స్వామివారు నన్ను క్షమించినట్లు, నా సేవను స్వీకరించగలరనే విధంగా కల గన్నాను. ఎంతో సంతోషించాను. ప్రతిక్షణం ఆయన ధ్యానములో జీవిస్తూ మరింత భక్తి పెరిగే విధంగా చూడమని ప్రార్థించాను. దీని తరువాత మళ్ళీ నలుగురితో కలవడం మానివేశాను.

## మా అమ్మను చూపుట

మా అమ్మ 2008 సంవత్సరంలో చనిపోయింది. కాని ఈ మధ్యన ఆమెను చూడాలనే కోరిక బలంగా కలిగింది. వెంటనే శ్రీవేంకటేశ్వరుని మా అమ్మను చూపించమని ప్రార్థించాను. స్వామివారు చూపెట్టారు. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 19-04-2013 కల:** ఈ కలలో నాకు మా అమ్మ కనబడ్డది. నేను మా కుటుంబ సమేతంగా హైదరాబాద్ లో ఒక ఇల్లు కట్టుకుని నివసిస్తున్నామట. ఆ ఇంటిముందు ఉన్న స్థలములో మా తల్లి కీ.శే రుక్కమ్మ గారు మరియు ఆమె వెనుక మా పెద్ద అత్త (మేనమామ భార్య) రత్నమ్మ గారు నిలబడ్డారు. నేను ఇంటి నుండి బయటకు రాగానే మా అమ్మ నన్ను ఏదో ఏదో అంటోంది. అది ఇట్లున్నది, ఇది అట్లున్నది అన్నట్టు మాట్లాడింది. ఈ మాటలు విని వెనుక ఉన్న మా అత్త ముసి ముసిగా నవ్వింది. ఇది కల.

ఇందులో మా అమ్మ ఏమన్నదో నాకు గుర్తు లేదు. కాని చనిపోయిన మా అమ్మను మాత్రము స్పష్టంగా చూచాను. ఆమె చనిపోవుటకు 20 సంవత్సరాల ముందటి ఆరోగ్యంగా ఉన్నప్పటి రూపము లాగా కనబడ్డది. ఆమెను చూచి నేను చాలా సంతోషించాను. నా కోరికను తీర్చినందుకు స్వామివారికి కృతజ్ఞతను తెలుపుకున్నాను.

## ఆత్మ పరిశీలన

తేది01-05-2013: స్వామివారు యోగ్యత సాధించుమని ఎన్నోసార్లు చెప్పినప్పటికీ నేను దానిపైన ధ్యాస పెట్టలేదు. వ్యాపారానికి సేవకు సంబంధం లేదు. ఏ తప్పూ లేకుండా, సేవ చేస్తే సరిపోతుందని మాత్రమే ఆలోచించేవాడిని. ఒక ప్రక్క వ్యాపారము, మరోప్రక్క స్వామిసేవ చూచుకుంటూ కాలము గడిపాను. చివరికి నీచాతి నీచ స్థితికి చేరాను, శక్తి లేనివాడిగా చితికిపోయాను. ఫలితంగా నా ఆలోచనలో మార్పు వచ్చింది. వ్యాపారములో మునిగి జీవించాను కాబట్టి గతంలో నేను సంపూర్ణ శరణాగతిని ఘటించిన విషయం కూడా మరచాను. కష్టాలను తట్టుకోలేక ఈమధ్య మళ్ళీ స్వామివారికి సంపూర్ణ శరణాగతుణ్ణి కావాలని ప్రయత్నించినప్పటికీ స్వామిని ఒప్పించలేకపోయాను. కాబట్టి సాధారణ జీవితం గడుపుచున్నాను. చివరికి గత కొన్ని నెలల నుండి నా ఆరోగ్యము బాగాలేదు. డయాబెటిక్ న్యూరోపతిచే అరికాళ్ళలో మంటలు తట్టుకోలేనంత రాసాగాయి. దీని ఉపశమనమునకు నేను చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీనితో పాటు, శరీరములోని ఇతర బాధలు కలిసి నన్ను మానసికంగా పూర్తిగా స్వామివైపుకు మళ్ళించాయి. మరోప్రక్క నాకున్న ప్రతి ఆస్తి నేను నీ వద్ద ఉండను అన్నట్లు, ప్రతి దానిలో ఏదో ఒక జగడము తలెత్తడము జరిగింది. 20 సంవత్సరముల అనుభవం ఉన్నవాణ్ణైనప్పటికీ మోహ పరవశముతో తప్పుడు స్థలాలు కొనడమే దీనికి కారణంగా భావించాను. కొన్ని సమయంలో ఇది బంగారంగా కనబడ్డది, అదే ఇప్పుడు బాధ కలిగిస్తోంది. ఏమి చేయాలో తోచలేదు. చివరికి ఈ జీవితంపై విరక్తి కలిగింది. ఈ ఆస్తులు అంతస్తులు, శరీరము, ఇల్లు, కుటుంబ సభ్యులు ఏదీ నాది కాదని తెలిసింది. వీటిపై రోజు రోజుకు ప్రేమాభిమానాలు తగ్గాయి. చివరికి ఈరోజు స్వామితో

ఇలా ప్రార్థించాను. శ్రీవేంకటేశ్వరా! నాకున్న ప్రతి ఆస్తి, నేను సంపాదించింది, మరియు పూర్వీకుల నుండి సంక్రమించింది మొత్తం మీకు సమర్పిస్తున్నాను. దయచేసి స్వీకరించండి. నన్ను మీ సేవకుడిగానే ఉండనీయండి. ఈ జగడాలు, తగాదాలు మీరే చూచుకోండి. ఏ నిర్ణయమైనా మీరే తీసుకోండి. మీ ఆజ్ఞ శిరసా వహిస్తాను. మీదే అంతిమ తీర్పని సమర్పిస్తూ మ్రొక్కాను. వీటిని స్వామి తన సేవకు వినియోగించుకోవాలని కోరాను. వీటిపై ఇప్పటినుండి నా పెత్తనము లేదని భావించాను. కాని నన్ను సదా సంతోషంగా ఉంచుమని కోరాను. ఈ రాత్రి కలలో స్వామివారు సంతోషించినట్లు హృదయాంతర భావం ఏర్పడింది. ఎంతో మురిసిపోయాను.

## పరీక్షించుట

ఒక వారం తరువాత తేది 08-05-2013 ప్రాంతమున మళ్ళీ ఈ విధంగా ఆత్మ పరిశీలన చేసుకున్నాను.

2005 సంవత్సరంలో మియాపూర్ జగడము జరిగినప్పుడు నా మనస్సు చాలా చంచలమైంది. నాది ఏదో పోతుంది, నేను సంపాదించింది దోచుకుపోతున్నారన్న బాధ కలచివేసింది. దీనితో నా మనస్సు నా ఆజ్ఞలో లేకుండుట జరిగింది. ధ్యాసంతా ఆస్తిని కాపాడుకొనుట యందే నిలిచింది. ఇది జరిగి 2013 సంవత్సరం నాటికి 8 సంవత్సరాలు గడిచాయి. ఈ 8 సంవత్సరాలు నేను స్వామివారి సేవలో ఉన్నాను కాబట్టి నా మనస్సు భగవంతునివైపు మళ్ళిందనుకున్నాను. నాలో కొంతైనా 'నా' అన్నది తగ్గిందని భావించాను. ఒకసారి అంటే 2009 సంవత్సరం ప్రాంతంలో నేను 'నా' అన్నది తగ్గించుకున్నానని స్వామివారితో చెప్పినప్పుడు వారు ఇంకా తగ్గలేదని చెప్పారు. ఆ తరువాత మారుటకు చాలా ప్రయత్నాలు చేశాను. ఓపికగా కూర్చుండి ఆలోచించినప్పుడు మారానని భావించేవాడిని. డబ్బుపైన వ్యామోహాన్ని చాలావరకు తగ్గించుకున్నాను అనుకున్నాను, మరియు ఈ రకమైన భావన వచ్చింది. ''మునుపటి మియాపూర్ తగాదాలు మళ్ళీ వచ్చినచో నేను నిర్భయంగా స్వామిపై భారం వేసి నిశ్చింతగా ఉండగలను'' అని అనుకున్నాను. దీనిని గ్రహించిన స్వామివారు అదేవిధమైన ఒక భూ సమస్యను నన్ను పరీక్షించునట్లు కొద్ది రోజుల కొరకు తెచ్చిపెట్టాడు. దీని వలన నేను పూర్వము లాగే భయపడిపోయాను. క్షణ క్షణం భీతి చెందడం మొదలుపెట్టాను. స్వామిపై భారం వేసి ఉండలేకపోయాను. ఎలాగైనా ఆస్తిని రక్షించుకోవాలనే తపన పిచ్చివాణ్ణి చేసింది. నా మనస్సు పరుగులు తీసింది. స్వామిపై భారం వేశాను అనే దానిని మరిచినట్లు ప్రవర్తించాను. ప్రతిక్షణం స్వామిని స్మరిస్తూ ఆస్తిపై మనస్సును లగ్నం చేశాను. చివరికి ఈరోజు స్వామిముందు నా తప్పును ఒప్పుకుంటూ ఈ విధంగా ప్రార్థించాను.

హే ప్రభూ! వేంకటేశ్వరా! నాలో ఏమాత్రమూ మార్పు రాలేదు. 'నా' అన్నది తగ్గలేదు. మీపై శరణాగత భావము పెరగలేదు. వెనకటి మాదిరిగానే మనస్సు కల్లోలంగా ఉంది, నేను మారలేదు నన్ను క్షమించమంటూ వేడుకున్నాను. చివరికి ఏది ఏమైనా నేను డబ్బు పెట్టి కొన్నాను, దోచుకోలేదు, మోసం చేయలేదు, ధర్మపరంగా సంపాదించాను, అన్యాయాన్ని, మోసాన్ని ఎదిరించాను కాబట్టి నన్ను మీరు రక్షించి తీరవలెనని సమర్థించుకున్నాను. ఆస్తి విషయానికొచ్చేసరికి నాలో చాలా మార్పు వచ్చింది. నేను నా ప్రభు ముందు సిగ్గుపడ్డాను. ఇన్ని రోజుల నా సాధన, భక్తి నన్ను మార్చలేకపోయాయని బాధ కలిగింది. స్వామివారి సేవకు ఎంత ఖర్చు పెట్టినా బాధ కలిగేది కాదు కాని అన్యాయంగా ఆస్తులను కబళించుటను సహించలేకపోయాను. స్థిత ప్రజ్ఞతను సాధించలేదు.

## రథయాత్రకు స్వామి రక్షణ

ఈ సంవత్సరం రథాన్ని క్రొత్తది దూరపు ప్రాంతమైన చెన్నై తీసుకెళ్ళాలని భావించాము. ఈ సందర్భంగా స్వామివారు ఒక లీలను చూపారు.

ఈ కల మేము ఈ జపానికి ఇంటిలో పూజలు నిర్వహించునప్పుడు వచ్చింది. ఈసారి మేము హైదరాబాద్ తరువాత ఒక నూతన ప్రాంతము చెన్నైకి పోవాలనుకున్నాము. అన్ని ఏర్పాట్లు చేసుకున్నాము. శ్రీమాన్ వెంకయ్య నాయుడు కూతురు శ్రీమతి దీపా వెంకట్ గారు చెన్నైలో రథయాత్రను ప్రారంభిస్తారని చెప్పారు. ఈ మధ్యన స్వామివారి లీలలను చూడని కారణంగా స్వామివారిని లీలలను చూపమని ప్రార్థించాను. వారు ఇలా చూపారు.

30-07-2013 కల : ఈ కలలో మేము రథాన్ని తెలియని ఒక క్రొత్త ప్రాంతానికి తీసుకుపోయాము. అది ఒక రైల్వే స్టేషన్ లాగా ఉన్నది. లోనికి వెళ్ళునప్పుడు అక్కడక్కడ పప్పులు, సిగరెట్లు అమ్మేవారు నిలుచుని వారి వారి పనులను చేసుకుంటున్నారు. రథము లోనికి వెళ్ళిందట. అది నాలుగు వైపులా మూసిన పొడవాటి సొరంగము లాంటి ఒక ప్రత్యేకమైన నూతన మార్గం గుండా వెళ్ళుచున్నదట. నేను ఆ రథము వెనక వెంబడిస్తున్నాను. రథం కనబడలేదు, వెళ్ళుచున్నదన్న ఊహ మాత్రమే. ఆ ప్రాంతము నాకు క్రొత్త. అక్కడ మాకు తెలిసినవారు ఒక్కరూ లేరు. అందరూ ముస్లింల మాదిరిగా, ఆదరించని వారుగా ఉన్నారు. నేను దీనిని గమనించి ఒకింత దిగులు చెంది, భయముతో ఆ రథము వెనుక ఆ సొరంగము లాంటి దానిలోకి ఒకింత భయముతోనే అడుగిడాను. వెంటనే నా కాలు క్రింద పడకపూర్వమే పుట్నాలు అమ్ముకునే ఒక నల్లని దృఢకాయుడు నా వద్దకు పరిగెత్తుకు వచ్చాడు. వీడిని చూచి అన్నిప్రక్కల నుండి

ఒక ఆరు ఏడు మంది నా చుట్టూ క్షణంలో చేరిపోయారు. దీనిని గమనించి నేను కొంచెం భయపడ్డాను. కాని ఆ దృఢకాయుడు "మఫ్టీలో ఉన్న పోలీసువారిమి, మా బాస్ మీ రక్షణ నిమిత్తము మమ్మలను ఏర్పాటు చేశారు" అని చెప్పాడు. కల చెదిరింది. అంటే మేము రథాన్ని ఏ ప్రాంతానికి తీసుకుపోయినా మాకు స్వామివారు రక్షణ కల్పిస్తున్నారని, మమ్మలను వదలలేదని భావించాను. స్వామివారికి శతకోటి ప్రణామాలర్పించాను.

## 11వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

ఈ జపానికి తేది 27-07-2013 నుండి 02-08-2013 వరకు మా ఇంటిలో తృప్తిగా పూజించాము. తేది 02-08-2013 నాడు రథయాత్ర ప్రారంభ కార్యక్రమము జరిగింది. ఈ రథము తేది 18-08-2013 వరకు హైదరాబాదులో తిరిగింది. పిదప ఈసారి చెన్నైలో త్రిప్పాలని అక్కడికి తేది 20-08-2013 నాడు వెళ్ళాము. నిజానికి ఇక్కడ 5 రోజులు తిరగాలి కాని స్వామివారి లీలలో భాగంగా కేవలం రెండు రోజులే త్రిప్పాము. ఆ తరువాత పుత్తూరు, తిరుత్తణి, కంచి, శ్రీకాళహస్తిలలో త్రిప్పుకొని తేది 26-08-2013 నాడు తిరుపతి చేరాము. తేది 27-08-2013 నాడు స్వామివారి పాదాలకు సమర్పించి పూజించాము.

తేది 28-08-2013, గోకులాష్టమి నాడు ఎస్.వి డైరీఫాం లోని శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము వద్ద జపహోమాదులు నిర్వహించి, అప్పటి టిటిడి ఈఓ శ్రీమాన్ ఎం.జి గోపాల్ గారు హోమ పూర్ణాహుతి కావించి జప సమర్పణ చేశారు. మరియు 12వ పర్యాయంగా 7 కోట్ల జపమును ప్రారంభించారు. ఆ తరువాత భక్తులు తలా కొంత జపమును స్వామివారికి సమర్పించారు. ఆ తరువాత కొండపైకి వెళ్ళి స్వామివారిని దర్శించి తేది 30-08-2013 నాడు హైదరాబాద్ వచ్చాము. పాదాల మండపము పైన మరియు జప సమర్పణ సమయాన స్వామివారిని ఎప్పటిలాగా దర్శించుకున్నాను.

## స్వామి సేవకు ధనాన్ని సమకూర్చుట

మేము 11వ పర్యాయంగా 7 కోట్ల జపాన్ని సమర్పించి హైదరాబాద్ కు ట్రెయిన్ లో తిరిగి వస్తున్నప్పుడు ఒక కల కన్నాను. అది ఈ విధంగా ఉన్నది.

30-08-2013 కల : ఈ కలలో రథము తిరుగుచున్నదట. అది ఒక మార్గమున వెళ్ళుచున్నది. వెనుక భక్తులు డబ్బులు వేస్తారని ఒక దుప్పటిని నేలపై పరిచాను. కాని ఆ నేల చదునుగా లేకుండా చిన్న చిన్న గుంతలుగా ఉన్నది. భక్తులు వారి




స్వామి వారు రక్షణ కల్పించుట

శక్త్యానుసారం డబ్బులు విసిరారు. అవి ఆ దుప్పటిలో అక్కడక్కడ కుప్పలుగా చేరాయి. చివరికి వాటిని ఎత్తునప్పుడు నేను ఇంతే కదా? కొద్ది డబ్బులే కదా అని భావిస్తూ ఎత్తాను. కాని ఆ డబ్బులు ఎత్తిన కొద్దీ ఇంకా తగ్గటం లేదు. బహుశా డబ్బులు గుంటలోనికి వెళ్ళి బయటికి ఎక్కువగా కనబడలేదు. నేను ఊహించిన దానికంటే అధికంగా వచ్చాయి. కల చెదిరింది.

గత కొన్ని సంవత్సరాల నుండి మేము ఆర్థిక ఇబ్బందులతో ఉన్నాము. రథయాత్ర బహు కష్టంగా నిర్వహించాము. బహుశా స్వామివారి కృపతో మా కష్టాలు తీరును అని భావించాము. స్వామివారు సూచించినట్లు ఆ తరువాత శ్రీమతి దీపా వెంకట్ గారు మా సంస్థకు కొంత ధన సహాయం చేశారు.

ఒక విశ్లేషణ : శ్రీవేంకటేశ్వరుడు ఎన్నోసార్లు భయపెట్టి నన్ను తన దారి లోనికి తెచ్చుకున్నాడు. భగవంతుడు భక్తుణ్ణి భయపెట్టి పనులు చేయించుట సమంజసమేనా? అనే ప్రశ్న కొందరికి రాక మానదు. ఇందుకు నేను ఏవిధంగా... ఎందుకు స్వామివారిని ఆశ్రయించాను అనే విషయం తెలుసుకొనుట ముఖ్యం.

స్వామివారు, వారి సేవను ప్రసాదించుటకు పూర్వము, ఒక సందర్భములో నాది నేను నాకున్న సర్వస్వంతో పాటు స్వామివారికి సమర్పించబడ్డాను. నేను మీవాడినని, నన్ను లోకానికి ఉపయోగపడే సేవకు ఉపయోగించుకొమ్మన్నాను. పూర్వము మీరు ఎలాగైతే రామాయణాన్ని రచించి, మీకు అవసరాన్ని కల్పించుకుని ఆంజనేయుడు మొదలగువారికి ఏ విధముగా సేవాభాగ్యం కల్పించారో... అదే విధంగా నేడు కూడా మీకు అవసరాన్ని కల్పించుకుని నాకు సేవాభాగ్యం ప్రసాదించమన్నాను. మరియు నేను అల్పుడనని, పైగా చంచలిత మనస్సు కలిగిన కలియుగ మానవుణ్ణి కావున నన్ను ఎప్పటికప్పుడు చక్కబరిచే బాధ్యత మీదే అంటూ ప్రార్థించాను. దీనికనుగుణంగా చిన్నగుండవెల్లిలో 'హరినామ క్షేత్రం స్థాపన' అనే పనిని కల్పించుకుని దానిని సాధించు బాధ్యతను నాకు అప్పచెప్పారు. ఇది సాధించాలంటే... స్వామివారి సాక్షాత్కారాన్ని పొందగలిగే యోగ్యత సాధించవలసి ఉన్నదని దిశా నిర్దేశం చేశారు. అందులో భాగంగా నాలోని వికారాలను తొలగించి యోగ్యుణ్ణి చేయుటకు కఠిన శిక్షణ ఇస్తున్నారు. అల్పుణ్ణి, పైగా చంచలిత మనస్సు కలిగిన కలియుగ మానవుణ్ణి కావున సామ దాన భేద దండోపాయాలు ప్రయోగిస్తూ నన్ను తన దారికి తెచ్చుకుంటున్నారు. ఈవిధంగా నన్ను దండించడం నా సమ్మతితోనే జరుగుతోంది. పైగా నేను ఆయన సొత్తును కాన ఆయన ఇష్టం వచ్చినట్లు వాడుకోవచ్చును. బహుశా ఇది నాకు మాత్రమే ప్రత్యేకము. భగవంతుడు ఇతర భక్తులను ఈవిధంగా దండించకపోవచ్చును. దండనతో పాటు దేవతలకు లభించని అనుగ్రహాలు ప్రసాదించాడని కూడా గుర్తుంచుకోవాలి.


## తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

**స్వామివారి 700 దివ్యలీలలు**

1వ మరియు 2వ సంపుటములు

**ఉచిత పంపిణీ**




**ఆసక్తి కలవారు ఈ క్రింది అడ్రస్ నుండి నేరుగా పొందవచ్చును. లేదా పోస్టు ద్వారా పొందగోరు వారు పోస్టు ఖర్చుల నిమిత్తం సంపుటము ఒకంటికి రూ. 75/- లను ఫోన్‌పే / గూగుల్ పే / పేటీఎం ద్వారా 9348212354కు మీ అడ్రస్‌తో పాటు పంపి పొందవచ్చును.**

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

**ఇ.నం. 1-1-53, వీధి నం.1, హబ్సిగూడ, హైదరాబాద్ - 500 007. ఫోన్:040-27175050, సెల్: 93482 12354 (మెసేజ్ మాత్రమే)**


నా దశ : తిరుమల లాంటి ఒక ఆలయానికి నిర్వాహకునిగా ఉంటావన్నారు, స్వామివారి దర్శనభాగ్యం ప్రసాదించారు. గోవిందుని పొందుటే లక్ష్యంగా సేవను ప్రసాదించారు. స్వామివారి జన్మ జన్మల సేవను ప్రసాదించారు. మా అమ్మను చూపారు. స్వామివారు మా వెనుక ఉండి సర్వదా రక్షిస్తున్నారు.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

## తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చుమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). **9348212354** నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

## 93482 12354

# తిరుప్పావై

## శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు



గత సంచిక తరువాయి

### 16వ పాశురము

నాయగనాయ్ నిన్ఱ నన్దగోపనుడైయ
కోయిల్ కాప్పానే!, కొడిత్తోన్ఱుమ్ తోరణ
వాశల్ కాప్పానే! మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్,
ఆయర్ శిఱుమియరోముక్కు, అఱైపఱై
మాయన్ మణివణ్ణన్ నెన్నలే వాయ్ నేర్ న్దాన్
తూయోమాయ్ వన్దోమ్ తుయిలెళప్పాడువాన్
వాయాల్ మున్న, మున్నమ్ మాత్తాదే అమ్మా! నీ
నేశ నిలైక్కదవమ్ నీక్కేలో రెమ్బావాయ్.

తాత్పర్యం – ఇప్పటిదాకా చేరవలసిన భాగవత గోష్ఠి అంతా చేరినది. ఇక నందగోపుని ఇంటికి చేరి లోపల ప్రవేశించవలసి ఉంది. ద్వారపాలకులను లేపాలి.

మాకందరకును నాయకుడయిన నందగోపుని యొక్క భవన ద్వారపాలకుడా! (లేక) మాకు నాయకుడవై యున్న ఓ నందగోపుని భవన ద్వారపాలకుడా! గరుడధ్వజము ఎగురుచు గోచరించు తోరణము ప్రకాశించు రెండవవాకిలి పాలించుచుండు ఓ రెండవ ద్వారపాలకుడా! మాణిక్య ఖచితమైన తలుపుల తాళములను తెరువుమా! మా గురించి భయముచే శంకించ నవసరము లేని అజ్ఞానులమైన చిన్ని గోపికలము కదా! మాకు వ్రతాంగమైన పఱై అనుదానిని యిచ్చెదనని ఆశ్చర్యగుణభూతుడై మాణిక్యవర్ణుడైన శ్రీకృష్ణుడు నిన్ననే వాగ్దానము చేసివేసెను. అందులకై మేము నిదురనుండి మేల్కొలుపు పాడుటకై పవిత్రులమై వచ్చితిమి. మొట్టమొదటనే నోటితో అడ్డు పెట్టవద్దు స్వామీ! నీవు, శ్రీకృష్ణ ప్రేమచే దృఢముగ బంధింపబడియున్న తలుపులను తెరువవలసినదిగ కోరుచున్నాము.

విశేషార్థము : మానవ జీవితమంతా ఒక రోజనుకుంటే సుదీర్ఘమైన సమయం రాత్రి. శ్రీకృష్ణుని గుర్తించడం, వానికి చెందిన తెలివి కలగడం పగలు. ఒకసారి ఆ పగలు ఏర్పడితే మరి రాత్రి రాదు. జీవుడెత్తిన జన్మల్లో మానవజన్మ చివరిది. మనం కోరితే రాలేదు. మననుండి ఎటువంటి విజ్ఞాపన లేకుండా భగవంతుడిచ్చాడు. మనలో అంతర్యామిగా ఉన్నాడు – మనని బ్రతికించడానికి. మానవత్వం ఉన్న పశుప్రవృత్తులు మానరు వీరు. కర్మ తోసేస్తే చెడు పనుల్లోకి దిగుతారు. అనుభవిస్తే అది పోవచ్చు. తానూ పుడతాడు మనతో పాటు. కాని కృపవల్ల పుడతాడు. అది తరగదు. మాట వినని మనకి మంచి చేయాలని మనకు తెలియకుండానే మనతో దైవనామాలు పలికిస్తాడు. క్షేత్రాలకు నడిపిస్తాడు. తన భక్తుల మాటలు వినిపిస్తాడు. ఇవన్నీ మనమే చేశామన్నట్టు చేసి జ్ఞానార్హత కల్గిస్తాడు. అప్పుడు తెలివి మొదలవుతుంది. నేనేమిటి? నా చుట్టూ ఉన్న లోకపు విపరీత స్వభావాలేమిటి? నిజమేమిటో తెలుసుకోవాలనే తపన మనిషిలో ప్రారంభమైంది. ఇది తెల్లవారబోవడమన్నమాట. ఇప్పుడు వీటికి తిరుప్పావై కావాలి. ముందు పెద్దలను చేరి అడగాలి. వారు చెప్పినట్టు జీవితాన్ని నడవడం నేర్వాలి. ఇంతవరకూ ఉండే రుచులు తగ్గుతాయి.

జీవితానికి ఎన్ని ఉన్నా ఏదో లోపం కన్పిస్తూ ఉంటుంది. ఏదో సాధన చేయాలనిపిస్తుంది. జ్ఞానుల ద్వారా గురువును చేరి మంత్ర, మంత్రార్థాలు తెలుసుకోవాలి. స్పర్శవేది లభిస్తే ఇనుము

బంగారమైనట్లు  ఆచార్యుని వల్ల జ్ఞానం దైవస్వభావాలతో, భగవద్గుణాలతో వికసించి స్పృహణీయమవుతుంది. ఆచార్యులు మన హృదయ ద్వారానికి బిగించియున్న అహంకార తాళాన్ని తెరుస్తారు. లోపలకు ప్రవేశించి నవ్యతత్వాన్ని చూపిస్తారు. ఇక రాత్రి రాకుండా చేస్తారు. ఎలా పొందాలో కూడా నేర్పుతారు. ఆచార్య సన్నిధికి చేరడానికి జరిగే ప్రక్రియ చెప్పింది ఆండాళ్. గురువు సన్నిధి చేరుతున్నప్పుడు జరిగే ప్రక్రియను చెప్తోంది. ఇదొక ఉపనిషత్ ప్రక్రియ. గోదా ఇవన్నీ చదవలేదు. వీరి నిష్కళంక భగవత్ప్రేమయే క్రమాలన్నీ సమకూరేటట్టు చేస్తుంది.

శాస్త్రాలు చదివి పొందే తెలివి క్లేశ జనకం. గురువు ద్వారా లభించే తెలివి పిత్రార్జితం. ఆచార్యులకు ఆంతరంగికులైనవారిని ముందు ప్రార్థించి వెళ్ళాలట గురువు దగ్గరకు. వీరికి ద్వార పాలకుల పేర్లు తెలియవు. పనిని బట్టి అక్కడి వ్యక్తులను పిలుస్తున్నారు. అదొక పెద్ద భవనం. లోపలొక ప్రాకారం. గోపికలకు ఇళ్ళు నిర్మించగా మిగిలిన వాటితో నిర్మించుకొన్న నిర్మల భవనం కదా ఈయనది. రాక్షస భయం వల్ల తలుపులు తాళం వేశారు కాపలావాళ్ళు. పని చేయించుకోవడానికి ఎదుటి వాళ్ళని పొగడాలని తెలుసు మన గోదా బృందానికి. భగవంతుని చూచి, ఆనందించి, దుర్మతుల నుండి కాపాడుకొనే ఆచార్యుడు నందగోపుడు. అతని భవనం మంత్రం. దీన్ని కృష్ణుని ఇల్లంటే కృష్ణునికి తృప్తి కాదట. వాళ్ళ నాన్నగారి సంబంధమే తనకీ ఇష్టం, గురువు ద్వారా వచ్చిన వారంటే స్వామికి ప్రీతి. కృష్ణుడు తనను వెతుక్కుంటూ వచ్చే గోపికలకు సంకేతంగానే వాళ్ళ నాన్నగారితో చెప్పి ధ్వజం కట్టించాడట. ఆర్తి గల జీవులకు దూరం నుంచి భగవానుని ఉనికిని తెలిపే వేద ప్రతిరూపమే గరుడధ్వజం. ఎత్తుగా ఉంటుంది. ఎడారిలో చలివేంద్రం లాంటిదది. కన్పడగానే ఓదార్పన్నమాట.

గోపికలకు, ద్వారధ్వజ సంరక్షకులకు, మధ్య సంభాషణ జరుగుతోంది. ద్వారాల తాళం తెరవమని ప్రాధేయపడతారు. ద్వార పాలకులు అభ్యంతరాలు చెబుతారు. కృష్ణుడు రమ్మంటే వచ్చామని చెబుతారు. ఇక ఇరుకున పడ్డాడు ధ్వజ సంరక్షకుడు. పైగా స్వామిని మేల్కొలుపుతాం, నిద్రా సౌందర్యం, మేల్కొను సౌందర్యం చూడవచ్చామన్నారు. ద్వారపాలకుడు ఇంకేదో మాట్లాడబోయాడు. నోరు తెరచి వద్దనక లోనికి వెళ్ళనీయమన్నారు.

సరి తాళాలు తీసుకుని వెళ్ళండి అన్నట్లు చేయి చూపాడు. అమ్మో ఆ తలుపులు మేము చెపితే వినవు. వాటికి నీకంటే కృష్ణుని మీద ప్రేమ ఎక్కువ. నువ్వు చెప్తేనే వింటాయి. రాముని మీద అయోధ్యలో అన్ని చేతనా చేతనాలకు ప్రేమ ఉండేదట. అలానే స్వామి రక్షణకు ఇవి బిగుసుకుపోతాయి. ఈ తలుపులకే ప్రేమ అధికం. మనలోని అజ్ఞానావరణాన్ని జ్ఞానులే తీస్తే లోపల దైవదర్శనమవుతుంది. కాని మనం తీసుకోరాదు. ప్రార్థించి అంగీకారం పొందిన తరువాత నందుని భవనంలోనికి ప్రవేశించింది ఆండాళ్.

## 17వ పాశురము

**అమ్బరమే! తణ్ణీరే! శోఱే! అఱమ్ శెయ్యుమ్,**
**ఎమ్బెరుమాన్! నన్దగోపాలా! ఎళున్దిరాయ్,**
**కొమ్బనార్కెల్లామ్ కొళున్దే! కులవిళక్కే!**
**ఎమ్బెరుమాట్టి! యశోదా! అఱివుఱాయ్**
**అమ్బఱ మూడఱుత్తు ఓంగి ఉలగళన్ద,**
**ఉమ్బర్ కోమానే! ఉఱంగా దెళుందిరాయ్**
**శెమ్ పొఱ్కళలడి చ్చెల్వా! బలదేవా!**
**ఉమ్బియుమ్ నీయు ముఱంగేలో రెమ్బావాయ్!**

తాత్పర్యము – ద్వారముల నుండి లోనికి ప్రవేశించిన పిదప వస్త్రములను, చల్లని తీర్థమును, అన్నమును ధర్మబుద్ధితో విరివిగా దానము చేయు స్వామీ! నందగోపాలుడా! మేల్కొనుమా! నీటి ప్రెబ్బలి మొక్క వంటి సుకుమార గాత్రలగు స్త్రీ జాతి కంతటికీ చిగురువంటి దానా! గోపకులమును ప్రకాశింపచేయు మంగళదీపము వంటి దానా! మా కందరకు స్వామినియైన దానా! కీర్తినిచ్చు యశోదమ్మా! తెలివి తెచ్చుకోవమ్మా! ఆకసమును ఛేదిస్తూ పెద్దగా పెరిగి లోకములను కొలచిన ఓ దేవదేవా! నిత్యసూరి నిర్వాహకుడా! నిదురించక లేవయ్యా.

ఎఱ్ఱని బంగరు పాదకడియము ధరించి శ్రీకృష్ణానుభవాన్నందించిన ఐశ్వర్యవంతుడా! ఓ బలరామా! మీ తమ్ముడును, నీవును కూడా వెంటనే మేలుకోవలసినది అని ఈ నల్వురు లేపబడిరి.

విశేషార్థము – ''యతోవాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ'' వాక్కులకు, మనసుకు అందనివాడా పరమాత్మ అంది తైత్తరీయం. అలాంటివానిని ''వాఙ్మనసైకభూమి'' అందేట్టుగ చేయగలదీ మంత్రం. శ్రీవిష్ణు సహస్ర నామాల్లో 'శబ్దాతిగః' దేవతలకైనా అందనివాడు 'శబ్దసహః' శరణాగతి చేసి ఆర్తితో ప్రేమతో పిలిస్తే గజేంద్రుని రక్షించాడు. ఆ పిలుపే మంత్రం.

ఆచార్యుని చేరితే మంత్రం లభిస్తుంది. దాని అర్థం, పఠించే విధానం తెలుసుకోవాలి. అప్పుడే మనం సుందరులమైనట్టు తప్ప ఇతర సౌందర్యాలు జీవుణ్ణి బాగుచేయవు. అదే తిరుప్పావై. ఆ మంత్రం నారాయణ మంత్రమని ఆండాళ్  మొదటినాడే తెలిపింది. ఇది ఎనిమిది అక్షరాల మంత్రం. దీంట్లో శబ్ద శక్తి ఉంది. అర్థపూర్తి ఉంది. అల్ప పురుషార్థాల నుండి అత్యుత్తమ మోక్షం దాకా అన్నిటినీ ఈ మంత్రం ఇస్తుందని శ్రీ వ్యాసమహర్షి చెప్పెను. ఊరికే మాలలు తిప్పి జపం చేయడం కంటె అర్థం తెలిసి ఒకసారి అన్నా ఇది ఫలిస్తుంది. ఆ నామంలో ఓ భాగమైనా

గోవింద నామాన్ని పలికిన ద్రౌపది మానము ప్రాణము రాజ్యము వంశము ఎన్ని లాభాలో పొందిందని, మంత్రార్థం తెలిస్తే చేసే కార్యాలు సుకృతాలౌతాయి. లేకపోతే అన్నీ పాపాలే నంటారు.

మంత్రార్థం వల్ల నేనెవరు? నాకేమి ప్రయోజనం? దానిని సాధించడానికి ఏ సాధనం పట్టుకోవాలో తెలుస్తుంది. ఇవన్నీ తెలిపేవాడు ఆచార్యుడు. వారు చాలా ఉదారులు. అడిగేవారిది లోటు తప్ప, చెప్పడంలో అర్థవితరణ చేయడంలో లోపం చేయనివారు ఆచార్యులు. ఈరోజు మన ఆండాళ్ ముందుగా ఉదారుడైన నందగోపుని పడకను దర్శించింది. ఆ ప్రక్కనే యశోద పడక ఉంది. ఆ పైగా ఇద్దరు పిల్లల పడకలున్నాయి. ముసుగులో ఉన్నారిద్దరు. కాళ్ళ వద్ద కనబడుతోందట మొదట శంఖ, చక్ర, కల్పక, ధ్వజాది గుర్తులున్నాయి. ఆ పాదం కృష్ణునిదని గుర్తించారు. మరో కాలు తెల్లనిది. బంగారు కడియము కనిపిస్తోంది. అది సోదరుడు బలరామునిదని గుర్తించారు. వరుసగా నలుగురినీ లేపుతోంది.

మన్మథుడిని కూడా తన రూపంతో పిచ్చెక్కించేవాడు కృష్ణుడు. అతణ్ణి ఎవరైనా అపహరించుకుపోతారేమోనన్న భయంతో కాపలాగా పరున్నాడు నందగోపుడు. ఏమీ తెలియని పసిపిల్లలైనా నందుని అందంగా స్తుతిస్తూ ప్రార్థిస్తున్నారు.

''మేమొచ్చినది లోభివానింటికి కాదు''. ఇవ్వనిదే తోచక అదే ప్రయోజనంగా తగిన దేశంలో మంచిరోజుల్లో యోగ్యులైన ఆర్తులందరికీ అన్నము నీరు బట్ట దానమిచ్చే మా స్వామి అయిన నందగోపుని ఇంటికి కదా వచ్చినది.

స్వామీ మీ లోటు తీర్చడానికి వచ్చాం. అందరూ స్త్రీలకు దానాలివ్వరు. వారికది లోటే. ఆ లోటు మీకు తీర్చాలని వచ్చాం. పుచ్చుకుంటే చాలు వారిని 'ఉదారులని' పొగిడేవాడవు నీవు. ఫలమేమీ కోరక సాత్వికదానం చేస్తావు. కోరికలతో చేసేది రాజసదానం. ఉదాసీనంగా నిర్లక్ష్యం చేస్తే అది తామసదానం అంటారు.

నందుడు అన్నదానం చేస్తే అదొక్కటే చేసి చేసి ఏమనుభవంతో చేస్తున్నాడూ? అన్నట్లుండేదట. అలానే వస్త్రాలు, నీరు ఇచ్చినా ఉండేదట. స్వామీ! ఊరివారికి మూడూ వేరు వేరు. అన్నం పోషించేది – నీరు ప్రాణధారకం – వస్త్రం స్వరూప రక్షకం కావాలి. కానీ మాకు మూడూ వేరు వేరు. కృష్ణ దర్శనం అన్నం – కృష్ణుని గుణాలు తలచుటే ధారకం, స్వామి సేవలు చేయుటే స్వరూపానికి వస్త్రం వలె – రక్ష. ఊరివారికిచ్చేవి ఒకనాటికి తరిగిపోతాయి. మాకు ఇచ్చేవి తరగవు. పాడైపోవు, పైగా పెరుగుతాయి. వారిది వారికిచ్చినట్టు మాది మాకివ్వవా! అని ప్రార్థించారు. గురువు ఇచ్చేవి భగవత్స్వరూప గుణాలు తెలిపి, సేవ చేయు విధానం చెబుతారు. ఆత్మకు భగవత్సేవయే స్వరూపం.

నందుని దానాలు ప్రసిద్ధం కాదు కానీ కృష్ణుడిలో ఈ గుణాలున్నాయి. అది వారి నాన్నగారి నుండే వచ్చాయని గుర్తించారు. 'గుణైర్దశరథోపమః' రాముని సుగుణాలు వారి నాన్నగారి నుంచే వచ్చాయి కద! గొల్లపిల్లలకు అన్నాలిచ్చాడు కృష్ణుడు. అర్జునుడి గుఱ్ఱాలకు నీరు, ద్రౌపదికి వస్త్రాలు ప్రసిద్ధాలు కద. ఆచార్యులు లేవడమంటే అనుగ్రహించడమే. ఆ తర్వాత యశోదను లేపుతున్నారు. ముందు అమ్మను లేపక స్వామిని లేపారు. ఆచార్యుడి ఆశ్రయణ తర్వాతే మంత్రాన్ని పొందుతామని తెలియాలి. యశోదయే మంత్రం. అయినా వీళ్ళేమి చేస్తే అదే శాస్త్రం.

నీటి ప్రైబ్బలి నీటి వాలుకు అనుకూలంగా పోయే తీగ, చిగురు ఆ చెట్టులో ఏ భాగానికి దెబ్బ తగిలినా ముందు వాడిపోతుంది. యశోద, నందునికి చెందినది. వ్రేపల్లె స్త్రీలలో ఎవరికి ఇబ్బందులొచ్చినా, తానే బాధపడిపోయే సున్నిత సుకుమార హృదయ. ఆమెయే అష్టాక్షరి. మన్త్రాలన్నింటిలోను ప్రధానమైనది శిరస్థానీయమైనది అష్టాక్షరి. అష్టాక్షరి భక్త ప్రార్థనకనువైన అన్ని ఫలితాలు ఇస్తుంది. పైగా భక్తుల క్లేశాలను బాపెడిదై ఉంటుంది. భక్తకులానికీ మంత్రం మంగళదీపం, వెలిగించనవసరంలేని దీపం. అఖండ జ్ఞానాన్ని సహజంగా మంత్రమిస్తుంది. మంత్రం అర్థబోధకమవ్వాలి. అందుచేతనే 'తెలివితెచ్చు'కొమ్మంది తప్ప లేపమనలేదు గోదాదేవి యశోదని.

లోక మాతాపితరులైన నీళాకృష్ణులచే నమస్కారాలు పొందే గొప్ప యశోదదే కద. ''అమ్మా నాన్న ఎలా చెప్తే అలాగేనని తప్పించుకు పోయేవు. వాళ్ళిద్దరినీ ఒప్పించే వచ్చాం. స్వామీ! ఇంకా నిద్రెందుకు?'' లే అని కృష్ణుని లేపుతున్నారు.

ఇంద్రాదుల బాధలు తీర్చాలని యాచకుడవై ఆకాశమంతా ఒరుసుకు పెరిగి లోకాల్ని కొలిచి అలసితివా? నిదురించే శిశువును దరి చేర్చుకునే తల్లిలా అడగని వారి తలలపై పాదాలు ఆనాడు మోపావు. యాచిస్తూ ఇప్పుడు మేం వచ్చాం. స్వామీ! లేచి అనుగ్రహించు అన్నారు. ఆనాడు శూన్యమంతా నిండావు. శూన్యవాదులకు నీ నామమే కదా శరణ్యము. మంత్రంలోని నారాయణతత్వం విశ్వమంతా వ్యాపించిన వాత్సల్యాది గుణాలు కల దయామయుణ్ణి చెప్తుంది, అతడు తెలియాలి.

'రక్షకులు నిద్రపోతారయ్యా? మేం కోరడం తప్పా ఏమి? గర్వం కల ఇంద్రాదులకే కాని అబలలమైన మా కోరిక తీర్చరాదా? పాండవుల వెంట రక్షిస్తూ తిరిగి అలశావా? నడచి నడచి రామునిగా అలసినావా? నీ గొప్పంతా, ప్రేమించిన మా దగ్గరే ప్రదర్శించాలా? ఏమా దొంగ నిద్ర? లే ఇక'. కృష్ణుని నిద్ర లేపబోయారు. ఏమీ కదలిక కన్పించలేదు.

ఓహో! మీ అన్నను లేపలేదని, క్రమం తప్పి వచ్చామని అలిగావా? ఇప్పటికి వీరు గుర్తించి ఆ ప్రక్కనే ఉన్న బలరాముణ్ణి లేపుతారు. ఎఱ్ఱని బంగారు కడియం కల పాదం బలరామునిది.

ఆ పాదం మోపిన వేళా విశేషం. సంపదలు పెరిగాయి. కృష్ణుడు దక్కాడు. వీరికి దేవకీ గర్భంగ. బలరామా! భగవద్భక్తులకు చెందియుండుట నారాయణ మంత్రసారమని మాకు తెలిసింది. కృష్ణుడు నీ అధీనం. నీవు లేస్తే ఆయన లేస్తాడు. నీవు మా స్వామికి శయ్య. ఏమయ్యా శయ్యపైనున్నవారు నిద్రిస్తారు. శయ్య కూడా నిద్రిస్తుందా? మీ విశ్రాంతి స్థానం కృష్ణుడు. మా విశ్రాంతి స్థానం నీవు. నిన్ను మాకివ్వద్దూ! అంటూ బలరాముని ప్రార్థించారు. తమ్ముడన్నకు విధేయుడైనట్లు, భగవానుడు భక్తవిధేయుడని మంత్రార్థ సారాన్ని, నంద యశోదా కృష్ణ బలరాముల ద్వారా, ప్రకటించింది ఆండాళ్ ఈ పాశురంలో.

## 18వ పాశురము

*ఉన్దు మదగళిత్త నోడాద తోళ్వలియన్,*
*నన్దగోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!*
*కన్దమ్ కమళుమ్ కుళలీ! కడైతిఱవాయ్,*
*వన్దు ఎంగుమ్ కోళి యళైత్తనకాణ్! మాదవి*
*ప్పన్దల్ మేల్ పల్ కాల్ కుయిలినంగళ్ కూవినకాణ్,*
*పన్దార్ విరలి! ఉన్ మైత్తునన్ పేర్ పాడ,*
*శెన్దామరై క్కైయాల్ శీరార్ వళై యొలిప్ప*
*వన్దు తిఱవాయ్ మకిళిన్దేలో రెమ్బావాయ్.*

తాత్పర్యం – శ్రీకృష్ణుని లేపుటకు నీళాదేవిని లేపుట మరచిపోవుటచే, నీళాదేవినే ప్రత్యేకముగా లేపుట ఉచితమని మదజలము స్రవించు దర్పము గల అనేక ఏనుగుల సమూహముతో (పోరిననూ) ఓడనట్టి భుజబలము కల నందగోపాలుని యొక్క కోడలివైన ఓ నప్పిన్నపిరాట్టీ! నీళా! సుగంధ పరిమళము లొలికించు కుంతలములు కలదానా! తలుపు తెరువుమా! ఊరిలో కంతటా వచ్చి తెల్లవారిపోయినదని కోళ్ళు కేకలేయుచున్నవి. నీ రాకకై బండి గురవింద పందిరిపై ఎప్పటినుండో అనేకసార్లు కోకిలల గుంపులు కూయుచునే యున్నవి. బంతులవలె ఒప్పుచున్న వ్రేళ్ళు కలదానా! నీ మేనత్తకుమారుడైన శ్రీకృష్ణుని నామసంకీర్తనము చేయుచున్నాము కనుక ఎఱ్ఱతామరలను బోలిన మృదువైన దివ్యహస్తములతో, నీ చేతికి అమరి యున్నట్టి కళ్యాణగుణములు కల గాజులు గలగల ధ్వనించునట్లుగ వచ్చి తలుపు తెరువమ్మా! మేము కోరుటచే కాక నీవే సంతోషిస్తూ రావలసినది అని నీళాదేవి లేపబడినది.

విశేషార్థము – లోకైకేశ్వరి అయిన 'అమ్మ'ను ప్రార్థించే క్రమం ఈరోజు పరిపూర్ణ జ్ఞానశక్తులు కల సర్వేశ్వర తత్వం సర్వమానవాళి సముద్ధరణకై సులభమై దిగి వచ్చి మంత్రపూరితమై దర్శనమిచ్చు స్థానములే దేవాలయములు. వేదైక ప్రతిపాద్యుడైన అతణ్ణి ఈ సులభ స్థితిలో చూడగానే చులకన భావం కలుగుతుంది మందబుద్ధులకి. అది తప్పని, పూర్ణ విశ్వాసం నీకుంటే ఇక్కడినుంచే ఏమి కోరితే అవన్నీ పొందవచ్చని ఆండాళ్ నిరూపించింది. ఆ నిరూపణే తిరుప్పావై.

మంత్రంలో తిరుగాడే దైవాన్ని ఆచార్యులు శిష్యులకందిస్తారు. ఆ ఆచార్యులు భక్తుల ద్వారా మనకు తెలుస్తారు. ఆ భక్తుల మాట వినదగినదే అనిపించాలి. దానికి మనస్సు నిర్మలం కావాలి. లోపల సాత్విక గుణం పెరగాలి. ఆ సత్వగుణాన్ని బాగా పెంచే కాలం ఈ ధనుర్మాసం. మంచి కాలంలో మంచి బీజాలు మంచి క్షేత్రంలో నాటితే పంటలు పండుతాయి. ఈ మాసపు దినాలు మన మనస్సు అనే బంగారు భూమిలో నాటుకోడానికి ఆండాళ్ తల్లి తిరుప్పావై అనే 30 పాశురాలు వేద బీజాలుగా అందించింది. ఆనందమనే పంట పుష్కలంగా ఇవి పండిస్తాయి. ఆ ఆనందమే కృష్ణుడు. మానవులంతా పరస్పర ప్రేమానురాగాలతో సుఖజీవనం సాగిస్తారీ వ్రతం వల్ల. ఈ వ్రతానికి కేంద్రం ఆలయం కనుక, లోపలుండే దేవుణ్ణి ఎలా వెళ్ళి సేవించాలో, ఏమని ప్రార్థించాలో అందమైన కథతో నింపి అందించింది మన ఆండాళ్.

భక్తుల ద్వారా ఆచార్యుని చేరి, మంత్రమేమిటో గుర్తించాలని నిన్న నందగోపుని, యశోదను, కృష్ణుని, బలరాముని వరుస క్రమంలో లేపారు. నందుడాచార్యుడైతే, యశోద నారాయణాష్టాక్షరీ కృష్ణుడు మంత్రార్థమైన సర్వేశ్వరతత్వం. బలరాముడా భగవానుని సేవించు నిత్యసూరులు. భాగవతులకు ఇదే క్రమంలో మంత్రం లభించింది. మంత్రం తెలిస్తే చాలదు. భగవానుణ్ణి ఆశ్రయించడానికి కూడా మళ్ళీ పద్ధతి ఉంది. అదేమిటో భాగవతులు వివరిస్తారు. కృష్ణుడిక్కడ లేడర్రా! నీళాదేవి భవనంలో ఉంటాడు. అక్కడ దొరుకుతాడని బలరాముడు రహస్యం చెప్పేశాడు నిన్న. ఈ రోజు నీళాదేవిని మాత్రం లేపుతున్నారు. క్రమం తెలిసి నిర్మించిన ఆలయాల్లో ఈ పద్ధతి ఉంటుంది. కోవెలకి పోగానే తిన్నగా గర్భాలయానికి పోరాదు. ముందు భక్తుల మందిరాలుంటాయి. నమస్కరించాలి. ఆపై ధ్వజస్తంభం వద్ద శిరస్సు వంచి, లోపల చేరాలి. ఆచార్యుల ఆలయం ఉంటుంది. మ్రొక్కాలి. ప్రదక్షిణ చేయాలి. అప్పుడా అమ్మవారి కోవెల విడిగా ఉంటుంది. అక్కడ చేరాలి. ఆమెను విడిగా ప్రార్థించి ఆ తర్వాత గర్భాలయంలో స్వామి దరి చేరాలి. ఇది సంప్రదాయ రహస్యం.

భక్తుల ద్వారా వేద విశ్వాసం కలిగి, గురువుద్వారా మంత్రంలోని భగవానుని దర్శనానికి ముందు అమ్మను ప్రార్థించాలి. అమ్మయే, పాపాలెన్నో ఉన్న మనని చేరదీసి, బుద్ధి చెప్పి, స్వామికి దయ పుట్టించి ఆ తండ్రి చేత రక్షింప చేస్తుంది. కావలసినవన్నీ ఇప్పిస్తుంది.

అమ్మ పేరు 'శ్రీ' అంటే మన మొర వింటుంది. వానికి వినిపిస్తుంది. మనం వెడితే ఆశ్రయింపబడుతుంది. తండ్రిని

మన కోసం ఆశ్రయిస్తుంది. ప్రేమతో బుద్ధి చెప్తుంది. ఇద్దరినీ కలుపుతుంది. అందుకే అమ్మ ద్వారా వెళ్ళాలే కాని, ఎదురుగా ఆయన ఉన్నా తిన్నగా పోరాదనేది ఒక రహస్యం.

అమ్మకి లక్ష్మి అనే పేరుతో పాటు పురుషకారమని మరో పేరు. 'పురుషుణ్ణిగ చేయును'. పురుషుడంటే 'పూర్ణు'డని అర్థం. పిల్లలపై కోపించి వదిలేసే తండ్రి అపూర్ణుడు. మనమంతా దేముని పిల్లలం. ఆయన కోపంతో వదిలేశాడు. కోపం పోయి కరుణ రావాలి. అదీ మనసులోంచే కదిలి రావాలి. ఆ కారుణ్యమే మన అమ్మ. ఇది ఉంటే కోపం పోతుంది. కనుక అమ్మ చోటు, స్వామి హృదయమే. కరుణకు వేరే రూపముంది కూడా. అయితే అతణ్ణి వీడి ఉండదు. ఇద్దరూ కల్సి ఉంటారు. అదే శ్రీ+నారాయణ = శ్రీమన్నారాయణ తత్వం. ప్రార్థించేటప్పుడు మాత్రం ముందు 'శ్రీ'నే ప్రార్థించి, దయ పైకి వచ్చాక అప్పుడు వాని పాదం పట్టాలి. ఆయన పూర్ణుడైనాడు. అమ్మ అలా వానిని చేసింది. అంచేత పురుషకారం అంటారు అమ్మను.

పురుషకారమైన అమ్మనెలా అడగాలో చెప్తోంది ఆండాళ్ ఈ రోజు. దారితప్పే మనిషికి భాగవతులు సన్మార్గం చూపినట్లు, 'అమ్మను లేపండి, మీ పనులన్నీ అవుతాయ'ని బలరాముడు చెప్పాడు. లంకలో ఎంత వెదికినా సీత కనబడకపోతే, హనుమ 'దేవ్యైచ తస్మై జనకాత్మజాయై', 'జనకునికి నిన్ను నీవే చూపుకున్నట్లు నన్ను అనుగ్రహించవమ్మా' అన్నాడు. అశోకవనంలో కన్పడింది. అమ్మని అమ్మే చూపుకుంటుంది. ఆమెని చూచి వచ్చినందుకు హనుమకు ఆలింగనభాగ్యం కల్గించాడు రాముడు.

భగవంతుడు ఆచార్యునికి కుమారుని వలె లొంగివుంటే, లక్ష్మి కోడలివలె నమ్రతతో మెలగుతుంది. ఆచార్య సంబంధంతో తమని చెప్పుకోవడమే దేవునికి, అమ్మకి కూడా ఇష్టం. కృష్ణావతారంలో అందరికంటే నీళాదేవికే అధికారం, కృష్ణునిపై స్వాంతత్ర్యం ఉన్నాయి. ఆమెనే 'నప్పిన్నై', 'సుందరకుమారి' అంటారు. ఆమెను మేల్కొలుపుతున్నదీ రోజు ఆండాళ్. 'మదమెక్కిన గజములను అలవోకగా ఓడించే భుజబల సంపన్నుడైన నందగోప్పు కోడలా? నప్పిన్న పిరాట్టీ, సుగంధాలు వెదజల్లే శిరోజములు కలదానా, కోడిపెట్టలొచ్చి అంతటా అరచుచున్నవి. లేచి రావమ్మా, గడియ తెరువుమా.

కృష్ణుడు కువలయా పీడాన్ని నలిపివేశాడంటే, నందుని భుజబలం కొంత వచ్చిందన్నమాట. అంతబలం నందుడికుంది. కనుకే కంసుడు యమున దాటి ఈ ఊళ్ళోకి వచ్చే సాహసం చెయ్యలేదు. నందుడి చేతిలో బల్లెమునకంత బలం.



ఆచార్యుని ఉపదేశ ముద్రే ఆ బల్లెం. వారున్న చోట నందవ్రజం. రజోగుణమనే కంసుడు అక్కడికి రాలేడు. మనలోని అహంకారమనే ఏనుగు 'కులం గొప్పదనో, ధనికుడననో, బాగా చదువుకున్నదనో' మూడు రకాల మదాలను కల్గిస్తూ ఉంటుంది. గురువు ఉపదేశంతో వాటిని పారద్రోలుతాడు.

ముందు వీరి 'కోడలా' అంటే 'ఈ ఊళ్ళో కానివారెవరులే' అని నీళాదేవి పలకలేదు. దాంతో నందగోపుని సంబంధంతో పిలిచింది ఆండాళ్. ఈమె సౌందర్యానికి వశుడై కృష్ణుడుంటాడు. ఈమెకు నల్లని దీర్ఘ కేశ సంపద ఉండి కృష్ణుని వశపరచుకుంటుంది. ఆ వ్యామోహ రూప కేశాలకు గంధం సర్వగంధుడైన స్వామియే. పిల్లలము 'పూవులు ముడువము' అంటే నీవు ధరించదగునా? అజ్ఞానమనే గడియ తీయవలసినది నీవే. నీవు కృపవు. మా కర్మ ఆయన్ని మానుండి దూరం చేసింది. మా కృపవు నీవు కనుక తిరిగి ఆయన్ని కృపాళువుగ చేయగలవు.

రక్షించే సమయం తెల్లవారింది. నిన్నడగాలనే తెలివి ఏర్పడిందిన్నాళ్ళకి. గురువులు బోధించినవి తెలిశాయి. ఆ గురువులే కోళ్ళు. కోడి సమయమును సరిగా సూచించే గృహపక్షి. పిల్లల కోడిలాగా శిష్యులతో సంచరిస్తూ యోగ్యమైనవే. ప్రకృతిలోంచి గ్రహించి గురువులు అంతటా తిరుగుతున్నారు. మీ పెరట్లో మాధవీలతపై నీ వద్ద పాట నేర్వాలని చేరిన కోకిలలు గురువుకై చూచే శిష్యులవలె పదే పదే కూస్తున్నాయి. అవే ఆళ్వార్లు. ఆ లత శ్రియఃపతి. వాని దివ్య ప్రబంధాలు కోకిల కూజితాలవలె శ్రవణ మధురాలు. విశ్వాన్ని ఆడుకొనే బంతివలె ధరించిన తల్లివి నీవు. జగల్లీలలో ఆ బంతిని గెలిచి నీ చేత పట్టావు.

నీవు మెచ్చే మేనబావని గూర్చి పాటలు పాడుతున్నాం. అక్కడినుండే పడకపై పడుకునే లోపలికి రమ్మనకు. నీవే లేచే అందం చూడాలని వచ్చామమ్మా. ఎఱ్ఱ తామరల వంటి సుందర, సుకుమార, సుగంధ శ్రీహస్తమున గల గాజులు గలగల ధ్వనిస్తుండగా నీవే వచ్చి ప్రేమతో తలుపు తెరువుము. నీ సౌందర్యం మా కంటి ఆకలిని, గాజులధ్వని చెవుల ఉపవాసాన్ని, సుగంధం నాసిక ఉపవాసాన్ని, పాట నాల్క ఉపవాసాన్ని, తలుపు నీవు తాకినప్పుడు మేమూ ఇటు తాకుతాం కదా అది నీ స్పర్శ కల్గించి త్వగింద్రియ ఉపవాసాన్ని తీర్చాలి. అయ్యో! అంటూ తీయకు. ఆహా! అంటూ తీయవమ్మా! అంటూ దీనిలో అమ్మ ననుగ్రహించమని ప్రార్థించింది ఆండాళ్.

# రథోత్సవం

– కౌతా నిర్మల



ప్రముఖ దేవాలయాలన్నింటికీ ప్రత్యేకంగా ఒక రథం ఉంటుంది. సంవత్సరానికి ఒకసారి రథోత్సవాన్ని జరుపుతారు. రథంలో ఆ ఆలయంలోని ఉత్సవ మూర్తులను ఆసీనులు గావించి, ఆలయం చుట్టూ ఆ రథాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తారు. ఆలయపు బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం అన్నది ఎంతో ప్రముఖమైనది. ఒక్కొక్క ఆలయంలో, ఒక్కొక్క రోజున రథోత్సవం జరుపబడుతుంది. కొన్ని దేవాలయాల్లో రథోత్సవం ఒక్కసారే జరపబడితే, మరికొన్ని దేవాలయాల్లో ఉదయం, సాయంత్రం కూడా రథం ఊరేగింపు జరుగుతుంది. అయితే రథోత్సవానికి కూడా ముహూర్తం నిర్ణయింపబడి, ఆ శుభముహూర్తం సమయంలోనే రథం ఊరేగింపు నిర్వహింపబడుతుంది. ఆలయ నియమాలు, సంప్రదాయాలు, విధానాలను బట్టి ఎన్నిరోజులు, ఎన్నిసార్లు రథం ఊరేగింపు జరిపించాలన్నది నిర్ణయింపబడుతుంది.

శ్రీ ప్రశ్న సంహిత రథాన్ని ఏవిధంగా తయారు చేయాలన్నది వివరించింది. రథాన్ని చెక్కతో కాని, లోహంతో కాని నిర్మించాలని తెలిపింది. ఆ రథాన్ని ముత్యాలతో, నవరత్నాలతో, పువ్వుల తోరణాలతో అలంకరించాలని ప్రశ్న సంహిత విశదీకరించింది. మరీచి మహర్షి రథం ఎత్తు గురించి తెలియజేస్తూ, మూడు అంతస్తులను కలిగి ఉండాలనీ, రథాన్ని ఒక మంటపం లాగా అమర్చాలనీ తెలియచేశాడు. రథం యొక్క నాలుగు మూలలా సింహాల ప్రతిమలు అమర్చబడాలనీ, లేదా పులి, ఏనుగుల ప్రతిమలు ఉండాలని చెప్పబడింది. ఈవిధంగా తయారు చేయబడిన రథమే ఉత్తమ రథమని పేర్కొనబడింది. ఊరేగింపు రథాలు ఆయా దేవాలయాలకు ప్రతిరూపాలని కూడా చెప్పబడింది.

రథ నిర్మాణంలో ముందు చక్రాలు సూర్యునికి, వెనుక చక్రాలు చంద్రునికి ప్రతిరూపాలు అని మహర్షుల వాక్కు. రథాన్ని ముందుకు లాగే తాడు వాసుకి సర్పానికి ప్రతిరూపంగా భావించబడుతోంది. రథోత్సవంలో ఒక గొప్ప ఉపనిషత్ రహస్యం దాగి ఉందని మహాత్ములు వెల్లడించారు. శరీరాన్ని రథంతో పోలిస్తే, శరీరమే రథంగా, జీవాత్మ రథికునిగా, బుద్ధి రథసారథిగా, మనస్సును పగ్గాలుగా పోల్చబడింది. దీని అర్థం వివరంగా చెప్పాలంటే, బుద్ధి అనే సారథి, మనస్సనే పగ్గాలను అదుపు చేస్తూ శరీరమనే రథాన్ని గమ్యం వైపు, లక్ష్యసాధన దిశగా, మంచిమార్గం వైపు, జీవాత్మ అనే రథికుని ముందుకు నడిపించాలి.

రథోత్సవం జరపబడటానికి వెనుక ఒక ముఖ్య ఉద్దేశం కూడా ఉంది. సర్వ మానవ సౌభ్రాతృత్వం అన్నది ఆ రథోత్సవంలో ఇమిడి ఉంది. పూర్వపు రోజుల్లో కొంతమందికి ఆలయ ప్రవేశం నిషిద్ధంగా ఉండేది. వారికి భగవంతుని దర్శన భాగ్యం లభించేది కాదు. వారి దర్శనార్థం భగవంతుడే ఆలయంలోంచి బయటకు వచ్చి, ఎత్తయిన రథంపై ఆసీనులై, రథం మీద ఊరేగుతూ, అందరికీ తన దర్శనాన్ని ప్రసాదిస్తూ భక్తులను అనుగ్రహిస్తాడు. ఒడిస్సా రాష్ట్రంలోని పూరీలో జరిగే జగన్నాథ రథోత్సవం ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. ఆ రథోత్సవంలో పాల్గొనటానికి దేశ విదేశాల నుంచి అసంఖ్యాకమైన ప్రజలు పూరీకి చేరుకుంటారు. ఆలయాలలో జరుపబడే రథోత్సవం కూడా అనాదినుంచి ఒక భాగమైంది.



# దశ పాపహర దశమి

చిల్లర సీతారామారావు

**“నమామి గంగే తవపాద పంకజం, సురాసురైర్వందిత దివ్యరూపం**
**భక్తించ ముక్తించ దదాసి నిత్యం, భావానుసారేణ సదా నరాగామ్”**

హే గంగామాతా! దేవతల ద్వారా, రాక్షసుల ద్వారా వందనములందుకుంటున్న మీ దివ్యచరణములకు, మానవులకు వారి భావములననుసరించి, నిత్యము భక్తిని, ముక్తిని ప్రసాదించు మీ పాద పంకజములకు వందనము.

జ్యేష్ఠమాసమున వచ్చు పర్వదినములలో విశిష్టమైనది దశ పాపహర దశమి. దశ పాపహర దశమిని దశహర అని కూడా అంటారు. ‘దశహర’ అనగా పది పాపములను హరించునది అని అర్థము. భగవతి గంగావిర్భావము గురించి శాస్త్రములలో ఈవిధముగా ఉన్నది.

శ్లో ॥ దశమ్యాం శుక్ల పక్షేతు జ్యేష్ఠే మాసే బుధేఽహని
అవతీర్ణాయతః స్వర్గాద్ధస్తర్ క్షచ సరిద్వరా

జ్యేష్ఠమాస శుక్లపక్ష దశమి తిథి హస్తా నక్షత్ర యుక్తమైనప్పుడు గంగ దివినుండి భువి మీద అవతరించింది. ఈరోజున స్నానాది శుభకర్మలు ఆచరించడం వలన మానవులకు సంబంధించిన దశ విధ పాపములు నశించిపోతాయి. అందువలన ఈ తిథి ‘దశహర’ అను నామముతో ప్రసిద్ధమయింది.

భారత దేశమున పతిత పావని కలిమలహారిణి, సర్వతీర్థమయీ భగవతి గంగానది సమస్త నదులందు అత్యంత శ్రేష్ఠమైనది.

శ్లో ॥ పునాతి కీర్తితా పాపం దృష్టా భద్రం ప్రయచ్ఛతి
అవగాఢా చ పీతాచ పునాత్యా సప్తమం కులమ్

గంగానామ స్మరణ చేత పాపములు నశిస్తాయి. గంగా దర్శనము చేత శుభములు కలుగుతాయి. గంగా స్నానము చేత ఏడు తరముల వరకు వంశము ఉద్ధరింపబడుతుంది. మానవుని ఎముకను గంగాజలము ఎంతకాలము స్పృశిస్తూ ఉంటుందో, అంత కాలము వరకు అతడు స్వర్గలోకములో సుఖముగా నివసిస్తాడు.

జ్యేష్ఠ శుక్ల దశమి సౌమ్యవారం హస్తా నక్షత్రమున్నప్పుడు

గంగానదిలో స్నానమాచరించాలి. పాడ్యమి నుండి దశమి వరకు స్నానము చేయడం వలన సమస్త పాపములు తొలగిపోతాయి. స్నానానంతరము అర్ఘ్యము తిలోదకములు ఇవ్వాలి. అలా ఇచ్చినట్లయితే సమస్త పాపముల నుండి విముక్తి లభిస్తుందని స్కాంద పురాణము తెలియజేయుచున్నది. యజ్ఞములు, దానములు, తపములు, జపములు, శ్రాద్ధములు, పూజలు మున్నగు వాటిని గంగా తటమున ఆచరిస్తే కోటిరెట్లు పుణ్యసంపద ప్రాప్తిస్తుంది. పుణ్యతోయ గంగానదికి అనిర్వచనీయమైన మాహాత్మ్యము ఉన్నది. భవబంధములో చిక్కుకొనిపోయిన జీవులను భవసాగరము నుండి తరింపచేయగల అద్భుత శక్తి గంగానదికి ఉంది. తాపత్రయనాశిని, మోక్షదాయిని అయిన గంగ దర్శనము, స్పర్శ, నామోచ్చారణము, స్మరణము మాత్రము చేత జీవి సమస్త పాపముల నుండి తక్షణమే ముక్తుడు అవుతాడు. దైహిక, దైవిక, భౌతిక తాపములకు తక్షణమే ఉపశమనము లభిస్తుంది.

జ్యేష్ఠ శుక్ల దశమి నాడు స్నానము, దానము చాలా ముఖ్యము. పాపాత్ములు అయిననూ మహాపాతకులు అయిననూ శాస్త్రీయంగా, నియమములను పాటిస్తూ గంగాస్నానము చేయుట వలన పాపములు నశించి, పుణ్యము ప్రాప్తిస్తుంది. గంగా తీరమునకు స్నానార్థమై వెళ్ళినప్పుడు కొన్ని నియమములను తప్పనిసరిగా పాటించాలి. స్నానమునకు నదిలోనికి పోయినప్పుడు గంగను స్తోత్రము చేయాలి. గంగాదేవి పన్నెండు నామములను స్మరించాలి.

శ్లో ॥ "నందినీ నలినీ సీతా మాలతీచ మహాపగా
విష్ణుపాదాబ్జ సంభూతా గంగా త్రిపథగామినీ
భాగీరథీ భోగవతీ జాహ్నవీ త్రిదశేశ్వరీ
ద్వాదశైతాని నామాని యత్ర యత్ర జలాశయే
స్నానోద్యతః స్మరే నిత్యం త త్రవ సామ్యహమ్

గంగానదీ జలాలు అత్యంత పవిత్రమైనవి. అమృతతుల్యాలు. కృతయుగంలో అన్నీ పవిత్ర తీర్థములే. త్రేతాయుగములో పుష్కరమొక్కటే తీర్థము. ద్వాపరయుగములో కురుక్షేత్ర తీర్థము, కలియుగములో ఒక్కటే తీర్థము గంగా తీర్థము. త్రేతాయుగంలో ధ్యానము వలన మోక్షం లభించెడిది. త్రేతాయుగములోధ్యానము, తపము వలన మోక్షము ప్రాప్తించేది. ద్వాపరయుగములో ధ్యానము, తపము, యజ్ఞము – ఈ మూడింటి ఆచరణ వలన మోక్షము ప్రాప్తించెడిది. కాని కలియుగమున కేవలం గంగాస్నానము వలననే మోక్షం ప్రాప్తిస్తుంది. గంగాజలమును పానము చేసిన, పితరులకు తర్పణము వదిలినా, తక్షణమే సకల పాపరాశి భస్మమై పోతుంది. గంగ, గంగ అను నామమును దూరప్రాంతముల నుండి ఉచ్చరించిననూ పాపములన్నీ పటాపంచలై విష్ణులోకమునకు చేరుకుంటారని ఈ క్రింది



శ్లోకము ద్వారా తెలియుచున్నది.

శ్లో ॥ "గంగా గంగేతి యో బ్రూయాద్ యోజనాం శతైరపి
ముచ్యతే సర్వపాపేభ్యో విష్ణులోకం సగచ్ఛతి"

గంగానది యందు స్నానము చేయు సందర్భమున కొన్ని పనులకు దూరముగా ఉండాలి. మల మూత్ర విసర్జనలు చేయకూడదు. ముఖము కడుగకూడదు. దంతధావనము చేయకూడదు. పుక్కిలింత పనికిరాదు. పూజకు వాడిన పుష్పములను నదిలో వేయరాదు. స్నానము చేయునప్పుడు శరీరమును రుద్దుకుంటూ స్నానము చేయకూడదు. జలక్రీడలు పనికిరావు. ఈత కొట్టకూడదు. గంగానది యందు స్నానము చేస్తూ ఇతర నదుల పేర్లను స్మరించకూడదు. స్నానము చేసిన వస్త్రములను నదిలో వేయరాదు. తడి వస్త్రములను పిండరాదు. శరీరమునకు నూనె రాసుకుని నదిలోనికి వెళ్ళరాదు. స్నానము చేయునప్పుడు గంగను స్మరించుకుంటూ స్నానము చేయాలి. పనికిరాని సంభాషణలు, అసందర్భపు ప్రేలాపనలు, క్రూరదృష్టి, అటూ ఇటూ చూడటం మున్నగునవి పనికిరావు.

మానవులు తెలిసో తెలియకో పాపములు చేయడం సహజం. మానవులు చేయు పాపములను కాయికములు, వాచికములు, మానసికములు అని మూడు విధాలుగా విభజించారు. ఒకరి

సొమ్మును అన్యాయంగా తీసుకోవడం, శాస్త్రీయము గాని హింస అనగా అన్యాయముగా బాధించుట, పరస్త్రీ వాంఛ ఈ మూడు పాపములను కాయికములు అంటారు. చెడుగా మాటలాడటం, అబద్ధములు చెప్పడం, పరోక్షమున ఇతరులను దూషించడం, ప్రయోజన శూన్యమైన మాటలు మాటలాడటం అను ఈ పాపములను వాచికములు అంటారు. అనగా వాక్కుకు సంబంధించినవి. పరుల ధనమును అన్యాయముగా స్వాధీనము చేసుకోవాలన్న ఆలోచన, ఇతరుల గురించి చెడుగా ఆలోచించడం, పరలోకము అనునది లేదు, దేహమే జీవాత్మ అను విషయమున పట్టుదల కలిగి యుండుట అను ఈ మూడు పాపములు మానసికములు. గంగాజలము ఈ పాపములను నాశనము కావిస్తుంది.

గంగానదిలో స్నానము చేయునప్పుడు 'మమ ఏతజ్జన్మ జన్మాంతర సముద్భూత దశవిధ పాపక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం దశహర మహాపర్వ నిమిత్తం స్నానమహం కరిష్యే' అని సంకల్పం చెప్పుకుంటూ స్నానం చేయాలి. కాశీలోని దశాశ్వమేధ ఘట్టమునందు దశపాపహర దశమి నాడు స్నానమాచరించడం పుణ్యప్రదాయకం. గంగానదీ తటమునకు చేరుకొని పది సంఖ్య కలిగిన పుష్ప, గంధ, నైవేద్య, ఫల, దీప, తాంబూలాదులతో గంగానదిని పూజించాలి. ఓం నమః శివాయై, నారాయణ్యై దశహరాయై నమః అను మంత్రమును జపిస్తూ పూజించాలి. ఆ రాత్రి జాగరణ చేయాలి. ఉపవాసం ఉండాలి. గంగానది యందు పది సార్లు స్నానము చేయాలి. పదిసార్లు పది సంఖ్య గల నేయి కలిపిన నువ్వులను పది దోసిళ్ళు గంగానదిలో విడవాలి. బెల్లము, సత్తుపిండితో చేసిన పది పిండములను గంగానదిలో విడిచిపెట్టాలి. ''ఓం నమో భగవతి ఐం హ్రీం శ్రీం హిలి హిలి మిలి మిలి గంగే మాం పావయ స్వాహా'' మంత్రమును చదువుతూ అయిదు దోసిళ్ళ పుష్పాలను గంగకు అర్పించాలి. గంగానదిని భూమి మీదికి తెచ్చిన భగీరథుడిని, గంగానది జన్మస్థలమైన హిమాలయమును పై మంత్రముతో పూజించాలి. అనంతరం పది పండ్లు, పది దీపములు, పది శేర్ల నువ్వులు ''గంగాయై నమః'' అంటూ దానము చేయాలి. తాబేలు, చేప, కప్పలకు పూజలు చేసి గంగానదిలో విడిచిపెట్టాలి. పిదప పది శేర్ల నువ్వులు, పది శేర్ల జొన్నలు, పదిశేర్ల గోధుమలు పదిమంది బ్రాహ్మణులకు దానముగా ఇవ్వాలి. గంగా స్తోత్రమును పఠించాలి.

త్రిపథగామిని గంగానది మహత్తు అపారమైనది. గంగానది ప్రవహించు దేశములు, పర్వతములు, పదార్థములు పరమ పవిత్రములు. నియమనిష్ఠలతో ఒనర్చు యజ్ఞములు, బ్రహ్మచర్యము, తపము మున్నగు పుణ్యకర్మలు ఆచరించిననూ అవి గంగా సంగమ స్నాన ఫలముతో సమానము కావు. గంగానది యొక్క జలము కొంచెమైననూ దేహమునందు సోకినచో సమస్త పాపములు తొలగిపోయి స్వర్గ సౌఖ్యములు ప్రాప్తించును. ఎంతటి భయంకరమైన పాపములు చేసిననూ, గంగానది యందు స్నానమాచరించినచో సూర్యుడు ఉదయించగానే చీకట్లు తొలగిపోయినట్లు సమస్త పాపములు పటాపంచలవుతాయి. సోమము లేని యజ్ఞము, చంద్రుడు లేని రాత్రి, సూర్యుడు లేని ఆకాశము, వర్ణాశ్రమ ధర్మములు పాటించని ఆశ్రమము, పుష్పములు లేని వృక్షములు ఎంత హీనంగా ఉంటాయో, గంగానది ప్రవహించని దేశం అంత హీనంగా ఉంటుంది. గంగాజలం అతి పవిత్రజలం. ఈ జలమును త్రాగినందువల్ల కలుగు నిర్మలత్వము, శత చాంద్రాయణ వ్రతములు చేసిననూ కలుగదు. అగ్నిలో పడిన దూది వలె గంగానది యందు స్నానమాచరించువారి పాతకములు అంతరించిపోతాయి. దేవతలకు అమృతము వలె నరులకు గంగాజలం అత్యంత ప్రీతికరం. గంగానదీ తీరమున ఉన్న మట్టిని, శరీరమునకు రాసుకుని గంగానది యందు మునిగినచో, గరుత్మంతుడిని చూచి పాములు పారిపోవునట్లు మానవుల పాపములు మానవులనుండి పారిపోతాయి. గంగానది అలల మీదుగా వచ్చు గాలి దేహమును తాకినచో జనుల పాపములు సమసిపోతాయి. గంగా మాహాత్మ్యమును వినిననూ, వేడుకతో చెప్పుకొనిననూ, గంగానదిని చూచిననూ, గంగాజలమును తాకిననూ రెండు తరముల పితృజనులు పుణ్యగతిని పొందెదరు. గంగ, గంగ అని స్మరించుకుంటూ ఇతర నదుల యందు స్నానమాచరించిననూ పాపములు తొలగిపోతాయని పెద్దలు చెబుతుంటారు. గంగను స్మరించినచో మోక్షము ప్రాప్తించును. గంగను ప్రశంసిస్తే రాజభయము, చోరభయము, పాపభయము, భూతభయము మొదలగు సకల భయములు నశించిపోతాయి.

అత్యంత మహిమాన్వితమైన పవిత్రమైన గంగానది దివి నుండి భూమి మీదకు వచ్చిన గాథను సంక్షిప్తంగా స్మరించుకుందాం.

పూర్వకాలమున సగరుడు అను రాజు అయోధ్యానగరమునకు రాజు. సగరుడు అశ్వమేధ యాగమును చేస్తూ, యాగసంరక్షణ బాధ్యతను పౌత్రుడైన అంశుమంతుడికి అప్పగించాడు. తన పదవికి ముప్పు కలుగుతుందేమోనన్న శంకతో ఇంద్రుడు యాగాశ్వమును అపహరించి పాతాళ లోకమున కపిల మహర్షి ఆశ్రమమున బంధించాడు. ధ్యానమగ్నుడైన కపిలమహర్షి ఇంద్రుడు యాగాశ్వమును తన ఆశ్రమమున బంధించుట గమనించలేదు. అశ్వము అపహరింపబడుట యజ్ఞమునకు విఘ్నము. అందువలన అంశుమంతుడు, సగరుడి 60 వేల మంది పుత్రులు కలిసి భూలోకమంతా అణువణువూ గాలించారు. కాని అశ్వము జాడ తెలియరాలేదు. తుదకు భూమిని త్రవ్వుకుంటూ పాతాళమునకు వెళ్ళారు. అక్కడ కపిల మహర్షి ఆశ్రమమున యాగాశ్వం కనిపించింది. సగరపుత్రులు దొంగ, దొంగ అని

కేకలు వేసుకుంటూ ఆశ్రమం లోనికి వెళ్ళారు. ఆశ్రమంలో కపిల మహర్షిని చూడగానే అశ్వమును బంధించాడన్న మితిమీరిన ఆగ్రహంతో వధించడానికి ముందుకు వచ్చారు. ధ్యానభంగమైన కపిల మహర్షి కనులు తెరిచి తన ఆగ్నేయ నేత్రముతో చూడగానే సగరుని 60 వేల మంది పుత్రులు భస్మమై పోయారు. గరుత్మంతుడి ద్వారా విషయం తెలుసుకున్న అంశుమంతుడు కపిల మహర్షిని కలుసుకుని వినయంగా వందనమాచరించాడు. అంశుమంతుడి వినయవిధేయతలకు ప్రసన్నుడైన కపిల మహర్షి నీవు నీ అశ్వమును తీసుకువెళ్ళి యజ్ఞమును పూర్తి కావించుకొనుము. సగర పుత్రులు ఉద్ధండులు, అహంకారులు, అధర్మపరులు. వీరికి గంగాజలముతోనే ముక్తి ప్రాప్తిస్తుంది అని పలికాడు.

అంశుమంతుడు యాగాశ్వమును తీసుకుని అయోధ్యా నగరమునకు చేరుకున్నాడు. యజ్ఞమును పూర్తి కావించాడు సగరుడు. సగరుడి తర్వాత అంశుమంతుడు, అంశుమంతుడి తర్వాత దిలీపుడు, దిలీపుడి తర్వాత భగీరథుడు అయోధ్యాపతులైనారు. భగీరథుడు తన పూర్వీకుల ముక్తి కొరకు బ్రహ్మను గురించి తపమును చేశాడు. బ్రహ్మ భగీరథుడి తపమునకు ప్రసన్నుడై ప్రత్యక్షమైనాడు. వరమును కోరుకొమ్మని అడిగాడు. మా పూర్వీకుల ముక్తి కోసం గంగానదిని భూమి మీదికి పంపమని వరమడిగాడు భగీరథుడు. నీవు కోరిన ప్రకారము గంగను భూమి మీదకు పంపిస్తాను. గంగ వేగమును భరించేది కేవలం శివుడొక్కడే. కనుక శివుడిని ఆరాధించుము అని పలికి అదృశ్యమైనాడు. భగీరథుడు ఒంటికాలిపై నిలబడి శివుడి గురించి తపము చేశాడు. శివుడు భగీరథుడి తపమునకు ప్రత్యక్షమై వరము కోరుకొమ్మని అడిగాడు. భగీరథుడు గంగను భూమిమీదకు పంపమని అడిగాడు. భగీరథుని కోరిక ప్రకారము గంగానదిని తన జటా జూటమున బంధించాడు. ఒక జటను భూమి మీదకు విడిచిపెట్టాడు. ఈ విధంగా గంగ పృథ్వి మీదకు రాసాగింది. ముందు భగీరథుడి రథము నడుస్తుండగా, వెనుక గంగానది రాసాగింది. మార్గమధ్యమున జహ్ను మహర్షి ఆశ్రమమును ముంచి వేసింది. ఆయన ఆగ్రహంతో ఒక్క గుక్కలో గంగను త్రాగేశాడు. భగీరథుడి కోరిక మేరకు గంగను తనయగా స్వీకరించి, కుడి చెవినుండి విడిచిపెట్టాడు. అందువలన జాహ్నవి అను పేరు గంగకు వచ్చింది. భగీరథుడి తపముతో భూమి మీదకు వచ్చింది కనుక భాగీరథి అయింది. గంగ కపిల మహర్షి ఆశ్రమమును చేరుకుని, సగరుడి పుత్రుల భస్మము మీద ప్రవహించింది. గంగాజల స్పర్శతో సగరపుత్రులు దివ్యరూపధారులై దివ్యలోకములకు వెళ్ళిపోయారు.

గంగానది భక్తుల యందు సదా వాత్సల్యపూరితురాలు. తనయందు భక్తి గలవారికి గంగాదేవి ఎప్పుడూ సుఖ సౌఖ్యాలను ప్రసాదిస్తుంది. కనుక దశ పాపహర దశమి నాడు భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో ఆరాధించి, జీవితములను పునీతము గావించుకుందాం.

# దిశానిర్దేశము 2వ సంపుటము పుస్తకావిష్కరణ



శ్రీ వేంకటేశం మాసపత్రికలో ప్రచురితమైన 'తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశము' 13 నుండి 24 భాగాలు కలిపి దిశానిర్దేశము 2వ సంపుటముగా తేది 19.5.2025 సోమవారం సాయంత్రం, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పుస్తకావిష్కరణ జరిగింది. శ్రీశ్రీశ్రీ అహోబిల జీయర్‌స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణ మరియు మంగళాశాసనములతో ఈ కార్యక్రమము జరిగింది. ఎక్స్ టి.టి.డి. ఈ.వో శ్రీమాన్ రమణాచారి గారు, విశ్రాంతాచార్యులు పూర్వ రిజిస్ట్రర్ తెలుగు యూనివర్సిటి మరియు శ్రీవేంకటేశం పత్రిక గౌరవ సంపాదకులు శ్రీమాన్ గౌరీశంకర్ గారు, పుల్లగూర్ల సాయిరెడ్డి దంపతులు, భక్తులు పాల్గొన్నారు. ఈ పుస్తకావిష్కరణ సందర్భంగా అన్నమయ్య కీర్తనల బృందగాన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

# పురాణాలు సుహృత్ సమ్మితాలు



– డా॥ కూర్మాచలం శంకరస్వామి

**వేదం ప్రభు సమ్మితం**

**కావ్యం కాంతా సమ్మితం**

**పురాణం సుహృత్ సమ్మితం**

అని పేర్కొన్నారు మన పండితులు. భారత దేశం వేదాలకు పుట్టినిల్లు. అందుకే మన దేశం వేదభూమిగా, నాదభూమిగా, కర్మభూమిగా, ధర్మభూమిగా కీర్తించబడుతోందంటే దానికి ప్రధాన కారణం ఇక్కడ ఎందరో ఋషులు, తాపసులు యజ్ఞ యాగాదులతో ఈ నేలను పునీతం చేయడమే.

'వేదం ప్రభు సమ్మితం' అనగా ప్రభువు రాజు. ఆ రాజులను రక్షించే రాజులకు రారాజు ఆ భగవంతుడు. అతడే యజమాని. ఆ యజమాని చెప్పిందే వేదవాక్కు. ఉదా: సత్యం వద, ధర్మం చర. ఆ భగవంతుడు ప్రతిపాదించిన ధర్మాలను ఎవరు ఆచరిస్తారో వారి కి కైవల్య ప్రాప్తి సిద్ధిస్తుంది. ఇక రెండవది కావ్యం. ఇది ఇ తిహాస ప్రధానమైనది. దీనికి ఉదాహరణలు రామాయణ, భారతాలు. తల్లితండ్రుల పట్ల పిల్లలు ఎలా ఉండాలో, భార్యా భర్తల మధ్య ఐక్యత, రాజులు ఎలాంటి ధర్మాలను పాటించాలో, సఖ్యతను ఎలా నిర్వర్తించాలో, ఓర్పు, నేర్పు ఎలా ప్రదర్శించాలో రామాయణం బోధించగా, దాయాదులు అనగా అన్నదమ్ములు సఖ్యతగా లేకుంటే ఎలాంటి యుద్ధం వస్తుందో, దాని వల్ల ఎన్ని వంశాలు సర్వనాశనం అవుతాయో, దుష్టశిక్షణ, శిష్టరక్షణ ఎలా చేయాలో, చపలత్వాన్ని ఎలా పోగొట్టాలో, గర్వాన్ని ఎలా అణచివేయాలో, ధర్మాన్ని ఎలా రక్షించాలో, అధర్మానికి ఎలాంటి గతి పడుతుందో ఇత్యాది విషయాలను భారతం చెప్తుంది. ఇక మూడవది పురాణం సుహృత్ సమ్మితం. సుహృత్ అనగా మంచి లేదా స్నేహం. స్నేహితునిలా మంచి మార్గాన్ని చూపిస్తూ ముందుకు నడిపించేవి పురాణాలు. వీటివల్ల ప్రధానమైన మూడు ఉపయోగాల గురించి కంచి పరమాచార్యులు ఇలా వివరించారు. 1. పూర్వ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వర్తమాన భవిష్యత్తులలో ఎలా నడుచుకోవాలి. 2. మంచి ప్రవర్తన అంటే ఏమిటి? సత్ప్రవర్తన గల వారు పొందిన సద్గతులు, దుష్ప్రవర్తన గలవారు పొందిన దుర్గతులను బోధిస్తూ మానవులను సన్మార్గం వైపు నడిపించుటకు పురాణాలు ప్రయత్నిస్తాయని దృష్టాంతాలతో సహా బోధిస్తాయి. 3. దుష్టకార్యాలు ఏవి, మంచి కార్యాలు ఏవి, ఏ నోములు వ్రతాలు ఎలా చేయాలి, వాటి నిర్వహణలో ఏవైనా లోపాలు జరిగితే ఎలాంటి ఆపదలు సంభవిస్తాయి? ఏవి ధర్మార్థ మోక్ష కామాలో, వాటిని ఎలా నిర్వర్తించాలో ఈ పురాణాలు ఉపయోగపడతాయని పరమాచార్యులు ఉద్ఘాటించారు. ''పుర అభినవ'' అనగా పురాణాలు ఎప్పుడూ నిత్యనూతనమే, అవి ఎప్పటికైనా, అప్పటికైనా, రేపటికైనా, నూతనత్వంగానే ఉంటూ మనకు మార్గదర్శనం చేస్తూనే ఉంటాయి.

**"సర్గశ్చ ప్రతిసర్గశ్చ – వంశో మన్వంతరాణీచ**

**వంశానుచరితం చేతి – లక్షణా నాంతు పంచకం"**

పురాణమునకు, పురాణ గ్రంథానికి అయిదు లక్షణాలు ఉండాలట. అవి 1. సర్గలు 2. ప్రతి సర్గలు 3. వంశ వృక్షాలు 4. వంశ చరితత్రలు 5.మన్వంతరాలు అనేవి తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు లక్షణకారులు. ఈ పురాణాలన్నీ విరాట్ స్వరూపుని శరీర భాగాల నుండి ఉద్భవించాయి. ఇవి మొత్తం పద్దెనిమిది. వీటినే అష్టాదశ పురాణాలు అంటారు. వీటిని విష్ణుమూర్తి బ్రహ్మకు, బ్రహ్మ నారదునకు, నారదుడు వేదవ్యాసునకు చెప్పగా వాటిని వ్యాసుడు రచించి మనకు అందించిన మహత్తర జ్ఞాన

సంపద ఈ అష్టా దశ పురాణాలు. వ్యాసో నారాయణో హరి అన్నారు. ఆ శ్రీమన్నారాయణుడే వేదవ్యాసుని రూపంలో వచ్చి రచించాడు కాబట్టి వ్యాసభగవానుడయ్యాడు.

ఈ అష్టాదశ పురాణాలు 1. బ్రహ్మపురాణం (శిరస్సు) 2. పద్మపురాణం (హృదయం) 3. విష్ణుపురాణం (కుడిభుజం) 4. వాయుపురాణం (ఎడమభుజం) 5. భాగవత పురాణం (తొడలు) 6. నారద పురాణం (నాభి) 7. మార్కండేయ పురాణం (ఎడమపాదం) 8. అగ్ని పురాణం (కుడి పాదం) 9. భవిష్య పురాణం (కుడి మోకాలు) 10. బ్రహ్మవైవర్త పురాణం (ఎడమ మోకాలు) 11. లింగపురాణం (కుడి చీలమండ) 12. వరాహపురాణం (ఎడమచీలమండ) 13. స్కంధపురాణం (కురులు) 14. వామనపురాణం (చర్మం), 15. కూర్మపురాణం (వెన్ను) 16. మత్స్యపురాణం (మెదడు) 17. గరుడపురాణం (మజ్జ) 18. బ్రహ్మాండ పురాణం (ఎముకలు). ఇవేకాక 18 ఉప పురాణాలు కూడా రచించబడ్డాయి. ఈ అష్టాదశ పురాణాలు ఒక్కొక్క విశిష్టతను కలిగి ఉండి, ఒక్కొక్క ధర్మానికి ప్రతీకలుగా నిలిచాయి. ప్రజలలో భక్తిభావనను పెంపొందిస్తున్నాయి. వీటి సంక్షిప్త పరిచయం ఈ క్రింద పేర్కొనడం జరిగింది.

**1. బ్రహ్మ పురాణం :** ఈ పురాణం పురాణ పురాణ పురుషుని శిరస్సు నుండి ఉద్భవించింది. ఇందులో 10 వేల శ్లోకాలు, పూర్వభాగము, ఉత్తర భాగము కలిపి 246 అధ్యాయాలు ఉన్నాయి. దీనిని వేదవ్యాసుడు జైమిని మహర్షికి చెప్పాడు. ఇందులో ధర్మార్థ కామ మోక్షాల గురించి హరిశ్చంద్రుడు దధీచి, ఆత్రేయ, మార్కండేయ ఋషుల గురించి, కృష్ణచరిత్ర, ఇక్ష్వాక వంశచరిత్ర, వివిధ అవస్థలు, భూగోళం, కోణార్క దేవాలయం, కపిలగీత, ధన్యమతి వృత్తాంతం మొదలగు విషయాలు వర్ణించబడ్డాయి.

**2. పద్మపురాణం :** ఈ పురాణం పరమాత్ముని హృదయం నుండి ఉద్భవించింది. దీనిలో 55 వేల శ్లోకాలు, నాలుగు కాండలున్నాయి. 1. సృష్టి 2. స్వర్గ 3. భూమి, పాతాళ కాండలు, దేవతలు, పితృదేవతలు, సప్తసాగర వర్ణనలు, సూర్యచంద్ర వంశానుక్రమణ, మోక్షపర్వం, పృథు చక్రవర్తి, మార్కండేయ వృత్తాంతము, యక్ష, కిన్నెర, గంధర్వుల వృత్తాంతము, భరత జననం, 14 లోకాల వర్ణనలు ఉన్నాయి.

**3. విష్ణుపురాణం :** ఇది పురాణ పురుషుని కుడి భుజం నుండి ఉద్భవించిన పురాణం. ఇందులో 10 వేల శ్లోకాలు, భూగోళం, ఆశ్రమాలు, 112 అధ్యాయాలు, శ్రాద్ధకర్మలు, వైష్ణవ మత ప్రామాణికాలు రామానుజాచార్యులు ప్రతిపాదించినవి శ్రీకృష్ణలీలలు, జడభరతుని వృత్తాంతాలు వర్ణించబడ్డాయి.

**4. వాయు పురాణం :** ఇది పురాణ పురుషుని ఎడమ భుజం నుండి ఉద్భవించిన పురాణం. ఇందులో 25 వేల శ్లోకాలున్నాయి.




బాణభట్టు రచించిన కాదంబరి గద్య కావ్యానికి మూలం. సంగీత, సాహిత్యాల పరంగా అతి సుందరమైన పురాణం. శివలీలా విలాసాలు వర్ణించబడ్డాయి.

**5. భాగవత పురాణం :** ఈ పురాణం పరమ పురుషుని తొడల నుండి ఉద్భవించిన పురాణం. ఇది 25 వేల శ్లోకాలు, ద్వాదశ అధ్యాయాలతో కూడిన సద్భక్తి సంజాతం భాగవతం. దీనిని శుకమహర్షి శాపగ్రస్థుడైన పరీక్షిన్మహారాజుకు చెప్పాడు. ఇది స్కంధములలో రచించబడిన పవిత్రమైన పురాణం. దీనిలో మొదటి స్కంధములో నారద మహర్షి భాగవత రచనకు వ్యాసుని ప్రేరేపించుట, కుంతీదేవి శ్రీకృష్ణుని స్తుతించుట, భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించుట, ద్వితీయ స్కంధంలో శుకమహర్షి పరీక్షిత్తునకు ముక్తిమార్గము చూపుట, తృతీయ స్కంధములో విదురుడు ధృతరాష్ట్రునకు హితవు బోధించుట, చతుర్థ స్కంధములో హిరణ్యాక్షుని శ్రీహరి వరాహరూపంలో సంహరించుట, శ్రీహరిని ధృవుడు స్తుతించుట, రుద్రుడు ప్రచేతసులకు విష్ణువు గురించి తెలుపుట, పంచమ స్కంధములో సింధూ రాజైన రహూగణునకు భరతుడు బోధ సేయుట, నరక లోకముల గురించి వివరణ, షష్ఠమ స్కంధములో శుకమహర్షి పరీక్షిత్తుతో అజామిళుని వృత్తాంతం తెలుపుట, సప్తమ స్కంధంలో ప్రహ్లాదచరిత్ర, శ్రీనరసింహుని ఆవిర్భావము, ప్రహ్లాదుడు నరసింహుని స్తుతించుట, అష్టమ స్కంధంలో గజేంద్ర మోక్షము, క్షీరసాగర మథనం, విష్ణువు మోహినీ రూపం ధరించుట, వామనమూర్తి ఆవిర్భావము, నవమ స్కంధంలో అంబరీషోపాఖ్యానము, శ్రీరామచరిత్రము, పరశురామ చరిత్ర, యయాతి చరిత్ర, రంతిదేవుని చరిత్ర, దశమస్కంధములో పూర్వభాగములో శ్రీకృష్ణజననము, గోపాలకృష్ణుడు కాళియమర్దనం, శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతమెత్తుట, అక్రూరుడు బృందావనము వచ్చుట, భ్రమరగీతలు, రుక్మిణీకళ్యాణం, దశమస్కంధం ఉత్తరభాగంలో నరకాసురవధ, ఉషాపరిణయం, కుచేలోపాఖ్యానం, శృతిగీతలు, ఏకాదశ స్కంధంలో అవధూత యదు సంవాదము, ద్వాదశ స్కంధములో కలియుగ ధర్మములు, శ్రీకృష్ణుని కుంతీదేవి స్తుతించుట, వేణుగీత, సంకీర్తనం మొదలగు

అంశాలు వర్ణించబడ్డాయి.

**6. నారద పురాణం :** ఈ పురాణం పురాణ పురుషుని నాభి నుండి ఉద్భవించింది. దీనిలో 25 వేల శ్లోకాలున్నాయి. పూర్వ, ఉత్తర భాగాలు, వర్ణాశ్రమ ధర్మాలు, శ్రాద్ధ విధులు, వ్యాకరణం, జ్యోతిషం, రాముడు కృష్ణుడు, మంత్ర విశేషాలు, ఋక్మాంగద చరిత్ర మొదలగునవి వర్ణించబడ్డాయి.

**7. మార్కండేయ పురాణం :** ఇది పురాణపురుషుని ఎడమ పాదం నుండి ఉద్భవించింది. మార్కండేయుడు జైమినీ మహర్షికి చెప్పాడు. ఇందులో 9 వేల శ్లోకాలు, జీవుని ప్రయాణం, దేవగీత, చతుర్దశ మన్వంతరాలు, అష్టాంగయోగం, దత్తగీత, మదాలస చరిత్రము మొదలగునవి వర్ణించబడ్డాయి.

**8. అగ్నిపురాణం :** ఇది పురాణపురుషుని కుడి పాదం నుండి ఉద్భవించింది. 16 వేల శ్లోకాలు, చారిత్రక అంశాలు, వరాహ కల్పవృత్తాంతము, వశిష్ఠుడు మహర్షుల వృత్తాంతము, వగ్నిశ్రోత, విజ్ఞాన అంశాలు, ఛందస్సు ఆయుర్వేదం, కావ్యసౌందర్యం మొదలగు అంశాలు వర్ణించబడ్డాయి.

**9. భవిష్యపురాణం :** ఈ పురాణం పురాణపురుషుని కుడి మోకాలు నుండి పుట్టినది. ఇందులో 14 వేల శ్లోకాలు ఉన్నాయి. పాశ్చాత్యుల ప్రవేశం, సూర్యోపాసనలు, శ్రీకృష్ణుని కుమారుడు సాంబుని వృత్తాంతం, అనేక రాజవంశాలు వారి విశేషాలు, త్రిమూర్తులు విశేషాలు, భవిష్యత్తులో సంభవించే సంఘటనలు వర్ణించబడ్డాయి.

**10. బ్రహ్మవైవర్త పురాణం :** ఇది విరాట్స్వరూపుని ఎడమ మోకాలు నుండి ఉద్భవించింది. దీనిలో 11 వేల శ్లోకాలు ఉన్నాయి. 4 ఖండాలు. బ్రహ్మఖండం, స్వర్గఖండం, ప్రకృతి ఖండం, కృష్ణఖండం, రాధాకృష్ణుల లీలావిలాసం స్వర్గ ఖండం, కృష్ణఖండం, సృష్టి ఖండాలలో జగత్ సృష్టి, ప్రకృతి ఖండంలో ప్రకృతి ఆవిర్భావ విశేషాలు వర్ణించబడ్డాయి.

**11. లింగపురాణం :** ఇది పురుషోత్తముని కుడి చీలమండ నుండి ఆవిర్భవించింది. దీనిలో 11 వేల శ్లోకాలున్నాయి. లింగోద్భవం, శివలీలా విశేషాలు, పాపపుణ్యాలు, దీక్షల విశేషాలు, పూజా విధానాలు, జ్యోతిర్లింగాలు, బిల్వార్చన మొదలగు అంశాలు వర్ణించబడ్డాయి.

**12. వరాహ పురాణం :** ఇది పురాణ పురుషుని ఎడమ చీలమండ నుండి ఉద్భవించింది. దీనిలో 24 వేల శ్లోకాలున్నాయి. భూమి ఆవిర్భావ విశేషాలు, గీతా ద్వాదశ వ్రతాలు, గీతా మాహాత్మ్యము, సప్తగిరుల విశేషాలు, చాతుర్మాస్య వ్రతాలు, నోములు, ఆచారాలు వర్ణించబడ్డాయి.

**13. స్కంధ పురాణం :** ఇది పురాణ పురుషుని కురుల నుండి ఉద్భవించినది. ఇది 81 వేల శ్లోకాలు కలిగిన అతి పెద్ద పురాణం. కుమారస్వామి, భూదేవి, ఆధ్యాత్మిక రామాయణం, వేంకటాచల వైభవం, మహేశ్వర, వైష్ణవ వృత్తాంతాలు, కాశీ, రేవ అవంతిక, నాగర ప్రశంస, బ్రహ్మఖండ విశేషాలు, పుణ్యక్షేత్రాలలో పుణ్యస్నానాల విశేషాంశాలు, గంగ, నర్మద విశేషాలు వర్ణించబడ్డాయి.

**14. వామన పురాణం :** ఇది 10 వేల శ్లోకాలు, పూర్వ ఉత్తర భాగాలు కలిగిన పురాణం. మహేశ్వరుల భక్తుల వృత్తాంతము, జగదంబ, పార్వతి గణేష్ ల వర్ణన, శివకేశవుల అభేద నిరూపణ, వామన వృత్తాంతము .

**15. కూర్మపురాణం :** ఇది పురాణపురుషుని వెన్నుభాగము నుండి ఆవిర్భవించిన పురాణం. ఇందులో 18 వేల శ్లోకాలున్నాయి. పాతాళ లోకాల వర్ణన, కూర్మావతారం విశేషాలు, మోహినీ అవతారం, లక్ష్మీ కళ్యాణం, బ్రహ్మ, విష్ణు పరతంత్ర శాస్త్రములు, కాశీ, ప్రయాగ పుణ్యక్షేత్రాల మహిమలు వర్ణించబడ్డాయి.

**16. మత్స్య పురాణం :** ఇది పురాణపురుషుని మెదడు నుండి ఉద్భవించిన పురాణం. దీనిలో 14 వేల శ్లోకాలున్నాయి. దీనిని మత్స్యావతార మూర్తియైన శ్రీమహావిష్ణువు ప్రళయకాలంలో వైవస్వత మనువుకు చెప్పాడు. 250 అధ్యయాలు కలిగిన ఈ పురాణంలో మన్వంతరాల విశేషాలు, సూర్య చంద్ర వంశాలు, గ్రహరాశులు, 32 ఋషి మహిమలు, సప్తద్వీప వర్ణనలు, సప్తసాగరాల వర్ణనలు ఈ పురాణంలో ఉన్నాయి.

**17. గరుడ పురాణం :** ఇది పురాణ పురుషుని మజ్జ నుండి ఉద్భవించినది. దీనిలో 18 వేల శ్లోకాలున్నాయి. జన్మాంతర ప్రారబ్ధ విశేషాలు, శ్రాద్ధ కర్మలు, ధ్యానవిధులు, రోగాలు, ఆయుర్వేదం మొదలగునవి వర్ణించబడ్డాయి.

**18. బ్రహ్మాండ పురాణం :** ఇది పురాణ పురుషుని ఎముకల నుండి ఉద్భవించినది. దీనిలో 12 వేల శ్లోకాలు ఉన్నాయి. సకల చరాచర జగత్తు, జీవకోటి విశేషాలు, చారిత్రక అంశాలు, ఆధ్యాత్మిక రామాయణం, పరశురామ చరిత్ర, నక్షత్రాలు నాలుగు పాదాలు మొదలగు అంశాలు వర్ణించబడ్డాయి. అంతేకాదు ఈ పుణ్య దేశంలోని పుణ్య నదుల గురించి విపులంగా పొందుపరిచారు.

ఈ విధంగా వ్యాస భగవానుడు అందించిన జ్ఞాన సంపదలైన ఈ అష్టాదశ పురాణాలు చదివినా, శ్రద్ధగా శ్రవణం చేసినా (చెవులారా విన్నా) ఎంతో పుణ్యం కలుగుతుందని, సమస్త మానవాళికి ఆయుస్సు, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయాలు సమకూరుతాయని ఆయా పురాణాల చివరలో ఉన్న ఫలశ్రుతులను బట్టి తెలుస్తుంది. వీటి ద్వారా ఏది సత్యమో ఏది అసత్యమో, ఏది ధర్మమో, ఏది అధర్మమో, ఏ కర్మ అయితే ఎలాంటి ఫలితం వస్తుందో చక్కగా వర్ణించబడ్డాయి.

**"సర్వేజనా స్సుఖినోభవంతు"**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 352. మహా మాయాయ నమః

– తన యెడ ప్రపన్నులు కాని వారిని మోహింప జేయ గలవాడు. ఆశ్చర్యకరములైన గుణములు, చేష్టలు గలవాడు – కృష్ణభగవానుడు.

త్రిగుణాత్మకమగు మాయ చేత ప్రకృతి లోని వ్యక్తులు ఎంతటి వారైనను భగవత్స్వరూపమున తెలిసికొనజాలరు అని ఈ నామము తెలుపుచున్నది.

ఇచ్చట మాయా శబ్దము మిధ్యారూపార్థమును బోధించదు. సత్యములైన, వాస్తవములైన అనేక అద్భుత కార్యములు కూడా మాయా శబ్దము తెలుపుచున్నది.

మహతి అనగా చాలా గొప్పది. చాలా గొప్పదైన మాయ గలవాడు మహా మాయావి. విష్ణుదేవుడు.

**మాయావీ పరమానందం త్యక్త్వా వైకుంఠ ముత్తమమ్**
**స్వామి పుష్కరిణీ తీరే రమయా సహ మోదతే – హరివంశం, శేషధర్మం – 48–14 శ్లో.**

–భగవంతుడు విష్ణుదేవుడు మాయావి. ఆయన లీలలు నిగూఢములు. ఉత్తమమైన మహానంద స్వరూపమైన వైకుంఠమును వదిలిపెట్టి విష్ణుదేవుడు వేంకటాద్రిపై స్వామి పుష్కరిణీ తీరమున ఆనందనిలయమున లక్ష్మీదేవితో కూడి ఆనందించుచున్నాడు. తామరపల్లి తిమ్మయ్య –

**లోక వినుత మైన వైకుంఠ నగరి**
**మాని నుత విహారి మాయదారి**
**శౌరి రమయు దాను స్వామి పుష్కరిణీ**
**తటిని నధి వసించు వినుత లీల – శేషధర్మ 1 అ – 106 అని స్తుతించాడు.**

విష్ణుదేవుడు మాయావిగా ప్రసిద్ధుడు. మాయదారి యైన విష్ణువు మోహినీ రూపమున కనిపించి పరమ శివుని కూడా మోహింప చేసినాడు.

ఈ మాయావి పేరు విష్ణు సహస్ర నామములలో 172 సంఖ్యతో "మహా మాయః" అని వున్నది.

మహా మాయావి అయిన విష్ణుమూర్తి అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 353. జాంబవత్కృత సంగరాయ నమః

శమంతకమణి కొరకై జాంబవంతునితో పోరాడినవాడు కృష్ణుడు. ఈ శమంతకమణి వృత్తాంతము మణ్యాహర్తా అను 351 నామములో విపులముగా వివరించబడింది. పరిశీలించండి.

జాంబవంతునితో శమంతకమణి కోసం ద్వంద్వ యుద్ధం చేసిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 354. జాంబూనదాంబర ధరాయ నమః

–సువర్ణమయ వస్త్రములను ధరించువాడు కృష్ణుడు.

జంబూనది మేరు పర్వతానికి దక్షిణమున ఉన్న జంబూ వృక్షం ఫలరసాలతో ఏర్పడిన ఒక నది. (నేరేడు పండు, నేరేటేరు) ఈ నీరు ప్రవహించిన ప్రాంతము అంతా బంగారు

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

మయమ వుతుంది . ఈ నీరు త్రాగినవారికి జరా వ్యాధులుండవు. దప్పిక ఉండదు. ఇక్కడ జంబాద్విని అనే దేవత ఆలయం ఉంది. కృష్ణుడు బంగారు మయములైన వస్త్రములను ధరించేవాడు. జాంబూనదము అనగా బంగారము. సువర్ణమయమైన వస్త్రములను ధరించు కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 355. గమ్యాయ నమః

–అందరూ పొందదగినవాడు విష్ణుదేవుడు. ఉజ్జీవింపదలంచిన వారికి పరమ ధర్మము గమ్యస్థానము భగవంతుని సన్నిధానమే. బదరీ క్షేత్రమున ముముక్షువులైన వారికి ఉజ్జీవన హేతువైన మోక్ష ప్రదర్శకమగు "ఓం నమో నారాయణాయ" అను అష్టాక్షరీ మంత్రము భగవంతుని చేత ఉపదేశింపబడింది. గమ్యమనగా మోక్షము. వైకుంఠము.

జీవులందరికీ గమ్యమైనవాడు విష్ణుదేవుడు. అతని అర్చావతారమూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 356. జాంబవతీ విభవే నమః

జాంబవంతుని కుమార్తె యగు జాంబవతికి భర్త అయిన వాడు కృష్ణుడు. జాంబవతి కృష్ణుని అష్ట మహిషులలో ఒకతె. యాదవుల నాశనమునకు కారణమైన ముసలమును ప్రసవించిన వాడు అగు సాంబుడు జాంబవతి కుమారుడే. అష్టమహిషులలో రెండవది జాంబవతి.

## 357. కాళిందీ ప్రథితారామ కేళయే నమః

– యమునా నదిగా ప్రసిద్ధమైన కాళిందీ నది తీరమునందు ప్రసిద్ధమైన బృందావన ఉద్యానవనమున విహారము గలవాడు కృష్ణుడు. యమునా నది కళింద పర్వతమునందు పుట్టినది. కనుక కాళింది అను పేరు వచ్చింది.

కాళిందీ నది తీరమున ప్రసిద్ధమైన ఉద్యానవనమునందు విహరించిన వాడగు కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 358. గుంజావతంసకాయ నమః

గురివెంద గింజలను కర్ణాద్యాభరణములుగా ధరించినవాడు బాలకృష్ణుడు. ఇవి ఆనాటి పల్లెటూరి పిల్లల ఆభరణములు.

గురిజ గింజలను ఆభరణములుగ ధరించిన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 359. మందార సుమనో భాస్వతే నమః

–మందార పుష్పములు ధరించి ప్రకాశించువాడు కృష్ణుడు. మందార పుష్పముల మాలను ధరించి ప్రకాశించువాడగు కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

(సశేషము)



ధారావాహికం

# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

ఎక్కడ అవకాశం వస్తే అక్కడ రామకథ వర్ణిస్తాడు వాల్మీకి. అతని కళ్యాణ గుణాల్ని ఏకరువు పెడతాడు. తినగ తినగ వేము తియ్యగా వుంటుందిట. అలాగే రామకథ – రామ కళ్యాణగుణాలు వినగా వినగా చదవగా చదవగా – రాముని సద్గుణాల్లో ఒక్కటైనా మనం పుణికి పుచ్చుకోవాలి. అది వాల్మీకి మహర్షి ఆశయం. అది కవి హృదయం.

## రాముణ్ణి రమ్మను

రామగుణ కీర్తనం వినింది సీతాదేవి. ఆమె ముఖం వెలిగిపోయింది. రాముడు నన్నే ధ్యానిస్తున్నాడు. ఆ మాట ఆమెకు అమృతతుల్యం. శోకమగ్నుడై ఉన్నాడు. ఆ మాట విషతుల్యం. ''పుష్కలమైన ఐశ్వర్యం ఉన్నా – దారుణమైన ఆపదలో ఉన్నా దైవం బంధిస్తుంది – ఎక్కడికో లాక్కుపోతుంది – దైవాన్ని ప్రాణికోటి నిగ్రహించలేదు. ఇది నిజం. నేను రాముడు లక్ష్మణుడు కష్టాల పాలైనాం. ఎలా బాధపడుతున్నామో చూడు. దుఃఖ సముద్రంలో పడవ పగిలింది. ఈదుతూ అలసిపోతూ మునుగుతూ తేలుతూ ఉన్నాడు రాముడు. ఎప్పుడు గట్టెక్కుతాడో? రాక్షసుల్ని హతమార్చాలి. రావణుని వధించాలి. లంకను రూపుమాపాలి. నన్నెపుడు చూస్తాడో! నాకు రావణుడు సంవత్సరం గడువు పెట్టాడు. పది నెలలు గడిచాయి. ఇక రెండు నెలలు మిగిలాయి.

హనుమా! రావణుని తమ్ముడు విభీషణుడు. నన్ను రామునికి అప్పగించు అని చెప్పాడట. బతిమాలాడట. రావణుడు వినలేదు. నన్ను అప్పగించడం అతనికి ఇష్టం లేదు. చావు మూడింది. మృత్యుదేవత ఎదురు చూస్తోంది రావణుని కోసం. విభీషణుని పెద్ద కూతురు అనల – నా దగ్గరికి వచ్చింది. అక్కడి సంగతులు చెప్పింది. ''రాముడు వస్తాడు. నన్ను కల్సుకుంటాడు. అంతరాత్మ చెబుతోంది. రామునిలో ఉత్సాహం పౌరుషం, బలం, దయ, కృతజ్ఞత, శౌర్యం ఉన్నాయి. జనస్థానంలో ఒక్కడే పధ్నాలుగు వేల రాక్షసుల్ని సంహరించాడు. ఏ శత్రువైనా రాముని ముందు నిలవడు. బతకడు. ఎన్ని కష్టాలు రానీ చలించడు. దేవేంద్రుని ప్రభావం శచీదేవికి తెల్సు. రాముని ప్రభావం నాకు తెల్సు'' అంది మైథిలి. బొట బొట కన్నీరు కార్చింది. దుఃఖంలో మునిగిపోయింది.

శ్రద్ధగా విన్నాడు హనుమంతుడు. ''దేవీ! నేను వెళ్తాను. చెబుతాను. వెంటనే రాముడు బయలుదేరుతాడు. వానర భల్లూక సేనలు వెంట నడుస్తాయి. లేదా రాముణ్ణి ఇపుడే చూడాలనుకుంటున్నావా? నా వీపు మీద కూర్చో. సముద్రం దాటిస్తాను. నిన్నే కాదు రావణుణ్ణి, లంకను కూడా ఎత్తుకెళ్తాను. ఆ శక్తి నాకుంది. అమ్మా హవిస్సుని అగ్నిహోత్రుడు మోసుకెళ్తాడు.

దేవేంద్రుడికిస్తాడు. అలా నిన్ను మోసుకెళ్తాను. ప్రసవణగిరి మీద ఉంటాడు రాముడు. అతనికి నిన్ను సమర్పిస్తాను.

మంగళస్వరూపిణీ! నా వీపు మీద కూర్చో. నా మాట కాదనకు. రాముని సన్నిధికి చేరుస్తాను. నిన్ను రాక్షసులు చూడొచ్చు. భయపడకు. నన్నెవరూ పట్టుకోలేరు. నా గమనవేగం లంకలో ఎవరికీ లేదు. నేనెలా వచ్చానో అలా నిన్ను సముద్రం దాటిస్తాను. సందేహించకు తల్లీ''.

వినింది జానకి. సంతోషించింది. అంటోంది. ''హనుమా! నన్ను నీవు తీసుకెళ్తావా? అది నీ సాహసమా? కపిత్వమా? ఇంత చిన్న దేహం నీది. నన్ను మోసుకెళ్తావా?'' అడిగింది. ఆమె గొంతులో ఆశ్చర్యం ఆనందం మిళితమైనాయి.

విన్నాడు మారుతాత్మజుడు. ఎంత పరాభవం. అది కొత్త అవమానం. మునుపెన్నడూ పడలేదు అనుకున్నాడు. ఈమెకు నా బలం తెలియదు. నా శక్తి తెలియదు. నా రూపం చూపుతాను. తనలో తలచాడు. అంతవరకు చెట్టుకిందున్నాడు. ఒక గెంతు వేశాడు. అవతల నిలబడ్డాడు. సీతమ్మకు నమ్మకం కలగాలనుకున్నాడు. తన దేహం పెంచాడు. మేరు పర్వతమంతగా మందరపర్వతమంతగా పెరిగాడు. ప్రజ్వరిల్లే అగ్నిహోత్రంలా నిలబడ్డాడు.

ఎర్రని ముఖం, వజ్రాల్లాంటి కోరలు, పెద్దపులి లాంటి గోళ్ళు పరమ భయంకరంగా ఉన్నాడు. మహాపర్వతంలా ఉన్నాడు. అంజలి ఘటించాడు. అంటున్నాడు. ''పర్వతాలు ప్రాకారాలు తోరణాలు బురుజులు మహాద్వారాలతో వుంది లంకానగరం. రావణునితో సహా మోసుకుపోతాను. నాకా శక్తి ఉంది. మంగళస్వరూపిణీ! నీ బుద్ధి దృఢం చేసుకో. ఉపేక్షించకు. నా వీపు మీద కూర్చో. రామలక్ష్మణుల దగ్గరికి తీసుకెళ్తాను. వాళ్ళు నిన్ను చూస్తారు. శోకరహితులవుతారు''.



చూసింది విశాలాక్షి వైదేహి. హనుమంతుని రూపాన్ని వూహించలేదామె. అంటోంది. ''మహావీరా! నీ ధైర్యం, నీ బలం, నీ గమన శక్తి తెలుసుకోగలిగాను. అగ్నిదేవుని లాంటి నీ తేజస్సును చూస్తున్నాను. నీవు సర్వసమర్థుడవని తెలుసుకున్నాను. ఇంతవాడవు. అందుకే సముద్రం దాటావు. ఇక్కడికి రాగలిగావు. నన్ను మోసుకుపోగలవు. ఆ శక్తి వుంది. సామర్థ్యం ఉంది. అయితే మహాత్ముడు రాముడి కార్యసిద్ధికై ఆలోచించు.

పుణ్యపురుషా! కపీశ్వరా! నేను నీతో రాను. నీది వాయువేగం. నేను భయపడొచ్చు. వీపు మీద నుండి జారిపడొచ్చు. సముద్రంలో తిమింగలాలు వుంటాయి. మొసళ్ళుంటాయి. పెద్ద చేపలుంటాయి. నన్ను తినొచ్చు. నీతో రావటానికి ధైర్యం చాలడం లేదు. వస్తే రాక్షస యోధులు వెంబడిస్తారు. వాళ్ళు ఆయుధ ధారులు. నీవు నిరాయుధుడవు. వాళ్ళు వందల్లో ఉంటారు. నీవు ఒంటరివి. నిన్ను నీవు రక్షించుకోవాలి. నన్ను రక్షించాలి. నీవు భయపడవు. యుద్ధం చేస్తావు. నేను భయపడతాను. జారి పడొచ్చు. లేదా నన్ను తీసుకెళ్తారు. చిత్రహింసలు పెడతారు. చంపొచ్చు. లేదా లంకలో రహస్యంగా దాచవచ్చు. యుద్ధంలో జయాపజయాలు అస్థిరాలు. అది నీకు తెల్సు. రాక్షసుల్ని చంపుతావు. నీవు సమర్థుడవే. నన్ను మోసుకెళ్తావు. రామునికి అప్పగిస్తావు. అపుడు రాముని కీర్తి మసకబారుతుంది. కనుక నీతో రాను. నీవు వెళ్ళు. రాముణ్ణి తీసుకురా. అదే మంచిది. రామలక్ష్మణులు సుగ్రీవుడు అతని పరివారం అందరూ నా క్షేమం కోసం ఉన్నారు. నాకేదైనా జరిగితే రామలక్ష్మణులు బతకరు. సుగ్రీవుడు బతకడు. సర్వ వానర భల్లూకాలు ప్రాణాలు విడుస్తారు.

హనుమంతుడా! నేను నా భర్తని తప్ప అన్యుల్ని తాకను. రావణుడు నన్ను పట్టుకున్నాడు. నేనపుడు అశక్తురాలిని. నేను నా స్వాధీనంలో లేనిదాన్ని. వివశురాలిని. అందుకే తాకాడు. ఏం చేసేది? నా మాట విను. రాముడు రావాలి. సబాంధవంగా రావణుణ్ణి సంహరించాలి. నన్ను తీసుకెళ్ళాలి. అది రామునికి గౌరవం – కీర్తిదాయకం. అతని శౌర్యానికి తగింది. రామ పరాక్రమం విన్నాను. చూశాను. దేవ దానవ యక్ష రాక్షస గరుడ గంధర్వాదులు రాముని పరాక్రమానికి సాటిరారు. తమ్మునితో కలిసి యుద్ధం చేస్తే – అన్నతమ్ముల వైపు ఒక్కడూ తేరిపార చూడలేడు. ఒక్కడూ బతకడు. అందుకే నా రాముణ్ణి లక్ష్మణుణ్ణి తీసుకురా. వానర భల్లూక సేనతో సుగ్రీవుణ్ణి తీసుకురా. నన్ను సంతోషపెట్టు''.

## కాకాసురుడు

విన్నాడు హనుమంతుడు. ''మంగళస్వరూపిణీ! నీ మాటలు సహేతుకాలు. యుక్తి యుక్తాలు. స్త్రీ స్వభావానికి తగినవే. పతివ్రతలకి తగినవే. నా వీపు మీద కూర్చోవడం, సముద్రం

దాటడం నీ భయ స్వభావానికి తగిందే. అది మొదటి కారణం. రాముణ్ణి తప్ప వేరొకరిని తాకను అన్నావు. రామపత్నిగా అది నీకు తగింది. ఇది రెండో కారణం. అమ్మా రావణుని మాటలు బెదిరింపులు విన్నాను. నీ సమాధానం విన్నాను. అవన్నీ రా మునికి చెబుతాను. రాముని మీద స్నేహం, భక్తి ఉన్నాయి నాకు. నీ దుఃఖం చూశాను. నా మనసు కరిగింది. మీ ఇద్దరినీ సంతోషపరచాలనుకున్నాను. నా వీపు మీద కూర్చో అన్నాను. అంతేకాని మరో కారణం కాదమ్మా. ఈ లంకలోకి ఎవడూ రాలేడు. సముద్రాన్ని లంఘించలేడు. నా శక్తి, సామర్థ్యాలను చూపాలనుకున్నాను. అందుకే అలా చెప్పాను.

దేవీ! నాతో రాను అన్నావు. ఇష్టం లేదన్నావు. నిన్ను చూసినట్లు రాముడు నమ్మాలి. అందుకు ఆనవాలుగా ఏదైనా ఇవ్వు'' అన్నాడు.

వినింది సీతమ్మ. కన్నీరు పెట్టింది. నెమ్మదిగా అంది ''నీకు మంచి గుర్తు చెబుతాను. అది రామునికి జ్ఞాపకం వస్తుంది అంటూ చెప్పసాగిందామె. అపుడు చిత్రకూటంలో ఉన్నాం. మందాకినీ తీరాన సిద్ధాశ్రమంలో ఉన్నాం. నదీతీరాన బాగా విహరించాం. జలకాలాడినాం. నా భర్త అలసిపోయాడు. నా తొడమీద తలపెట్టాడు. పడుకున్నాడు. నిదురపోయాడు. అపుడొక కాకి వచ్చింది. ముక్కులతో పొడిచింది నన్ను. మట్టిపెళ్ళ దొరికింది. దాంతో తరిమాను. పోయింది. కాని అక్కడే దాగింది. మళ్ళీ మళ్ళీ వచ్చింది ముక్కుతో పొడిచింది. తరమాలని చూచాను. ఏమీ దొరకలేదు. వడ్డాణం లాగాను. చీర జారింది. దాన్ని సర్దుకుంటున్నాను. అపుడు నీవు చూశావు. నవ్వావు. ఎగతాళి చేశావు. నాకు సిగ్గేసింది. కోపం వచ్చింది (చీర జారిందని సిగ్గు. కాకిని తోలనందుకు కోపం). నీ ఒడిలో తలపెట్టాను. నాకు నిద్ర వచ్చింది. ఎంతసేపయ్యిందో తెలియదు. నన్ను లేపావు. మళ్ళీ పడుకున్నావు నీవు.

మళ్ళీ వచ్చింది కాకి. నా స్తనానంతరంలో గోళ్ళతో గీరింది. ముక్కుతో పొడిచింది. పైకెగురుతోంది. వస్తోంది. మాంసం కోసం గీరుతోంది. అపుడు రక్తం వచ్చింది. నీ మీద పడింది. సుఖనిద్రలో ఉన్నావు. నా చేత మేల్కొల్పబడ్డావు. నా గాయాన్ని చూశావు. కోపించావు.

నిన్ను గాయపరిచిందెవరు? అయిదు తలల పాముతో ఆటలా? ఎవడు వాడు? అన్నావు. చుట్టూ చూశావు. కాకి కనబడింది. దాని కాళ్ళు ముక్కు నెత్తురు వుంది. నెత్తురు కారుతోంది. ఆ కాకి ఇంద్రుని కొడుకు (జయంతుడు). వాయువేగ గమనుడు. చూడగానే గ్రహించావు. దర్భాసనం మీదున్నావు. ఒక దర్భని తీశావు. బ్రహ్మాస్త్రంగా అభిమంత్రించావు. వాయసం మీద వేశావు. అది ఆకాశంలోకి ఎగిరింది. దాన్ని వెంబడించింది అస్త్రం. రక్షణ కోసం పరుగులు తీసింది. ఇంద్రుడు దేవతలు మహర్షులు రక్షించలేదు. ముల్లోకాలు తిరిగింది. మళ్ళీ వచ్చింది. నిన్ను శరణు వేడింది. ఆ కాకి వధార్హమే. కాని దయ తలచావు. రక్షించావు. 'నా బ్రహ్మాస్త్రం వృథా కాదు. ఏం చేయాలో చెప్పు' అన్నావు కాకితో. 'నా కుడికంటిని దహించు' అంది కాకి. దక్షిణ నేత్రాన్ని భస్మం చేశావు. ఒక కన్ను పోయింది. ప్రాణం నిలిచింది. కృతజ్ఞతగా నీకు, దశరథ మహారాజుకి ప్రణామాలర్పించింది.



వెళ్ళిపోయింది.

రామా! నా కోసం ఒక కాకి మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించావు. నన్ను అపహరించాడు రావణుడు. హతమార్చకుండా ఉన్నావు. ఎందుకు ఉపేక్షిస్తున్నావు? పురుషోత్తమా! నా మీద దయ ఉంచు. నీవు నాకు నాథుడవు. ఇక్కడ అనాథనయ్యాను. నాపై కనికరం చూపు. దీనజన రక్షణ పరమ ధర్మం అన్నావు. నీవు పరాక్రమశాలివి. బలశాలివి. గుణశాలివి. నిన్నెదిరించే వాడు ఈ జగత్తులో లేడు. ఈ సముద్ర వలయాంత భూమండలానికి ప్రభువువు నీవు. దేవేంద్ర సముడవు. సమస్త శస్త్రాస్త్ర కోవిదుడవు. సత్యసంధుడవు. ఈ రాక్షసుల మీద అస్త్రాలు ఎందుకు ప్రయోగించవు? మహాబలశాలీ పరంతపుడు లక్ష్మణుడు. అన్న ఆనతి తీసుకొని నన్నెందుకు కాపాడలేకున్నాడు?

**మయ్యైవ దుష్కృతం కించిత్ మహదస్తి న సంశయః ।**

సమర్థావపి తౌ యన్మాం నా వేక్షేతే పరంతపా ॥

నేను పాపం చేశాను. అది చిన్నదై ఉండాలి. పెద్దదై ఉండాలి. సందేహం లేదు. అన్నదమ్ములు శత్రుసంహార సమర్థులు. ఆ ఉభయులు నావైపు కన్నెత్తి చూడటం లేదు. నా పాపఫలం వల్ల కాబోలు''.

రామునికి నా మీద దయ లేదు. రాలేదనుకుంది సీతమ్మ. కానీ ఇపుడు మరోవిధంగా తలచింది. తను పాపం చేసింది. అందుకే రాముడు రాలేదు. రక్షించలేదు. ఆ పాపం కూడా చిన్నదో పెద్దదో అయి వుండాలనుకుంది. అరణ్యానికి నేనూ వస్తానంది మైథిలి. వద్దన్నాడు రాముడు. అయితే పురుషవేషం లోని స్త్రీవు కదా – అని మా తండ్రి అంటారేమో అంది. అది భగవదపచారం. అది చిన్న పాపం. మాయలేడి విషయంగాలక్ష్మణుని అనరాని మాటలంది. అది పెద్ద పాపం. అది భాగవత అపచారం. భగవదపచారానికి ఆరు నెల్లు. భాగవత అపచారానికి ఆరు నెల్లు. వెరసి సంవత్సరం కాలం పాపఫలం అనుభవిస్తున్నాను అనుకుందామె.

మనకు ఒక్కోసారి కష్టాల మీద కష్టాలు వస్తాయి. అపుడు దయలేదా స్వామీ అని దేవుణ్ణి తిడతాం. ఎంతైనా తూలనాడుతాం. కష్టాలకు కారణం మనం చేసుకున్న పాపమే అని గ్రహించాలి. పాపఫలం అనుభవించాక భగవత్ కృప కల్గవచ్చు – అని శ్రీరామాయణం మనకు నేర్పుతోంది.

సీతాదేవి చెప్పింది విన్నాడు హనుమంతుడు. ఆమె మాటలు జాలి గొల్పాయి. సమాధానమిస్తున్నాడు వాయు సుతుడు. ''అమ్మా! రాముడు నిన్నే తలచుకుంటున్నాడు. దుఃఖిస్తున్నాడు. అన్నిటా విముఖుడైనాడు. ఒట్టు పెట్టుకుని చెబుతున్నాను. రాముని దుఃఖం చూశాడు లక్ష్మణుడు. అతడూ పరితపిస్తాడు. ఏదోవిధంగా నేను నిన్ను చూశాను. ఇక మీకు దుఃఖాలుండవు. త్వరలో తొలగిపోతాయి. రామలక్ష్మణులు నిన్ను చూడాలని వస్తారు. లంకను భస్మం చేస్తారు. రావణుడు క్రూరుడు. సపరివారంగా వాణ్ణి హతమార్చుతారు. నిన్ను అయోధ్యకు తీసుకెళ్తారు. నేను వాళ్ళ దగ్గరకి వెళ్తాను. అన్నదమ్ములకి ఏం చెప్పాలి? వానరవీరులకి ఏం చెప్పాలి? సుగ్రీవునికి ఏం చెప్పాలి?'' అని అడిగాడు.

వినింది జనకాత్మజ. అంటోంది. ''కౌసల్యాదేవి కడుపు పంట రాముడు. సర్వలోక పూజ్యుడు. నా స్వామిని కుశలమడిగానని చెప్పు. సుమిత్రాదేవి సుపుత్రుడు లక్ష్మణుడు. సకల భోగాలు త్యజించాడు. రత్నాభరణాలు త్యజించాడు. ఐశ్వర్యాలు త్యజించాడు. దాస దాసీ జనాన్ని త్యజించాడు. మాతో వనవాసానికి వచ్చాడు. రామునికి సేవ చేస్తున్నాడు. ఆ సింహబలుడు, దీర్ఘబాహువు మనస్వి ప్రియదర్శనుడు నన్ను తల్లిగా చూశాడు. రాముణ్ణి తండ్రిగా చూశాడు. అతని క్షేమం అడిగానని చెప్పు. రాముడు రావాలి. నా దుఃఖం పోగొట్టాలి. నా చెర విడిపించాలి. ఆ మాట పదే పదే చెప్పు. నేను ఒక నెల మాత్రమే జీవించి ఉంటాను. నెల దాటితే బతికేది లేదు. ఇది నా శపథం. దేవేంద్రుడు ఐశ్వర్యాన్ని పోగొట్టుకున్నాడు. విష్ణుమూర్తి పాతాళ లోకానికి వెళ్ళాడు. లక్ష్మిని తెచ్చాడు. ఇంద్రునికి ఇచ్చాడు. అలా ఈ పాపకర్ముడు రావణుని నుంచి నన్ను తీసుకెళ్ళాలని చెప్పు'' అని ఆగిందామె.

చీరకొంగు పట్టుకుంది. ముడివేసి ఉంది. విప్పింది. అందులో చూడామణి ఉంది. తీసింది. హనుమంతునికి ఇచ్చింది. అందుకున్నాడు మారుతి. అది చేతికి సరిపోలేదు. వేలికి పెట్టుకున్నాడు. ఆమెకు ప్రదక్షిణం చేశాడు. నమస్కరించాడు. వినయంతో నిలుచున్నాడు.

దశరథపుత్రుడు రామునిగా పుడతాను. రావణుని సంహరిస్తాను అది నారాయణుడు దేవతలకు ఇచ్చిన మాట. అలాగే రామునిగా పుట్టాడు. బాల్యమైంది. విద్యాభ్యాసమైంది. చిన్నవాడులే అనుకున్నారు దేవేంద్రాదులు. వివాహమైంది. ఇచ్చినమాట మరచాడా అనుకున్నారు. అంతలో వనవాసమంది కైకేయి. రామునికి కోపం రాలేదు. వనవాసమే మంచిదన్నాడు. నవ్వుతూ వెళ్ళిపోయాడు. ఏం చేస్తే రామునికి కోపం వస్తుంది – ఆలోచించారు. రామునికి బదులు సీతాదేవిని బాధిస్తే – కోపం రావచ్చు. సీతాదేవిని బాధ పెట్టండి – అది ఇంద్రుని ఆనతి. దేవతలెవరూ కదల్లేదు. రాముడంటే భయం. సీతమ్మ అంటే గౌరవం. దేవతల రాజు ఇంద్రుడు. అతనికి తప్పలేదు. కొడుకుని పిలిచాడు. విషయం చెప్పాడు. జయంతుడు కాకి రూపం ధరించాడు. వెళ్ళాడు. మైథిలిని హింసించాడు. రామునికి కోపం వచ్చింది. దేవతల ఆలోచన గ్రహించాడు రాముడు. తదనుగుణంగా సంకల్పించాడు. సీతాపహరణం జరిగింది. దుష్టశిక్షణ జరిగింది.

వృత్రాసురుని సంహరించాడు దేవేంద్రుడు. బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంది. అతని ఐశ్వర్యం పాతాళానికి పోయింది విష్ణుమూర్తి పాతాళ లోకానికి వెళ్ళాడు. ఇంద్రుణ్ణి ఐశ్వర్యవంతుణ్ణి చేశాడు.

చూడామణి సముద్రంలో పుట్టింది. సముద్రుడు వరుణునికి ఇచ్చాడు. వరుణుడు జనకునికి ఇచ్చాడు. జనకుడు తన భార్యకి ఇచ్చాడు. సీతారాముల కళ్యాణ సమయం – జనక దశరథుల సమక్షంలో – ఆమె సీతమ్మకి ఇచ్చింది చూడామణి.

రెండు నెలల గడువు వుందని చెప్పింది సీతమ్మ. మళ్ళీ ఒక నెల మాత్రమే వుంటానంది హనుమంతునితో. ఎందుకలా అంది అనేది ప్రశ్న. దుఃఖ సముద్రంలో మునిగి మునిగి నిరాశ చెందింది. నిస్పృహ చెందింది. అంతలో ఆశలు మోసులు వేశాయి. త్వరగా రాముడు రావాలని అలా అందేమో!

**(సశేషం)**

# కూటసాక్ష్యం

- గోనుగుంట మురళీకృష్ణ

**(జూన్ 30 - "స్కంధ పంచమి" సందర్భంగా)**

ఒకసారి దేవేంద్రుడు శివపార్వతులను దర్శించుకోవటానికి కైలాస పర్వతం దగ్గరకు వెళ్ళాడు. ఆ పర్వతం చంద్రుడిలా తెల్లగా ప్రకాశిస్తోంది. అక్కడ దేవదారు, పున్నాగ, పొగడ, వకుళ, చంపక మొదలైన ఎన్నో వృక్షాలు ఉన్నాయి. మందార, కరివీర, పారిజాతమొదలైన పూల మొక్కలు నిండుగా పూసిన పూలతో చల్లగాలికి కదులుతూ ఉన్నాయి. పూల నుంచీ వచ్చే సువాసనలు పీల్చాలని, మకరందాన్ని గ్రోలాలని తుమ్మెదలు వాటి చుట్టూ పరిభ్రమిస్తూ ఉన్నాయి. ఆకాశం నుంచీ జాలువారుతున్న గంగ ఆ పర్వత సానువుల నుండీ ప్రవహిస్తూ ఉంది. పర్వతం దిగువున గల సరస్సులలో కలహంసలు సంచరిస్తున్నాయి. నెమళ్ళు కేకారవాలు చేస్తూ నర్తిస్తున్నాయి. దేవేంద్రుడు ఆ సుందర దృశ్యాలు చూసి ఆనందిస్తూ కైలాస పర్వత ద్వారం దగ్గరకు వచ్చాడు.

అక్కడ చేతిలో శూలం ధరించి దివ్య తేజస్సుతో విరాజిల్లుతున్న ఒక యువకుడు కూర్చున్నాడు. అతడి తేజస్సు చూసి ఆశ్చర్యంతో "ఎవరు నువ్వు?" అని అడిగాడు దేవేంద్రుడు.

"నేను ఉమామహేశ్వరుల పుత్రుడను. నా పేరు స్కంధుడు. కార్తికేయుడు, కుమారస్వామి అనే నామాంతరాలు కూడా ఉన్నాయి" అన్నాడు.

ఆ మాటలు విన్న దేవేంద్రుడు "ఏమీ! నాకు తెలియకుండా శివపార్వతులకు కుమారుడు ఎప్పుడు జన్మించాడు? బాగున్నది నీ ఆత్మస్తుతి. నీవెవరివైతే నాకేంలే! నేనెవరో తెలుసా!" అడిగాడు.

అతడి ధోరణి స్కంధుడికి కోపం తెప్పించింది. అయినా నిగ్రహించుకుంటూ "చెప్పు" అన్నాడు శాంతంగా.

"దేవతలకు ప్రభువును. అమరేంద్రుడను. నేను ఇక్కడకు వస్తే గౌరవంగా లేచి పూజించాలని తెలియదా!" అన్నాడు.

"నీ పదవి అశాశ్వతమైనది. నూరు క్రతువులు నిర్వహించిన వారు ఎవరైనా అమర సింహాసనానికి అర్హులు. వేదవేత్తలు, సిద్ధులు, సాధ్యులు అందరూ నన్ను తెలుసుకుని పూజిస్తారు. నిన్ను పూజించవలసిన అవసరం నాకేముంది?"

"నీమాటలు ఆశ్చర్యంగా ఉన్నాయే! హరిహర బ్రహ్మలు తప్ప నన్ను మించినవారు ఎవరూ లేరు. నువ్వు నాకంటే అధికుడనని అనుకుంటున్నావా? అయితే విను. మైనాక పుత్రుడైన ఈ క్రౌంచగిరి చుట్టూ ప్రదక్షణం చేసి ఎవరు శీఘ్రంగా రాగలడో అతడే మనిద్దరిలో అధికుడు" అన్నాడు దేవేంద్రుడు.

"సరే! నీ ఇష్టం" అని అంగీకరించాడు స్కంధుడు . వెంటనే నెమలి వాహనం మీద బయలుదేరాడు. ఒక్కక్షణం లో క్రౌంచ



పర్వతం చుట్టూ ప్రదక్షిణం చేసి వచ్చాడు. మరుక్షణంలో ఇంద్రుడు కూడా వచ్చేశాడు. "నేను విజేతను" అన్నాడు స్కంధుడు. "కాదు, నేనే విజేతను" అన్నాడు ఇంద్రుడు. ఇద్దరూ నేనంటే నేనని వాదించుకున్నారు.

"అయితే ఈ క్రౌంచ పర్వతమే సాక్షి. ఇతడు హిమవంతుని మనుమడు. మహాబలుడు. అబద్ధం చెప్పడు. మనిద్దరిలో ఎవరు

ముం దుగ వచ్చారో అతడినే అడుగుదాం" అన్నాడు ఇంద్రుడు. అలాగే అడుగమన్నాడు కుమారస్వామి.

ఇంద్రుడు క్రౌంచగిరికి ఎదురుగా నిలబడి "నీ చుట్టూ ప్రదక్షిణం చేసి మా ఇద్దరిలో ఎవరు ముందుగా వచ్చారో చెప్పు" అన్నాడు. క్రౌంచ పర్వతం కొంచెం ఆలోచించి "ఈ శచీపతియే నన్ను ప్రదక్షిణించి ముందుగా వచ్చాడు" అన్నాడు. వాస్తవానికి కుమారస్వామే ముందుగా వచ్చాడు, ఆయన వచ్చిన ఒక్క క్షణం తర్వాత దేవేంద్రుడు వచ్చాడు. కానీ క్రౌంచగిరి ఎందుకో విమూఢాత్ముడై ఆ విధంగా పలికాడు.

ఆ విధంగా అబద్ధపు సాక్ష్యం చెప్పగానే స్కంధుడికి పట్టరాని ఆగ్రహం కలిగింది. శక్తి ఆయుధం ప్రయోగించాడు. ప్రళయకాలాగ్నిలా వెలుగులు విరజిమ్ముతూ,సూర్యచంద్రుల తేజస్సులు రెండూ ఏకమైనట్లు ఆ శక్త్యాయుధం క్రౌంచగిరి శిఖరాన్ని తాకింది. ఆ వెనువెంటనే దాని శిఖరం ఖండించినట్లు తెగి కింద పడింది. శిఖరం మీద ఉన్న వృక్షాలు అన్నీ కూలిపోయాయి. చెట్ల మీద నివసిస్తున్న పక్షులు గోలగోలగా అరుస్తూ ఆకాశానికి ఎగిరాయి. కొండ రాళ్ల మధ్య ఉన్న సర్పాలు బుసలు కొడుతూ బయటకు వచ్చి రాళ్ళను కాటు వేశాయి. గుహలలో ఉన్న సింహ శార్దూలాది జంతువులు భయంతో నలు దిక్కులకూ పరిగెత్తాయి.

దానితో ఆ క్రౌంచాద్రి సర్వాంగాలు ఛిన్నాభిన్నం కాగా రక్తనదీ ధారలు క్రక్కుకుంటూ పడిపోయాడు. ప్రాణవర్జితుడైన గిరిపతిని చూసి అతడి భార్యలు శోకిస్తూ క్రౌంచాద్రి మీద పడ్డారు. మేరువు, హిమాలయం, వింధ్యం, గంధమాదనం, పారియాత్రం, సహ్యం, నిషధం మొదలైన బంధువులు, క్రౌంచ జనకుడైన మైనాకుడు అందరూ దాని చుట్టూ కుర్చుని దుఃఖించారు.

క్రౌంచాచలం మృతుడైన వార్త పార్వతీదేవికి తెలిసింది. శివుడితో సహా అక్కడికి వచ్చింది. హిమవంతుడు కూడా అక్కడికి వచ్చాడు. "ఇంద్రుడు, స్కంధుడు గిరిప్రదక్షిణంలో పందెం వేసుకున్నారు. నా మనవడు అయిన క్రౌంచగిరిని స్కంధుడు సంహరించాడు. నేను అల్లారు ముద్దుగా చూసుకుంటున్న నా పౌత్రుడు లేనప్పుడు నేను మాత్రం జీవించి ఏం ప్రయోజనం? నేను కూడా అతడి దారిలోనే వెళతాను" అంటూ రోదించాడు హిమవంతుడు.

తన తండ్రి అలా దుఃఖ పడుతుంటే పార్వతీదేవి భరించలేక పోయింది. తన అన్న, తండ్రి, బంధు కోటి అంతా దుఃఖిస్తుంటే ఆమె కన్నీటి పర్యంతమైంది.

"కుమారా! హిమవంతుడు నాకు తండ్రి, మైనాకుడు నాకు సోదరుడు. క్రౌంచాచలం నా మేనల్లుడు. నా పుట్టినింటి వారందరూ శోకించటం నేను చూడలేక పోతున్నాను. అతడి తప్పు మన్నించి పునర్జీవితుడిని చెయ్యి" అన్నది పార్వతి కుమారస్వామి తో.

"అవును నాయనా! వీరంతా మహామహులు. అందరూ బంధువులు. బంధువుల అపరాధం నిగ్రహించుకోవాలి. బంధుప్రీతి కలిగి ఉండాలి. ఆగ్రహించటం మంచిపని కాదు. అతడిని తిరిగి బ్రతికించు" అన్నాడు పరమేశ్వరుడు.

"జననీ జనకుల మాట పాటించటం కన్నా మహనీయమైన కార్యం ఏమున్నది? అలాగే! మీ ఆజ్ఞ శిరసావహిస్తాను" అని స్కంధుడు తల్లిదండ్రులకు తలవంచి నమస్కరించి, క్రౌంచాచలం వైపు తిరిగి "ఉత్తిష్ఠ...ఉత్తిష్ఠ (లెమ్ము..లెమ్ము)" అన్నాడు. వెనువెంటనే నిద్రలో నుంచీ లేచినట్లు ఆరోగ్యవంతుడై లేచి నిలబడ్డాడు క్రౌంచగిరి రాజు. అందరూ ఆశ్చర్యానందాలతో చూశారు. పార్వతీదేవి ఆనంద పడింది. పరమేశ్వరుడు కూడా సంతుష్టుడు అయ్యాడు.

"షణ్ముఖా! నన్ను ఏదో మాయ ఆవహించినట్లు విమూఢుడనై అసత్యం పలికాను. నన్ను మన్నించు" అన్నాడు.

"ఉమామహేశ్వరుల కుమారుడవైన నీ ప్రభావం నేను తెలిసుకోలేక పంతం పోయాను. నన్ను కూడా క్షమించు" చేతులు మోడ్చి ప్రార్థించాడు ఇంద్రుడు.

అప్పుడు స్కంధుడు ఇలా చెప్పాడు "పాపాలలో అన్నిటికీ మహాపాపం కూట సాక్ష్యం. సర్పం తోకతొక్కిన వాడిని కాటు వేస్తుంది. సింహం తన దగ్గరకు వచ్చిన వాడినే చంపుతుంది. కానీ కూటసాక్షి నిరపరాధులైన సాధువులని హింసిస్తాడు.పీడించే వాడి దుఃఖమూ, పీడితుని దుఃఖమూ రెండూ కలిసిన మహాపాతకం కూటసాక్షికి తగులుతుంది. పక్షపాత బుద్ధితో అబద్ధపు సాక్ష్యం చెప్పిన వాడు ఎన్ని సద్గుణాలు ఉన్నా ఆపదల పాలవుతాడు. ఆ దోషం పోవటానికి సూర్య మండలం దర్శించాలి" అని చెప్పాడు.

సర్వపర్వతాలు స్కంధుడికి శిరసు వంచి నమస్కరించాయి. తర్వాత ఎవరి స్వస్థలాలకు వారు వెళ్ళిపోయారు.

ఈ కథ స్కాందపురాణం లోనిది. కైలాస పర్వతం మీద శంకరుడు బ్రహ్మాది దేవతలతో కొలువై స్కాంద పురాణం వినిపించాడు. పార్వతీదేవి అది విని కుమారస్వామికి చెప్పింది. కుమార స్వామి వందిగణాలకు చెప్పాడు. కుమార స్వామి చేత చెప్పబడింది కాబట్టి స్కాంద పురాణం గా ప్రసిద్ధి చెందింది. ఇది 81 వేల శ్లోకాలతో వ్యాస మహర్షి చేత రచింపబడింది.ఇందులో స్కంధుడి మాహాత్మ్యములు, శివ చరిత్ర వర్ణనలు, కాశీఖండము, కేదార ఖండము, వైష్ణవ ఖండము, బ్రహ్మ ఖండము, రేవా ఖండము మొదలైన భాగాలు ఉన్నాయి.

**"క్రౌంచా సురేంద్ర మదఖండన శక్తి శూల!**
**పాశాది శస్త్ర పరిమండిత దివ్య పాణే!**
**శ్రీకుండలీశ ధృత తుండ శిఖీంద్ర వాహా!**
**వల్లీసనాథ మమ దేహి కరావలంబమ్!"**

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



## 31వ శ్లోకం

**ఇదం శరీరం పరిణామపేశలం**
**పతత్యవశ్యం శ్లథసంధిజర్జరమ్ ।**
**కిమౌషధైః క్లిశ్యసి మూఢ దుర్మతే**
**నిరామయం కృష్ణరసాయనం పిబ ॥**

ఎంతటి ఆరోగ్యం కలదైనను ఈ శరీరం ఎప్పటికప్పుడు ఒకేలా ఉండక మార్పులు చెందుతూ రోగగ్రస్తమై పడిపోవలసినదే. ఎప్పటికైనా పడిపోయే శరీరానికి దాని యందు ఆప్యాయత పెంచుకుని అనేక విధములైన చికిత్సల తోటి బాగుచేసుకునే ప్రయత్నం చేస్తున్నావు. అసలైన నిత్యమైన ఆరోగ్యాన్నిచ్చే కృష్ణరసాయనం అనే దివ్య ఔషధాన్ని పానము చెయ్యి.

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్తనిధనా న్యేవ తత్ర కా పరిదేవనా ॥ (గీత – 2.28)**

అని గీతలో చెప్పినట్లు శరీరమునందు గల పంచభూతములు వెళ్లిపోవును. అందుచేత ఏ కార్యము జరగదు. కనుక మూఢా! అంటే తెలుసుకోదగిన దానిని తెలుసుకోకుండా ఉండుట బుద్ధిలేనివాడు చేసేపని. కృష్ణ రసాయనము అనే ఔషధమును పుచ్చుకుంటే సకలరోగ నివారిణి. శ్రీకృష్ణ రసాయనం అనే మందు అనేక దివ్యమైన మూలికలతో చేరి ఉండుట వలన నల్లగా ఉండును. ఆ రసాయనాన్ని పానము చేయడం ద్వారా మనలో ఉండే మాలిన్యములను తొలగించి శుద్ధి ఏర్పరుస్తాడు.

**కోవా భగవత తస్య పుణ్యశ్లోకేద్య కర్మణః ।**
**శుద్ధి కామోన శృణ్యాత్ యష కలిమలాపమమ్ ॥**

నిజంగా బాగుపడాలని కోరుకుంటే కేవలం భగవన్నామ స్మరణ వల్లనే జరుగుతుంది. "యషకలి మలాపమమ్" కలి వల్ల ఏర్పడే దోషాలు చాలా ఉన్నాయి మన లోపల. ఎవడైతే వాటికి దూరంగా ఉండాలని కోరుకుంటున్నాడో, "కోవా భగవత తస్య పుణ్యశ్లోకేద్య కర్మణః" మనకి అన్ని రకాల పుణ్యములని కలిగించే ఆ దివ్యమైన చేష్టితములని మహానుభావులు స్తుతించి తరించారు. మన కులశేఖరాళ్వార్లు అదే మార్గాన్ని చూపిస్తున్నారు తరించడానికి అందరు అర్హులే తమని తాము శుద్ధి (బాహ్య శుద్ధి కేవలం శరీరానికి సంబంధం, అంతర్ శుద్ధి ఆత్మకు "యస్మరేత్ పుండరీకాక్షం సభాహ్యే అభ్యంతర శుచిః") పరచుకుని పరమాత్మ వైపు పయనించడమే. అలా పరమాత్మ వైపు పయనించి మార్గం చూపిన వారిలో ఒకరు శ్రీ శ్రీ వాదిరాజ తీర్థులు.

శ్రీ వాదిరాజ తీర్థులు 120 సంవత్సరాలు (క్రీ.శ. 1480–1600) జీవించారు, అందులో 112 సంవత్సరాలు సన్యాసిగా జీవించారు మరియు 1600లో తన బృందావనంలోకి సజీవంగా ప్రవేశించారు. ఆయన భారతదేశం చుట్టూ రెండుసార్లు తిరిగారు మరియు తన అనుభవాన్ని ఒక ప్రయాణ గాథలో పొందుపరిచారు.

శార్వరి నామ సంవత్సరం (క్రీ.శ. 1480) శ్రీ వాగీశ తీర్థుడు ఉడిపికి 25 మైళ్ల ఉత్తరాన ఉన్న హువ్వినకెరె అనే గ్రామాన్ని సందర్శించాడు. పిల్లలు లేని దంపతులు రామభట్ట మరియు గౌరీదేవిలను కలిశారు. వారు పిల్లలు పుట్టేలా ఆశీర్వదించమని ఆయనను వేడుకున్నారు. ఆయన ఒక షరతు విధించాడు, మొదటి మగ బిడ్డను పెంపకం కోసం మఠానికి అప్పగించాలి. ఆ జంట ఈ ప్రతిపాదనను అంగీకరించడానికి సంకోచించినప్పుడు, ఆయన వారికి సులభమైన షరతు విధించడం ద్వారా దానిని సులభతరం

చేశాడు – బిడ్డ ఇంట్లోనే పుడితే, వారు ఉంచుకోవచ్చు, కానీ ఇంటి బయట ప్రసవం జరిగితే వారు ఆ బిడ్డని అప్పగించాలి అని. వారు దానికి హృదయపూర్వకంగా అంగీకరించారు.

కాలక్రమేణా, దేవుని దయవల్ల, గౌరీదేవి గర్భవతి అయింది మరియు ఆ జంట చాలా ఆనందంగా ఉన్నారు. వారు తమ ఒప్పందాన్ని గుర్తుచేసుకున్నారు, చాలా జాగ్రత్తగా ఉన్నారు. గౌరికి ఇంటి నుండి బయటకు వెళ్ళడానికి అనుమతి లేదు. వారి ఇల్లు ఒక చిన్న వరి పొలం చుట్టూ ఉన్న చిన్న గుడిసె తప్ప మరేమీ కాదు కాబట్టి, రామభట్ట ఇంట్లో ఏ అవసరం ఉన్నా అందుబాటులో ఉంటూనే పొలంలో తన పనిని సులభంగా చేసుకోగలిగాడు. తొమ్మిది నెలలు గడిచాయి మరియు ప్రసవం దగ్గర పడింది. 'సాధన ద్వాదశి' రోజున, రామభట్ట భోజనం చేస్తుండగా, గౌరి ఇంటి వెనుక పెరట్లో తులసి పూజ చేస్తుండగా, అకస్మాత్తుగా కొన్ని ఆవులు పొలంలోకి ప్రవేశించి పంటలను నాశనం చేయడం ఆమె చూసింది. వెంటనే ఒక కర్రను తీసుకొని ఆవులను తరిమికొట్టే ఉద్దేశ్యంతో పొలంలోకి ప్రవేశించి, ఒప్పందాన్ని పూర్తిగా మరచిపోయింది. ఆమె ఉత్సాహంలో ఇంటి నుండి చాలా దూరం వెళ్లిపోయింది మరియు అకస్మాత్తుగా ప్రసవ నొప్పి వచ్చింది. ఆమె ఇంటికి తిరిగి రాలేకపోయింది మరియు పొలంలో బిడ్డను ప్రసవించాల్సి వచ్చింది. ఆ విధంగా మానవ ప్రయత్నాలన్నీ విరుద్ధంగా ఉన్నప్పటికీ దైవిక సంకల్పం గెలిచింది.

శ్రీవాగీశ తీర్థకు బిడ్డ జననం గురించి సమాచారం అందింది. ఆయన ఒక బంగారు పళ్ళెం పంపించి, ఆ పళ్ళెంలో ఉన్న బిడ్డను మఠం వద్దకు తీసుకురావాలని తల్లిదండ్రులను కోరాడు. ఆ శిశువు మఠం చేరేవరకు నేలను తాకలేదని చెబుతారు. శ్రీవాగీశతీర్థుడు సంతోషంగా ఉన్న తల్లిదండ్రులకు ఆ శిశువులోని అనేక శుభ లక్షణాలను చూపించి, ఆ శిశువు ఒక రోజు గొప్ప సన్యాసిగా మారుతుందని ప్రవచించాడు. ఆయన దేవతకు సమర్పించిన పాలు శిశువుకు పోసి, ఆ శిశువుకు భూవర (కొందరు వరాహాచార్య అని అంటారు) అని పేరు పెట్టమని తల్లిదండ్రులను కోరాడు. ఆయన వారిని శిశువుతో ఇంటికి పంపించి, కొన్ని సంవత్సరాల తర్వాత శిశువుని తిరిగి తీసుకురావాలని కోరారు.

గౌరీ, శ్రీవాదిరాజుకు జన్మనిచ్చిన వరి పొలాన్ని "గౌరీ గద్దె" అని పిలుస్తారు. ఇప్పుడు ఆ ప్రదేశంలో ఒక చిన్న ఆలయం ఉంది.

శ్రీవాగీశ తీర్థుల వద్ద ఆయన మరణించే వరకు వాదిరాజు చదువుకున్నాడు. ఆ తరువాత ఆయన తన పరివారంతో కలిసి శ్రీ వ్యాస తీర్థుల వద్ద అధ్యయనం చేయడానికి హంపికి వెళ్లాడు.

కృష్ణదేవరాయరాజు వాదిరాజ వ్యక్తిత్వానికి ముగ్ధుడై అతనికి 'ప్రసంగభరణ తీర్థ' (వక్త యొక్క రత్నం) అనే బిరుదును ఇచ్చాడు. వాదిరాజు కొన్ని సంవత్సరాల తర్వాత ఉడిపికి తిరిగి వచ్చాడు. శ్రీవ్యాసతీర్థుడు ఉడిపి పర్యటన సందర్భంగా తనకు బహుమతిగా ఇచ్చిన వ్యాస ముష్టిని వాదిరాజుకి ఇచ్చాడు.

కర్ణాటక తీరప్రాంతాల్లో వేలాది మంది స్వర్ణకారులు నివసిస్తున్నారు. ఒకసారి, ఒక స్వర్ణకారుడు 5 లోహాల మిశ్రమలోహాన్ని కరిగించి, గణపతి చిహ్నాన్ని తయారు చేయాలనే ఉద్దేశ్యంతో అచ్చులో వేశాడు. అతను అచ్చును తెరిచినప్పుడు గుర్రపు తల మరియు నాలుగు చేతులు కలిగిన హయగ్రీవ చిహ్నాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. అతను దానిని నాశనం చేసి, మరుసటి రోజు ఆ లోహాన్ని తిరిగి ఉపయోగించాలని నిర్ణయించుకున్నాడు. ఆ రాత్రి అతనికి కలలో ఆ మూర్తిని వాదిరాజుకు అప్పగించమని సూచించబడింది. వాదిరాజు కూడా ఒక కలలో ఒక ప్రత్యేక హయగ్రీవ మూర్తిని పొందుతానని చెప్పాడు. మరుసటి రోజు స్వర్ణకారుల బృందం వాదిరాజుని కలిసి ఆ చిహ్నాన్ని అతనికి అందజేసింది. వారు సామాజిక బహిష్కరణకు గురైనందుకు తమ బాధను కూడా పంచుకున్నారు. వాదిరాజు వారిపై జాలిపడి వారిని ఉద్ధరించాలని నిర్ణయించుకున్నారు. దీని ప్రకారం, ఒక సముచిత సందర్భంలో, మొత్తం స్వర్ణకారుల సమాజానికి చక్రాంకనం అందించ బడింది మరియు భాగవత (ద్వైత) ధర్మంలోకి తీసుకురాబడింది. అప్పటి నుండి, ఆ సమాజం (దైవజ్ఞ బ్రాహ్మణులు) వాదిరాజును తమ గురువుగా మరియు సోదేమాతను తమ మాతగా భావించారు.

వాదిరాజు దేశ పర్యటనను ప్రారంభించారు. తాను సందర్శించిన తీర్థయాత్ర కేంద్రాలను మరియు వాటి గొప్పతనాన్ని 'తీర్థ ప్రబంధ' అనే యాత్రా కథనంలో నమోదు చేశారు. వాదిరాజు తిరుమలను సందర్శించినప్పుడు, ఆ కొండ మొత్తం ఆయనకు సాలిగ్రామంలా కనిపించిందని చెబుతారు. ఆ తరువాత ఆయన తన పాదాలను ఆ పవిత్ర కొండపై ఉంచాలని కోరుకోకుండా మోకాళ్లపై దానిపైకి ఎక్కాడు. ఆయన సాలిగ్రామాల దండను శ్రీనివాసుడికి నైవేద్యంగా సమర్పించాడు.

వాదిరాజు దేశం మొత్తం కనీసం 2 సార్లు పర్యటించాడు. ఆయన అయోధ్య నుండి శ్రీ ముఖ్యప్రాణ విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని ఉడిపిలో స్థాపించాడు. ఆయన జన్మస్థలమైన పాజకలో ఆచార్య మధ్వ విగ్రహాన్ని కూడా స్థాపించాడు.

పర్యటనలో ఉన్నప్పుడు, వాదిరాజు పూణేలో చాతుర్మాస్యను పాటించాలని నిర్ణయించు కున్నాడు. ఇప్పటివరకు వ్రాయబడిన గొప్ప మహా-కావ్యాన్ని (కావ్య ఇతిహాసం) నిర్ణయించ డానికి విద్వత్ సభ జరుగుతోందని మరియు మాఘ రాసిన "శిశుపాల-వధ" ను విజేతగా ఎంచుకోవడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారని అతను తెలుసుకున్నాడు. ఆయన నిర్వాహకులకు అదే నేపథ్యంతో తన రచన ఒకటి ఉందని, అది శాస్త్ర ప్రకారం ఆ అంశాన్ని కలిగి ఉందని, దానిని తమ మూల్యాంకనంలో చేర్చమని కోరారు. "శిశుపాల-వధ"

(శిశుపాలుని చంపడం) అనే పేరును అశుభంగా పెట్టారని, కృష్ణుడి గొప్పతనాన్ని అది ఎత్తి చూపలేదని కూడా ఆయన ఎత్తి చూపారు. ఉడిపి నుండి వ్రాతప్రతిని తీసుకురావడానికి తనకు దాదాపు 3 వారాల సమయం ఇవ్వాలని ఆయన కోరారు. అలాంటి వ్రాతప్రతి లేదని, వాదిరాజు ఆ రచనను మొదటి నుండి తయారు చేయడానికి మాత్రమే సమయాన్ని తీసుకొంటున్నారని తెలియక నిర్వాహకులు అంగీకరించారు. తరువాత అతను తనకు లభించే ప్రతి ఖాళీ క్షణాన్ని ఉపయోగించుకుని, తరువాతి 19 రోజుల్లో 'రుక్మిణీశవిజయ'ను రాశాడు. ఈ రచనను సమావేశంలో ప్రదర్శించి నప్పుడు పండితులు దాని కవితా వైభవానికి ముగ్ధులై, సంస్కృత సాహిత్యంలో దీనిని గొప్ప మహాకావ్యంగా ప్రకటించడానికి ఎటువంటి సంకోచం లేదు. వారి నిర్ణయం ప్రకారం, ఆ వ్రాతప్రతిని బాగా అలంకరించబడిన ఏనుగుపై నగరం చుట్టూ ఊరేగింపుగా, ఎంతో ఆర్భాటంగా మరియు వైభవంగా తీసుకెళ్లారు.

**హయగ్రీవ భగవానుడు భక్తుడిని ఆశీర్వదిస్తాడు - దశావతార స్తుతి పుట్టింది:**

పూణే నుండి వాదిరాజు తన పర్యటనను కొనసాగించి పండరీపురానికి చేరుకున్నాడు. అతను ఒక ఆలయంలో బస చేసి విఠల స్వామిని సేవిస్తూ కొన్ని వారాలు గడిపాడు. ఒకరోజు, కోపంగా ఉన్న ఒక వ్యక్తి అతనిని ఎదిరించి, "నువ్వు నీ గుర్రాన్ని ఆపడం లేదు. ప్రతిరోజూ ఒక తెల్ల గుర్రం నా మొక్కజొన్న పొలానికి వచ్చి నా పంటను మేపుతూ ఉండటం నేను చూస్తున్నాను. నేను దానిని చాలాసార్లు వెంబడించాను, ప్రతిసారీ అది నువ్వు ఉంటున్న ఆలయం వరకు వచ్చి అదృశ్యమవుతుంది. ఆ గుర్రం నీదేనని నాకు నమ్మకంగా ఉంది. నా పంట పూర్తిగా పాడైపోయింది. నువ్వు నాకు తగిన పరిహారం ఇవ్వాలి" అని దుర్భాషలాడాడు. తాను పొరబడ్డానని, మాత దగ్గర గుర్రం లేదని వాదిరాజు ఫిర్యాదుదారునికి చెప్పాడు. అయితే, ఫిర్యాదు దారు సంతృప్తి చెందలేదు మరియు ప్రాంగణాన్ని పూర్తిగా శోధించాలని పట్టుబట్టాడు. అతనికి గుర్రం కనిపించకపోవడంతో, అతను పూర్తిగా ఆశ్చర్యపోయాడు. అప్పటికి ఏమి జరుగుతుందో వాదిరాజు గ్రహించాడు. అతను నవ్వి, మర్యాదగా ఫిర్యాదుదారుని గుర్రం నాశనం చేసి ఉంటుందని భావిస్తున్న మొక్కజొన్న పొలానికి తీసుకెళ్లమని అడిగాడు.

వారు పొలానికి వచ్చి పంటను పరిశీలించినప్పుడు, గుర్రం తన పంటను తిన్న ప్రదేశాలన్నింటిలో బంగారు మొక్కజొన్నను చూసి యజమాని ఆశ్చర్యపోయాడు. అప్పుడు వాదిరాజు ఆ గుర్రం హయవదన భగవానుడేనని, ఆయనను చూడటం తనకు చాలా అదృష్టమని అతనికి వివరించాడు. పంట యజమాని వాదిరాజు పాదాల వద్ద లొంగిపోయి, తన భూమిని మాతకు



అర్పించాడు. తిరిగి వెళ్ళేటప్పుడు, వాదిరాజు దశావతార స్తుతిని స్వరపరిచాడు. ఇది అశ్వధాటి (అక్షరాలా 'గుర్రపు నడక లేదా త్రొక్కు') కు స్వరపరచబడింది. మరియు పాడినప్పుడు శ్రావ్యంగా గుర్రం నృత్యం చేస్తున్నట్లుగా ధ్వనిస్తుంది.

తన ఇష్టదైవం హయగ్రీవుడికి (హయవదన అని కూడా పిలుస్తారు) నైవేద్యాన్ని సమర్పించ డానికి వాదిరాజు ఒక ప్రత్యేక ప్రక్రియను కలిగి ఉన్నాడు.

దీన్ని ఇలా చేసేవారు: హయగ్రీవ అనే తీపి వంటకం (బెల్లం, బాదం, నెయ్యి మరియు వండిన బెంగాల్ పప్పుతో తయారు చేసే వంటకం) మఠంలో తయారు చేస్తారు. క్రమం తప్పకుండా పూజ చేసిన తర్వాత, వాదిరాజు ఒక గదిలో తలుపు మూసుకుని, హయగ్రీవంతో నిండిన పళ్ళెం తలపై పట్టుకుని అత్యంత భక్తితో భగవంతుడిని ధ్యానించేవాడు. హయవదనుడు స్వచ్ఛమైన తెల్లని గుర్రం రూపంలో ఆ విగ్రహం నుండి ఉద్భవించి, తన ముందు కాళ్ళను వాదిరాజు భుజాలపై వేసి, నైవేద్యాన్ని తిని, కొంత భాగాన్ని ప్రసాదంగా వదిలివేసేవాడు. వాదిరాజు భగవంతుడిని ప్రసన్నం చేసుకోవడానికి 'దశావతార-స్తుతి' పాడేవాడని, తరువాత తన కృతజ్ఞతను చూపించడానికి నృత్యం చేసేవాడని చెబుతారు. అది వాదిరాజుని వర్ణించే చిత్రాలలో, ఆయన భగవంతుడికి నైవేద్యం సమర్పిస్తున్నట్లు చూపించే చిత్రం అత్యంత ప్రజాదరణ పొందింది.

ఒకసారి కొంతమంది దుర్మార్గులు వాదిరాజే స్వయంగా ఆహారాన్ని తింటూనే భగవంతుడికి నైవేద్యం అర్పిస్తున్నట్లు నటిస్తున్నారని వాదించారు. వారి సిద్ధాంతాన్ని నిరూపించడానికి

వారు నైవేద్యంలో తేలికపాటి విషాన్ని కలిపారు. ఇది తెలియక, వాదిరాజు ఆ ఆహారాన్ని హయగ్రీవునికి అత్యంత భక్తితో అర్పించాడు. అయితే, ఆ రోజు, భగవంతుడు ప్రసాదంగా ఏ మీ వదలకుండా, సమర్పించినవన్నీ తిన్నాడు. ఖాళీ పళ్ళెం చూసినప్పుడు, వాదిరాజు చాలా కలత చెందాడు మరియు ఏదో తప్పు జరిగిందని గ్రహించాడు. అతను భగవంతుడిని ధ్యానించి నప్పుడు, భగవంతుడు అతని ముందు ప్రత్యక్షమై ఏమి జరిగిందో, మరియు వాదిరాజుని రక్షించడానికి తాను ఆహారాన్ని మొత్తం ఎందుకు తినాల్సి వచ్చిందో చెప్పాడు.

ఆ విగ్రహం శరీరమంతా నీలం-ఆకుపచ్చ రంగును అభివృద్ధి చేస్తుందని కూడా ప్రభువు అతనికి చెప్పాడు. వాదిరాజు కొంతకాలం పాటు 'వాదిరాజా గుల్లా' (మట్టుగుల్లా) ను నైవేద్యంగా సమర్పించాలి, ఆ సమయంలో ఆ రంగు క్రమంగా తగ్గిపోతుంది, ఈ సంఘటనను గుర్తుచేసేందుకు మెడ వద్ద ఆకుపచ్చ రంగు మాత్రమే మిగిలి ఉంటుంది.

1532లో, 'శ్రీ వాదిరాజ పర్యాయ భ్రమణ' వ్యవస్థను సృష్టించారు. కృష్ణమఠం సమీపంలో ఎనిమిది మఠాలకు భవనాలు స్థాపించబడ్డాయి. అన్ని సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తూ, కృష్ణ ఆలయాన్ని నిర్వహించడానికి ప్రతి మఠాలకు 2 సంవత్సరాల వ్యవధి ఇవ్వబడింది. ప్రతి మాతకు సంవత్సరంలో జరిగే అన్ని పండుగల సమయంలో రెండేళ్లపాటు ఆలయాన్ని నిర్వహించడానికి అవకాశం లభిస్తుంది.

దక్షిణ కన్నడలోని నేత్రావతి నది ఒడ్డున ఉన్న ధర్మస్థలం... ప్రజలు మంత్రవిద్యలు చేసే మరియు దెయ్యాలను మరియు రాక్షసులను పూజించే ఒక అశుభ ప్రదేశం. ఒకసారి, వాదిరాజు పర్యటనలో ఉన్నప్పుడు, అతను ఆ ప్రదేశం గుండా వెళ్ళాడు. అతని ఉనికిని తెలుసుకున్న ఆ సమాజ నాయకులు అతనిని తమ గ్రామంలో పూజ చేయడానికి రమ్మని ఆహ్వానించారు. వాదిరాజు వారి ఆహ్వానాన్ని తిరస్కరించాడు. ప్రజలు తమ వాతావరణాన్ని శుద్ధిచేయమని చేతులుజోడించి ఆయనను వేడుకున్నారు. తన సహాయకులలో ఒకరిని కదిరి ఆలయం నుండి మంజునాథేశ్వర (శివుడు) విగ్రహాన్ని తీసుకురమ్మని ఆదేశించాడు. తరువాత దానిని శాస్త్ర ప్రకారం ప్రతిష్టించి ధర్మస్థలంలో ప్రతిష్టించాడు. ఆ రోజు నుండి, ధర్మస్థలం దాని చెడ్డ పేరును కోల్పోయి దక్షిణ భారతదేశంలో ఒక ముఖ్యమైన తీర్థయాత్ర కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఇది ఒక ప్రత్యేకమైన ఆలయం, ఇక్కడ శివల్లి మధ్వ సమాజానికి చెందిన పూజారులు శివుని పూజిస్తారు మరియు ఆలయ నిర్వహణ జైన (హెగడే) కుటుంబం చేతుల్లో ఉంటుంది.

దక్షిణ కన్నడలో నేత్రావతి మరియు కుమారధార నదులు కలిసే ప్రదేశానికి సమీపంలో కటి-శివాలయ అనే తీర్థయాత్ర కేంద్రం ఉంది. ఇది చాలా సుందరమైన శివలింగాల ఆకారంలో ఉన్న వందలాది సహజంగా ఏర్పడిన రాతి నిర్మాణాలతో కూడిన ప్రదేశం. చాలా మందికి సహజంగా ఏర్పడిన శివలింగాలకు అభిషేకం చేయాలనే కోరిక ఉంది, కానీ అంత పెద్ద కార్యక్రమానికి నదులలో నీరు లేదు. ఈ వార్త వాదిరాజుకు చేరగానే, అతను తన కర్రతో (దండం) ఇసుకలో ఒక గీత గీసి భగవంతుడిని ప్రార్థించాడు. వెంటనే, ఆ గీత నుండి నీరు ఉప్పొంగి ఒక పెద్ద వాగుగా ఏర్పడింది. ఈ ప్రవాహాన్ని నేటికీ చూడవచ్చు మరియు దీనిని 'దండతీర్థ' పేరుతో పిలుస్తారు.

సోడే లేదా స్వాది అనేది ఆధునిక కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లాలో ఉన్న ఒక చిన్న పట్టణం, ఇది సిర్సి నుండి కొన్ని మైళ్ళ దూరంలో ఉంది. పదహారవ శతాబ్దంలో ఇది విజయనగర సామ్రాజ్యానికి విధేయత చూపుతూ 'అరసప్ప నాయక' అనే అధిపతి పాలించిన ఒక చిన్న ప్రాంతానికి (ప్రావిన్స్) రాజధానిగా ఉండేది. విజయనగర సామ్రాజ్య పతనంతో సోడే నాయక రాజుగా స్వతంత్ర ప్రాంతంగా మారింది. శత్రువులు ప్రావిన్స్ పై దాడి చేసి తన కోటను ధ్వంసం చేయడంతో, తన సొంత మంత్రులు అతనిపై తిరుగుబాటు చేయడంతో, నాయకుడికి రాజభవనం నుండి పారిపోవడం తప్ప వేరే మార్గం లేదు. అతను పారిపోతుండగా, అటుగా వెళ్తున్న వాదిరాజ పరివారాన్ని చూశాడు. అతను వెంటనే వాదిరాజు పాదాల వద్ద శరణుజొచ్చి రక్షణ కోరాడు. వాదిరాజు అతనిని మంత్రాక్షతలతో ఆశీర్వదించి తిరిగి వెళ్లి తన శత్రువులతో పోరాడమని కోరాడు. వాదిరాజు ఆశీర్వాదంతో నాయకుడు అతని శత్రువులపై విజయం సాధించాడు. సోడే విముక్తికి చిహ్నంగా, వాదిరాజు అరసప్ప నాయకుని గంటే (పూజ సమయంలో ఉపయోగించే గంట)ను మఠంలో ప్రధానంగా ఉపయోగించాలని నిర్ణయించుకున్నాడు.

వాదిరాజు తన శిష్యులకు బోధించే పెద్ద పనస చెట్టు. ఈ చెట్టుపై పిడుగు పడినప్పుడు, వాదిరాజు దానిని తిరిగి బ్రతికించాడు. ఇది ఇప్పటికీ సజీవంగా ఉంది మరియు దాని ఫలాలను హయగ్రీవుడికి నైవేద్యంగా సమర్పిస్తారు.

చివరికి, వాదిరాజు ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమైంది. ఆయనకు అపారమైన ఆధ్యాత్మిక శక్తులు ఉన్నప్పటికీ, చనిపోయిన వారిని బ్రతికించడంతో సహా అనేక అద్భుతాలు చేసినప్పటికీ, అతను తన స్వార్థ ప్రయోజనాల కోసం తన శక్తులను ఉపయోగించుకోవడానికి నిరాకరించడం గమనార్హం.

తనకు వచ్చిన ఏ అనారోగ్యాన్నైనా దేవుని ప్రసాదంగా అనుభవించాలని అతను ఎంచుకున్నాడు భూమి నుండి బయలుదేరే ముందు చివరిసారిగా ఉడిపిని సందర్శించి కృష్ణుడిని దర్శనం చేసుకోవాలని వాదిరాజు నిర్ణయించుకున్నాడు. అప్పుడు అతనికి కంటి చూపు మందగించడంతో బాధపడుతూ, భగవంతుడిని సరిగ్గా చూడగలనా అని ఆందోళన చెందాడు.

చివరికి, అత ను ఉడిపికి చేరుకుని విగ్రహం ముందు నిలబడినప్పుడు, అతని కంటి చూపు స్పష్టంగా కనిపించింది, భగవంతుని విశ్వరూప దర్శనం చేసుకున్నాడు.

తరువాత అతను అరసప్ప నాయకుడిని పిలిచి 5 బృందావనాలకు ఏర్పాట్లు చేయమని కోరాడు – ఒకటి వదిరజుడికి, మిగిలిన నాలుగు విష్ణువు, బ్రహ్మ, వాయు మరియు రుద్రుల ప్రత్యేక సాన్నిధ్యంతో అమర్చబడి ఉన్నాయి. తన గురువు ఇచ్చిన ఆజ్ఞను పాటించాల్సి వచ్చింది.

దీని ప్రకారం, 1600 సంవత్సరంలో (హిందూ శార్వరి సంవత్సరం) వాదిరాజులు ఫాల్గుణంలో యథావిధిగా త్రివిక్రమ ఉత్సవాన్ని పూర్ణిమ నాడు చివరి రథోత్సవంతో నిర్వహించాడు. అప్పుడు, ఇంద్రుడు పంపిన కొంతమంది దైవిక పరిచారకులు వాదిరాజు ముందు ప్రత్యక్షమై, భూమిపై తన లక్ష్యం పూర్తయినందున స్వర్గానికి తిరిగి రావాలని దేవతల అభ్యర్థనను తెలియజేశారు. త్రివిక్రమ స్వామి ఉత్సవానికి సంబంధించిన చివరి కర్మలను పూర్తి చేయడానికి మరో 3 రోజులు సమయం కావాలని కోరుతూ వాదిరాజు ఇంద్రుడికి తిరిగి సందేశం పంపాడు. ఇంద్రుడు ఆనందంతో అంగీకరించాడు.

చివరగా, ఫాల్గుణ బహుళ తృతీయ నాడు, వాదిరాజు బృందావనంలోకి సజీవంగా ప్రవేశించాడు. బృందావనంపై చివరి రాయి వేసిన క్షణం, అతని శిష్యుల నుండి గొప్ప విలాపం వినిపించింది. తన వస్త్రం మరియు పాదుకలు (చెక్క చెప్పులు) ధరించి బృందావనంలోకి ప్రవేశించిన వాదిరాజు, బంగారు రథంలో స్వర్గానికి తీసుకెళ్తుండగా, తన శిష్యులకు జ్ఞాపకార్థంగా ఆ వస్త్రం మరియు చెప్పులను విసిరివేసాడు. ప్రతి సంవత్సరం, వాదిరాజు ఆరాధన జరిగినప్పుడు, వాదిరాజును అత్యంత ఉత్సాహంతో పూజిస్తారు.

'శ్రీవాదిరాజతీర్థ' మధ్వ పరంపరలోని సాధువుల నక్షత్ర సముదాయంలో చాలా ఉన్నతమైన స్థానాన్ని ఆక్రమించారు. కొందరు ఆయనకు శ్రీ జయ తీర్థ, శ్రీ వ్యాస తీర్థ మరియు శ్రీ రాఘవేంద్ర తీర్థలతో పాటు ఉన్నతమైన హోదాను ఇస్తారు, మరికొందరు ఆయనను ఆచార్య మధ్వుల తర్వాత రెండవ స్థానంలో భావిస్తారు.

"ఓ మూఢుడా! దుర్మతీ! ఈ శరీరము అనేక సంధులు కలిగి స్వాభావికంగా దుర్బలమైంది. వయస్సు మళ్ళినప్పుడు మరింత దుర్బలమౌతుంది. వృద్ధావస్థలో కీళ్ళనొప్పుల లాంటి ఎన్నో రోగాలతో కృశించి నశించక తప్పదు. దీని చికిత్స కోసం ఎన్ని ఔషధాలు సేవించినా రోగమరణాలు లేకపోతాయా? అందువల్ల ఇలాంటి ఉపద్రవాలు లేకుండటానికి 'శ్రీకృష్ణనామ' మనే ఉత్తమ ఔషధాన్ని పానం చేయి" అని కులశేఖరాళ్వార్లు వివరిస్తాడు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1.ఉత్తమ కార్యసాధకుని లక్షణాలు దయచేసి తెలియజేయండి – శాంత, వారి కుటుంబసభ్యులు, తాడేపల్లి**

జవాబు – మనుషులు మూడు రకాలుగా ఉంటారు. కాలాన్ని సదుపయోగం చేసేవారు, కాలాన్ని దురుపయోగం చేసుకునేవారు మరియు కాలాన్ని వృథాగా గడిపేస్తూ ఉండేవారు. మనిషి ఏ పనీ చేయకుండా ఉండడు, ఉండలేడు. అయితే ఈ చేయడం పైననే అతని లేదా ఆ వ్యక్తి ఉండే సమాజం స్థితిగతులు ఆధారపడి ఉంటాయి. తమ ప్రయోజనంతో పాటుగా తోటివారి శ్రేయస్సుకై పనులు చేస్తూ, ఇహలోక సుఖ సౌఖ్యాలతో పాటుగా పారమార్థిక ప్రయోజనం నిమిత్తం తమ శరీరాన్ని, బుద్ధిని కాలాన్ని ఉపయోగించువారే ఉత్తములు. మనిషి ఉన్న స్థితి నుండి ఉన్నతస్థితికి పయనిస్తేనే అతని జన్మ సార్థకమవుతుంది. సత్సాంగత్యం, సద్గ్రంథ పఠనం, సద్గురు సమాశ్రయణం, మహనీయుల జీవిత చరిత్రల పరిశీలన, సన్మార్గ గమనం – ఇవి ఉత్తమ సాధకుడు ఆచరించవలసిన పద్ధతులు, మార్గాలు. సమయాన్ని సదుపయోగం చేసుకుంటూ ధర్మమార్గంలో నడవడంలోనే ఉత్తమ మానవునికి కీర్తి, ఆనందం, సౌఖ్యం లభిస్తాయి.

**2.జీవితం అంటే తాత్త్విక దృష్టితో, ఉదాహరణ ద్వారా వివరిస్తారా గురువుగారూ? - డా|| ఎం.నాగేశ్వరరావు, గాంధీనగర్, హైదరాబాద్.**

జవాబు – జీవితం అంటే ఒక ప్రవాహం. ఒక గమనం. అది క్షణభంగురమే అయినా అమూల్యం. భగవంతుడు మనల్ని తరింపచేయడానికి ఇచ్చిన దివ్యవరం. అయితే ఇది సాఫీగా సాగదు. ఎన్నో మలుపులు, ఎత్తుపల్లాలు, గోతులు, సుడిగుండాలు, ఊబిలు ఉంటాయి. అయితే ఈ జీవితంలో అన్ని కఠినమైన పరిస్థితులు మనకు కలగకుండా ఉండాలంటే, మనం 'నేను' (అహాన్ని) వదలాలి. అలా వదలగలిగితే మనకు ఇక్కడే జీవించి ఉండగానే మోక్షం లభిస్తుంది. నీరు, ఐసు రెండూ ఒకటే. నీటిని తుంచలేం కాని, గడ్డకట్టి మంచుగా అయినదాన్ని ముక్కలు చేయగలం. మంచు తన ఉనికిని వదిలివేస్తుంది. నీరు అలా కాదు. వదలదు. నీరు నదిగా మారి, బురద, చెత్తను తనతో కూడా తీసుకెళ్తుంది. నీరు ఆవిరి కావడం కూడా తన ఉనికిని వదలడమే.మనం కూడా వ్యక్తిభావన వదిలి జీవితంలో బ్రహ్మ భావన సంతరించుకుంటే సుఖం, దుఃఖం ఏవీ మన చెంతకు రావు. ఈ స్థితికి రావాలంటే మనం ఆ దైవానికి సర్వస్వ శరణాగతి చేయాలి. సంపూర్ణంగా చేయాలి. మనం మన ప్రతి పనిలో ఆ దైవానికే కర్తృత్వ భావనను సమర్పిస్తే మనకే భయం ఉండదు. జీవన గమనం సాఫీగా సాగిపోతుంది. మనలో దైవంపై దృఢ నమ్మకం ఏర్పడుతుంది. అదే మనల్ని నడిపిస్తుంది.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**

**– ఎడిటర్, శ్రీవేంకటేశం**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## బ్రహ్మాండ పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

సత్రాజిత్తుని మనస్సునకు ఉల్లాసము కలిగించినవాడు, సత్యభామకు భర్త, శుభాలను కలిగించేవాడు, శతధన్వుని యుద్ధంలో సంహరించినవాడు, శరణన్నవారిని కాపాడుటకు సిద్ధముగా ఉన్నవాడు, పాండవులకు ప్రియము చేయుటలో ఉత్సాహం కలవాడు, లోకకల్యాణమే ప్రియంగా భావించిన వాడు, రోహిణీ వసుదేవుల కుమార్తె అయిన సుభద్రకు అన్నయైన శ్రీకృష్ణునికి నమస్కారము.

కోసల దేశ రాజైన నగ్నజిత్తు కుమార్తెయైన నాగ్నజితి భర్త, కిరీటకుండలములు ధరించినవాడు, కల్పవృక్షం యొక్క లేతచిగుళ్ళతో లాలింపబడినవాడు, భీష్మకుని కుమార్తెయైన రుక్మిణీదేవితో ప్రణయ సంభాషణ కలవాడు. అవంతీదేశాధీశ్వరుని చెల్లెలైన మిత్రవిందను స్వయంవరంలో వరించి ఆమెకు ప్రియుడైనవాడు, భయరహితుడు. అందరికీ అభయమిచ్చువాడు, తానే అనేక రూపాలు ధరించి క్రీడిస్తూ సంతోషించేవాడు, స్వయంవరంలో మత్స్యయంత్రాన్ని భేదించి, బృహత్సేనుని కుమార్తెయైన లక్ష్మణను వివాహమాడి, ఆమెయందు ఉదారమైన మనస్సు కల శ్రీకృష్ణునికి నమస్కారం.

ప్రాగ్జ్యోతిషపురాధీశుడైన నరకాసురుని సంహరించినవాడు, అతని సైన్యాన్ని హతమార్చినవాడు, అమృతస్వరూపుడు, తన భక్తులకు అమృతత్త్వాన్ని ప్రసాదించువాడు, భూదేవిచేత స్తుతింపబడినవాడు, భోగాలను భవించినవాడు, మంచి ఆభరణాలు, పట్టు పీతాంబరాలు ధరించినవాడు, అనేకమంది స్త్రీల చేత ఆనందింపబడినవాడు, అనేకమంది స్త్రీలకు ఆనందాన్నిచ్చినవాడు, పరిమళాలను వెదజల్లే సుగంధమాలికలు, మైపూతలు కలవాడు, మహాజ్ఞానియైన నారదమహర్షికి కూడా గోచరము కాని చరిత్ర కలవాడు, దేవాదిదేవుడు, సకలలోక చక్రవర్తి, జగద్గురువు అయిన శ్రీకృష్ణునికి నమస్కారం.

వేయి చేతులుగల బాణాసురుని చేతులను ఖండించినవాడు, తాపత్రయాలనే జ్వరాన్ని పోగొట్టేవాడు, బాణాసురుని కుమార్తెయైన ఉషను తన మనుమడైన అనిరుద్ధునికిచ్చి వివాహంచేసి ఆమెకు ఆనందం కలిగించినవాడు, అవాఙ్మానసగోచరుడు, శుభకరములైన వాక్కులతో సంతోషించేవాడు, పరమశివుని వాక్కులచేత సంతోషించినవాడు. అయిన శ్రీకృష్ణునికి నమస్కరిస్తున్నాను.

మహేశ్వరుని స్వేదమునుండి పుట్టిన జ్వరునిచే స్తుతింపబడినవాడు, శీతజ్వరభయాన్ని పోగొట్టేవాడు, నృగుడనే రాజునకు శాపవిముక్తి కలిగించినవాడు, పౌండ్రక వాసుదేవుడు మొదలైన వారిని సంహరింపదలచినవాడు, అనేక విధాల శత్రుమాయలచే భయపడిన బ్రాహ్మణుల యందు మిక్కిలి దయగలవాడు. జరాసందుని బలమును ద్వేషించినవాడు, అశ్వరూపాన్ని ధరించి వచ్చిన 'కేశి' అనే భయంకర రాక్షసుని

సంహరించినవా డు, చక్రాయుధమును ధరించినవాడు, దైత్యులను అంతమొందించినవాడు. సభలో పూజింపదగినవాడు, కంసుణ్ణి వధించి బందీలుగా ఉన్న రాజులను విడిపించిన శ్రీకృష్ణునికి నమస్కారము.

ధర్మరాజు చేసిన రాజసూయయాగంలో హవిస్సును భుజించినవాడు, నిగనిగా మెరిసే శరీరం కలవాడు, సర్వ శుభలక్షణములు కలవాడు, సుదాముడిచ్చిన (కుచేలుడు) అటుకులను తిని సంతృప్తి చెందినవాడు, కుచేలునికి అభీష్టాలను ప్రసాదించినవాడు, సత్త్వము మొదలైన సద్గుణములతో నిండిన గంభీర హృదయము కలవాడు, ద్రౌపదీమాన సంరక్షకుడు, భీష్మాచార్యులచే ధ్యానించబడేవాడు, భక్తునికి వశుడైనవాడు, భీమునిచే పూజింపబడేవాడు, దయా సముద్రుడు, దంతవక్త్రుని శిరము ఖండించినవాడు, కృష్ణుడు, నల్లనివాడు, అర్జునుని మిత్రుడు, వైకుంఠాధిపతి, స్వయంప్రకాశకుడైన శ్రీకృష్ణునికి నమస్కరిస్తున్నాను.

వైజయంతీమాలతో ఆనందించేవాడు, నెమలి పింఛాన్ని ఆభరణంగా ధరించినవాడు, కురుపాండవుల మధ్య రాయబారంచేసి సంధికి ప్రయత్నించినవాడు, దుష్టశాసనాలను అంతమొందించినవాడు అయిన శ్రీకృష్ణునికి నమస్కారము.

## బుద్ధావతారం

బుద్ధుడు, మహాయోగులచే తెలియబడేవాడు, బుద్ధావతారం ధరించినవాడు, నిర్మలుడు, నిష్కళంకుడు, అన్నీ తెలిసినవాడు, యజ్ఞాలలో పశుహింసను పాపమని నిందించినవాడు, త్రిపురాసురుల భార్యలకు ప్రాతివ్రత్యాన్ని భంగం చేసినవాడు, సర్వశాస్త్రవిశారదుడైన శ్రీ బుద్ధావతారమూర్తికి నమస్కారము.

మార్పులు లేనివాడు (ఎల్లప్పుడు ఒకేవిధంగా ఉండేవాడు, మమకారరహితుడు, సర్వసముడు, భ్రాంతిరహితుడు, వ్యాధిరహితుడు, జగత్తును మోహింపజేసే ధర్మాలను బోధించినవాడు, దిక్కులే వస్త్రముగా కలవాడు అనగా పదిదిక్కుల వరకు వ్యాపించినవాడు, సర్వవ్యాపకుడు, దిక్పాలకులకు ప్రభువు అయిన బుద్ధ భగవానునకు నమస్కారము.

## కల్క్యావతారం

కల్క్యావతారుడు, మ్లేచ్ఛులను సంహరించువాడు, దుష్టులను నిగ్రహించువాడు, ధర్మాన్ని ప్రతిష్ఠించేవాడు, బ్రాహ్మణాది నాలుగు వర్ణములను విభజించువాడు. యుగమును అంతమొందించువాడు, యుగములను ఆక్రమించువాడు, యుగాలను కల్పించేవాడు, అన్ని యుగాలలో ప్రకాశించేవాడు, కోరికలు పోగొట్టువాడు, భక్తుల కోర్కెలను తీర్చువాడు, తనకు కోరికలు లేనివాడు, తన నాశ్రయించేవారికి పురుషార్థాలను ప్రసాదించేవాడు, సూర్యుని యొక్క సర్వశ్రేష్ఠమైన తేజస్స్వరూపుడు, శారఙ్గమనే ధనుస్సును ధరించినవాడు. వైకుంఠమందిరంలో నివసించేవాడు, సకల విద్యాధిదేవతయైన హయగ్రీవుడు కైటభాసురుని సంహరించువాడు, గజేంద్రుని పట్టిన మొసలిని సంహరించి గజేంద్రుని రక్షించిన శ్రీమహావిష్ణువుకు నమస్కారము.

జ్ఞానోదయం కలిగించి సర్వసందేహాలను పోగొట్టేవాడు, భక్తులందరియెడ ఉత్సాహం కలవాడు, కపర్ది, తన పాదోద్భవయైన గంగతో శివుని జటాజూటాన్ని నింపేవాడు, కోరికలు లేకుండా చేసేవాడు, కాలస్వరూపుడు, సర్వోత్కృష్టుడు, సదాస్మరించబడేవాడు, స్మృతిస్వరూపుడు, స్థిరచిత్తం కలవాడు, సృష్టికి మూలపురుషుడు, కొలవడానికి వీలులేని అనంత విభూతి కలవాడు, అన్నిటికి మూలమైనవాడు సత్యాన్ని, ధర్మాన్ని నిరూపించేవాడు, దోషరహితుడు, దేనియందు ఆసక్తి లేనివాడు, అంటీ ముట్టనివాడు, భయరహితుడు, భయాన్ని పోగొట్టేవాడు సకలనీతిపారంగతుడైన దేవదేవునికి నమస్కారము.

భక్తులకు దాసుడు, సర్వులకు ప్రభువు, కర్మరహితుడు, నిస్సంగుడు, పరమ శాంతుడు, ప్రపంచానికి అతీతుడు, తరగని నిధివంటివాడు, అందరినీ నడిపించేవాడు, న్యాయమూర్తి, లోక సంగ్రహార్థం కర్మలు చేసేవాడు, పరస్పర విరుద్ధమైన పనులు చేసేవాడు. తనకే కర్మలు అంటనివాడు, కర్మలు పొందగోరువాడు, సత్కర్మలను అనుష్ఠింపజేసేవాడు, కర్మలను తనకు (పూజాంగములుగా) అంగములుగా చేసుకొనువాడు, వారి వారి అర్హతలకు తగినట్టుగా కర్మలను ఏర్పరచినవాడు (వర్ణాశ్రమానుగుణంగా), లోకాతీతములైన అద్భుతకార్యాలు చేసేవాడు, మహాకర్మిష్ఠుడు, భక్తరక్షణమనే మహావ్రతాన్ని స్వీకరించినవాడు, యజ్ఞయాగాది కర్మఫలభోక్త, తపోనుష్ఠానాది, సత్‌కర్మ ఫలప్రదాత, సర్వకర్మలకు ప్రభువు, కర్మప్రేరకుడు, దుష్టకర్మలను నిగ్రహించువాడైన శ్రీనివాసునికి నమస్కారము.

నరావతారం ధరించినవాడు, నారాయణుడు, ఇంద్రియనిగ్రహం కలవాడు, జగత్తును నియమించువాడు, కపిలవర్ణం కలవాడు, సకలాభీష్టప్రదుడు, శుద్ధాత్మస్వరూపుడు, పరంతపుడు, మహాతపస్వి, సూర్యమండల వర్తియై లోకాలను తపింపజేసేవాడు, నిరంతరం ఓంకారాన్ని జపించేవాడు, అక్షమాలను ధరించినవాడు, సర్వగతుడు, అందరినీ నడిపించువాడు, లయకారుడు, సర్వులకు ఆశ్రయమైన శ్రీనివాసునికి నమస్కారము.

సదాచారసంపన్నుడు, సర్వసాక్షి, శత్రువులను ద్వేషించువాడు, దుర్మార్గులపై కోపం చూపించేవాడు, లోకాలన్నింటిని చుట్టియున్నవాడు, కపటనాటక సూత్రధారి, చెడుపనులను నిరోధించేవాడు, సర్వజ్ఞుడు, జ్ఞానబోధకుడు, మహాయోధుడు, శ్రద్ధాస్వరూపుడు, సత్సంకల్పం కలవాడు,

లోక హితకరమైన బుద్ధికలవాడు, మంగళస్వరూపుడు, మంత్ర స్వరూపుడు, మార్గదర్శకుడు, తనను మననము చేసేవారిని రక్షించేవాడు, మంత్రశక్తిచేత పొందదగినవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

మంత్రాలను ఉపదేశించువాడు, ఇతరులు ప్రయోగించే చెడు మంత్రములు నిరోధించేవాడు, మంత్రములను పోషించేవాడు. మంత్ర ఫలప్రదా మంత్రాధిదేవత, మంత్రమూర్తి, మంత్రములు అ——లుగా కలవాడు, మంత్రములను విస్తరింపజేసిన మహామంత్ర స్వరూపుడు, అష్టాక్షరీ మహామంత్రాధిదేవత ముల్లోకాలను ఆక్రమించినవాడు, స్థిరమైన బుద్ధి కలవాడు, స్థిరమైన విజ్ఞానం కలవాడు, సుస్థిరమైన ప్రజ్ఞ కలవాడు, స్థిరమైన ఆసనము కలవాడు, కార్యసిద్ధి అయ్యేవరకు కదలనివాడు. స్థిరమైన యోగ సమాధినిష్ఠలో ఉన్నవాడు. సర్వజగత్తుకు శాశ్వతమైన ఆధారమైనవాడు, నిశ్చలమైన మార్గం కలవాడు, శాశ్వతములైన వేదస్వరూపుడు, మోక్ష స్వరూపుడు, భక్తులకుమోక్ష ప్రదాత, కోర్కెలు లేనివాడు, అగ్ని స్వరూపుడు, దోషరహితుడు, దోషము అంటనివాడు, ద్వేషరహితుడు, అహంకారం లేనివాడు, దంభము, దర్పము లేనివాడైన వేంకటేశ్వరునికి నమస్కారము.

అసూయ లేనివాడు, అంతము లేనివాడు, --లేనన్ని చేతులు, తొడలు కలవాడు, అనంతములైన పాదములు కలవాడు, అంతటా కన్నులు కలవాడు, అనంతమైన ముఖములు కలవాడు, అనంతములైన శరీరములు కలవాడు, అసంఖ్యాక రూపములు కలవాడు, అనంతమైన కర్మలు కలవాడు, ఊర్ధ్వరేతస్కుడు (జితేంద్రియుడు), ఊర్ధ్వలోకాలవరకు వ్యాపించి ఉన్నత శరీరం కలవాడు, ఉన్నతమైన శిరస్సు కలవాడు, ఉదాత్తమైన స్వభావము కలవాడు, ఊహాలోకాలకు వ్యాపించినవాడు, మహోన్నతుడు ఉన్నతమార్గాన్ని కాపాడేవాడు, ఊర్ధ్వలోకాలలో వ్యాపించిన తేజస్సు కలవాడు, వ్యాకులత లేనివాడు గంభీరుడు, సర్వజగత్తుకు బీజస్వరూపుడు శ్రీనివాసునికి నమస్కారము.

తన సంకల్పంచేత లోకాలను సృష్టించేవాడు, సనాతనుడు, శాశ్వతుడు, సమస్త ప్రపంచానికి మూలకారకుడు, కర్మరహితుడు, కృతకృత్యుడు, మహాత్ముడు, చాలా పెద్దవాడు, అణువు కంటె సూక్ష్మమైనవాడు, ఘనమైనవాడు, ఉత్కృష్టమైన శోభ కలవాడు, విచిత్రమైన మాలలు ధరించేవాడు, వైకుంఠవాసి, సర్వవ్యాపి, ఆకాశంలో సూర్యచంద్రాదుల రూపంలో వెలుగునిచ్చువాడు, వాయు స్వరూపుడు, బంధరహితుడు, అప్రాకృత దివ్య స్వరూపుడు, హింసారహితుడు, ఆకాశస్వరూపుడు, పుట్టుక లేనివాడు, వివిధ రూపములు కలవాడు, విశ్వవ్యాపి, జగత్ప్రభువు, నిగ్రహానుగ్రహసమర్థుడు, లోకాలకు సుఖాన్ని, ఆనందాన్ని కలిగించేవాడు, చాలా గొప్పవాడు, భూలోక భువర్లోకాల స్వరూపుడు, సర్వాధారమైన భూమికి ఆధారమైనవాడు అయిన శ్రీనివాసునికి నమస్కారము.

మహానందమయుడు, మహాపరాక్రమశాలి, మహా తేజోరాశి, మహోత్సవ స్వరూపుడు, మహా క్రోధమూర్తి (ప్రళయకాలంలో), బాగా జ్వలించేవాడు, మహాశాంతస్వరూపుడు, అపారసద్గుణ సాగరుడు, సత్యవ్రతుడు, సత్పురుషుల హితాన్ని కోరేవాడు, సత్యసంధుడు, సత్పురుషులకు పరమగతియైనవాడు, సత్యాన్ని రక్షించే ప్రభువు, సత్య సంకల్పుడు, సత్యచరిత్రకలవాడు. సర్వ జీవులలో ప్రాణరూపుడై సంచరించేవాడు, సర్వజీవుల హృదయాంతర్యామి, పరమాత్మ స్వరూపుడు, జ్ఞానస్వరూపుడు, జీవ స్వరూపుడు, సర్వజగత్తును ప్రకాశింపచేసేవాడు, ఎల్లప్పుడు ప్రకాశించేవాడు, సర్వులకు ప్రియమైనవాడు, సర్వసాక్షి, శౌరి (వసుదేవునిపుత్రుడు), జనార్దనుడు, ముకుందుడు, మోక్షమిచ్చేవాడు, నిరతిశయానంద స్వరూపుడు, హిరణ్యగర్భుడు, శత్రుపురాలను ఛేదించిన శ్రీనివాసునికి నమస్కారం.

శత్రువులనుఅణచేవాడు, బాగాస్తుతించబడేవాడు, ప్రకాశించే వాడు, సంతోషించేవాడు, మొల్లలు మందార పూల వంటి చిరునవ్వు కలవాడు, పార్థసారథి, రథాన్నధిరోహించిన శత్రు భయంకరమైన రూపంకలవాడు, ఆనందస్వరూపుడు, నందుని కుమారుడు, అనసూయా పుత్రుడు, అత్రిమహర్షికి నేత్రానందం కలిగించినవాడు. మహా సమృద్ధిగలవాడు, పాంచజన్యమనే శంఖాన్ని ధరించినవాడు, పద్మములవంటి హస్తములు కలవాడు, తన వక్షఃస్థలంలో లక్ష్మీదేవి కుంకుమచిహ్నము కలవాడు, దుష్టులను, తన శక్తియనే అంకుశంతో జయించేవాడు, తన నాభికమలంలో మకరందం నిండి ఉన్నవాడు, పాపపంకిలము లేనివాడు, అగరు, సుగంధలేపనము కలవాడు, దేవేంద్రునివలె పరమైశ్వర్యసంపన్నుడు, ఇంద్రస్వరూపుడు, చంద్రుడు రథముగా కలవాడు, చంద్రస్వరూపుడు, ఆహ్లాదకరమైనవాడు, చంద్రునికంటె కూడా సుందరుడు, ఆనతి చేసేవాడు, చంద్రుని కూడా ప్రకాశింపజేసేవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

వామనావతారంలో ఇంద్రునికి తమ్ముడైనవాడు, ఇంద్రునికి ప్రభువైనవాడు, వాక్కునకు అధిపతి, వేదవాక్కులచే ప్రతిపాదింపబడువాడు చంద్రుడు నేత్రముగా కలవాడు, చంద్రుని వంటి నేత్రం కలవాడు, ప్రత్యగాత్మ, జీవాత్మ, పరమాత్మ పరంధాముడు, పరమ పురుషార్థమైన మోక్షాన్ని ప్రసాదించేవాడు, పరాత్పరుడు, అనంతమైన వేద వాఙ్మయ స్వరూపుడు, సర్వాతీతుడు, సముద్రము వంటివాడు, పిపీలికాది బ్రహ్మ పర్యంతం తానే అయినవాడు, మిక్కిలి బలాఢ్యుడు, పురుషార్థప్రదాత, క్షమాశీలి ఇతరులు చేయలేని సాహసకృత్యాలు చేసేవాడు, అన్నింట జయించి వశపరచు కొనేవాడు అయిన శ్రీనివాస నమస్కారము.

మహా తేజస్సంపన్నుడు, వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించుటలో

నేర్పరి, తపస్సంపన్నుడు, నరనారాయణరూపంలో తపస్సు చేసినవాడు, ఐశ్వర్యస్వరూపుడు, ఐశ్వర్యానికి తగ్గట్టు క్రియాకలాపములు కలవాడు, క్షీరసాగరశాయి (క్షీరసాగరంపై శయనించినవాడు), భగవంతుడు (జ్ఞానము, శక్తి, బలము, ఐశ్వర్యము, తేజస్సు అనే ఆరుగుణాలు పరిపూర్ణంగా కలవాడు), సర్వజ్ఞుడు, సామవేద పారంగతుడు, మహాయోగీశ్వరేశ్వరుడు, మహాధీరుడు, (బుద్ధిప్రేరకుడు), మహాభోగి, శేషశయనుడు, సకల చరాచర జగత్తుకు ప్రభువైన శ్రీనివాసునకు నమస్కారము.

మహావీరుడు, నిత్యతృప్తుడు, అందరికీ తృప్తి కలిగించువాడు, సర్వగుణ పరిపూర్ణుడు, మహాపుష్టి కలవాడు, మహాగుణవంతుడు, మహాదేవుడు, మహాబాహువు, సహస్రబాహువు, భుజబలసంపన్నుడు, మహాధర్మ స్వరూపుడు, మహేశ్వరుడు, భక్తులకు కొంగుబంగారమైనవాడు (సదా వెంట ఉండి కాపాడేవాడు), భక్తులుకాని వారికి దూరంగా ఉండేవాడు, స్వర్గమార్గంలో ప్రవేశింపచేసేవాడు, పర్వతంవంటివాడు, (వేంకట పర్వతస్వరూపుడు), లోకమంతా సంచరించేవాడు, నాగులకు ప్రభువు, నాగులను పాలించేవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

ఆపాదమస్తకం బంగారుమయమైనవాడు, హిరణ్యగర్భుడు, సువర్ణరేతస్కుడు, స్వర్ణమయమైన వర్చస్సుకలవాడు, సంపదలనిచ్చువాడు, సౌశీల్యాది సద్గుణములచే కీర్తింపదగినవాడు, సర్వులకు శరణు పొందదగినవాడు, పతితపావనమైన యశస్సు కలవాడు, పురాణములచేత తెలియదగినవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

లోకక్షేమార్థం మహాభారత యుద్ధాన్ని నిర్వహింపజేసినవాడు, రావణాది దుష్టరాక్షసులను సంహరించుటకై యుద్ధానికి సిద్ధమైనవాడు, పాంచజన్యం సుదర్శనం, కౌమోదకి, నందకం, శారఙ్గము అనే దివ్యశక్తులుగల పంచాయుధములు కలవాడు, సర్వ లోకాలను తన వశమందుంచుకొనువాడు, దౌర్జన్యాన్ని భంగం చేసేవాడు, తాపత్రయాలను పోగొట్టి అభీష్టాలను వర్షించేవాడు, నీలమేఘశ్యాముడు, సౌజన్యమూర్తి, నాశరహితుడు, నిత్యుడు, జలంధరుడనే అసురుని యుక్తితో అంతమొందించినవాడు, మోహినీ అవతారం ధరించి భస్మాసురుని అంతమొందించినవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

ఉదారమైన మనస్సు కలవాడు, సర్వశ్రేష్ఠుడు గొప్ప కీర్తి కలవాడు, మిక్కిలి పొడవైనవాడు, అందరికంటె గొప్పవాడు, గరుడధ్వజుడు అందరికంటె పెద్దవాడు, మిక్కిలి దృఢమైనవాడు, చాలా పెద్ద వయస్సు కలవాడు, చాలా ఎత్తైనవాడు (త్రివిక్రమావతారుడు), ఓంకారస్వరూపుడు, ఆదిశేషస్వరూపుడు, సత్సంప్రదాయాన్ని స్థాపించేవాడు, సర్వనియంత, సకల దేవతాసార్వభౌముడు లక్ష్మీపతి, మాధుర్య స్వరూపుడైన, శ్రీనివాసునికి నమస్కారము.

రెప్పపాటు లేనివాడు, మత్స్యావతారం ధరించినవాడు, జగత్స్రష్ట, మహావైభవాన్ని కలిగించేవాడు, మహాబలవంతుడు, సర్వకార్య సమర్థుడు, సర్వజీవుల అంతర్యామియై జీవింప చేసేవాడు, మిక్కిలి బలసంపన్నుడు, స్మరింపదగినవాడు, సకాలంలో తన భక్తులను స్మరించేవాడు, భక్తుల మొరలాలకించేవాడు, అనేక రూపాలు ధరించేవాడు, విశిష్టమైన కార్యాలను చేసేవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

ఆశ్రితులను రక్షించుటయందు మనస్సు లగ్నం చేసేవాడు. న్యాయనిర్వాహకుడు, సమదృష్టి కలవాడు, సాటిలేనివాడు, లోక సంగ్రహార్థం హోమం చేసేవాడు, యజ్ఞనిర్వాహకుడు, మహావక్త, వేదాలను బోధించినవాడు, క్రీడాలోలుడు మననశీలి, దుష్టులను సంహరించేవాడు, అభీష్టాలను ప్రసాదించేవాడు, సంపదలను చేకూర్చువాడు, జగత్తుకు తల్లియైనవాడు, జగన్నియంత, జగత్తును నియమించేవాడు, అనంత వైభవం కలవాడు, సకల లోకసంరక్షకుడు, జనులను సంరక్షింపచేసేవాడు. సర్వసంహర్త, ధర్మాన్ని జాగృతం చేసేవాడు, జగత్పతి, సృష్టిస్థితి లయ కార్యములు చేసేవాడు, తన ఉనికిచేత వేంకటాచలాది స్థలాలను దివ్యక్షేత్రాలుగా చేసినవాడు, శరీరాన్ని ప్రసాదించేవాడు, క్షేత్రజ్ఞుడు, ఆత్మస్వరూపం తెలిసినవాడు, సర్వజీవుల శరీరము నందు నివసించేవాడు, పుణ్యక్షేత్రాలలో వెలసినవాడు, అయిన శ్రీనివాసునికి నమస్కారము.

శరీరాన్ని హరించేవాడు, క్షేత్రప్రియుడు, సర్వలోకాలకు క్షేమం కలిగించేవాడు, ప్రాణస్వరూపుడు, భక్తిని కలిగించేవాడు, మోక్షాన్నిచ్చేవాడు, శక్తిని ప్రసాదించేవాడు, యోగప్రదుడు, సర్వశక్తి సమన్వితుడు, ముత్యాలమాలను ధరించినవాడు, వేదస్వరూపుడు, వేద సూక్తాలచే పొందదగినవాడు, ధనుంజయుడు, ధనాధ్యక్షుడు, ధనికుడు, ధనాధిపతేయైన కుబేరునికి అధిపతి, మహాధన సంపన్నుడు, మహాపూజ్యుడు, దుర్యోధనునిచే అవమానింపబడినవాడు, రత్నాకరుడు, గుణసముద్రుడు, రత్నాలవలె ప్రకాశించేవాడు, రత్నగర్భయైన భూదేవికి ఆశ్రయమైనవాడు, పవిత్రుడు, రత్నసానువైన మేరుపర్వతం నిధిగా కలవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

కిరీటంలోని మణుల ప్రకాశంతో విరాజిల్లేవాడు, రత్నకంకణాలు ధరించినవాడు, యోగుల హృదయాంతరాళములలో దర్శింప తగినవాడు, హృదయంలో ధ్యానం చేయతగినవాడు, మనస్సులో అభ్యాసంచేత స్మరింపదగినవాడు, జయంతో కూడిన ఆసనం కలవాడు, భక్తుల హృదయాంతరంగుడు, దయాశాలి, మాయను జయించి దానిని తనలో యిముడ్చుకున్నవాడు, మహాసముద్రంవలె అతిగంభీరుడు, సరసుడు, రసికుడు, సిద్ధి

స్వరూపుడు, భక్తులకు వశుడు, సదా భక్తులను రక్షించేవాడు, అందరిచేత పొందదగినవాడు, అయిన శ్రీవేంకటేశ్వరునికి నమస్కరిస్తున్నాను.

అపమృత్యువును నివారించి ఆయుష్షును ప్రసాదించేవాడు, గొప్ప ఆయుష్షు కలవాడు, దివ్యతేజశ్శాలి, ఓషధులకు అధిపతి, అష్టైశ్వర్య సంపన్నుడు, అష్టమహిషీ ప్రియుడు, అష్ట సిద్ధులు కలవాడు, అష్టపరాయణుడు, కీర్తి వ్యాపించిన వాడు, శరణాగతులను రక్షించే వ్రతదీక్షాపరాయణుడు, ఎనిమిది దిక్కులందు వ్యాపించినవాడు, హిరణ్మయ పురుషుడు, శివస్వరూపుడు, అష్టదిక్పాలకులకు అధిష్ఠాన దేవత, త్రిమూర్తి స్వరూపుడు, నిద్రలేనివాడు, సదా జాగరూకుడు, స్వప్నగోచరుడు, స్వప్నరూపుడు, మంచికలలకు సత్ఫలితములిచ్చేవాడు, దుస్స్వప్నములను ధ్వంసం చేసేవాడు, అపశకునములను పోగొట్టేవాడు, శుభములు కలిగించేవాడు, బంగారం వంటి శరీర కాంతిగలవాడు, గౌరవింపదగినవాడు, వేదాలలో బహు విధాలుగా వర్ణింపబడినవాడు, వర్ణవ్యవస్థకు సుముఖుడు, అయిన వేంకటేశ్వరునికి నమస్కరిస్తున్నాను.

సువర్ణ ముఖరీతీరంలో శివునిచే ధ్యానించబడిన పాదపద్మములు కలవాడు, దాక్షాయణి మాటలకు సంతృప్తి చెందినవాడు, దుర్వాసమహర్షికి దర్శనమిచ్చినవాడు, అంబరీషుని వ్రతమునకు ప్రీతిచెందినవాడు, హిరణ్య కశిపుని శరీరాన్ని చీల్చినవాడు, గొప్ప అభిచారక్రియలను ధ్వంసంచేసేవాడు, చేతబడులను పోగొట్టేవాడు, కాళియ మర్దనుడు, కాలసర్ప యోగభయాన్ని పోగొట్టేవాడు, మనోహరరూపుడు, శుభదర్శనుడు, నీలమేఘ శరీరుడు, శ్రీమంత్రం (అష్టాక్షరీమహామంత్రం) చేత భావింపబడేవాడు, బంగారు తామరల సరసులో స్నానం చేసేవాడు, శ్రీదేవి మనస్సులో భావించిన దివ్యాకృతిగల శ్రీనివాసునికి నమస్కారం.

లక్ష్మీదేవి సమర్పించిన పద్మమాలాధారి, శ్రీదేవితో క్రీడించేవాడు, తన వక్షఃస్థలంలో శ్రీదేవి నిధిగా కలవాడు, స్వయంభువు, సంపదప్రదాత, వామనావతారాన్ని ధరించినవాడు, రమాపతి, చతుర్భుజుడు, నిత్యతృప్తుడు, భక్తులచేత తృప్తి పొందించబడేవాడు, పుణ్యతీర్థాలలో స్నానం చేసేవారికి సౌఖ్యాలనిచ్చేవాడు, అగస్త్యమహర్షి చేసిన స్తుతితో సంతోషించినవాడు, ఇంద్రియాలకు కనపడనివాడైనను భక్తుల కొరకు శ్రీనివాసుని రూపంలో దర్శనమిస్తున్నవాడు అయిన వేంకటేశ్వరునికి నమస్కారము.

కపిలవర్ణపు తేజస్సు కలవాడు, కపిలమహర్షి రూపం ధరించినవాడు, పవిత్రజలాలలో స్నానం చేసినవారి పాపాలను ధ్వంసం చేసినవాడు, ధర్మవరాహ రూపుడు, ఆంజనేయుని హృదయంలో నిలచినవాడు, అగ్నిదేవునికి ప్రియం చేసినవాడు, తానే ముఖ్య పురుషార్థంగా భావించ బడేవాడు, జనలోకాలను సృష్టించినవాడు, అగ్నిహోత్రుని వలె వెలుగొందే వాడు, అగ్నితేజస్వి, మంగళకరమైన కోర్కెలు తీర్చేవాడు, యమధర్మరాజును కూడా నియమించినవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

సముద్రంలో నివసించేవాడు, భూమ్యాకాశాలు ఆవరించిన వాడు, వరుణదేవుడు, గజేంద్రునిచే ఆరాధించబడిన వాడు, వాయుదేవుడు కల్పించిన మేరు పుత్రుడైన వేంకటాచలంపై నివసించేవాడు, వాయు పుత్రుడైన వేంకటాచలంపై నివసించేవాడు, వాయు దేవుని అనుసరించినవాడు, ప్రాణవాయువులతో జగత్తును భరించేవాడు, ప్రళయకాలంలో యమధర్మరాజునుకూడాఅంతమొందించేవాడు,గొప్పవంశంలో పుట్టినవాడు, తన భక్తులకు యమలోకాన్ని నివారించేవాడు, వాయు దేవుని అనుసరించిన వాడు, ప్రాణవాయువుతో జగత్తును భరించేవాడు, ప్రళయ కాలంలో యమ ధర్మరాజును కూడా అంత మొందించేవాడు, గొప్ప వంశంలో పుట్టినవాడు, తన భక్తులకు యమలోకాన్ని నివారించేవాడు, జితేంద్రియులలో అగ్రగణ్యుడు, ఇంద్రియనిగ్రహం కలవాడు, యమునిచేత పూజింపబడే వాడైన వేంకటేశ్వరునికి నమస్కారము.

ఇంద్రోద్యాన సమీపంలో ఉన్నవాడు, ఇంద్రునిచే చూడబడినవాడు, సర్వలోక ప్రభువు, కుబేరుని సరోవరతీరంలో నివసించేవాడు, అక్షయమైన నిధులు గల ధనాగారాన్ని ఏర్పరచినవాడు, స్వామి పుష్కరిణీ తీరంలో నివసించేవాడు, కుమారస్వామిచే ధ్యానించబడినవాడు, సుధా సముద్రంవలె క్షయము చెందనివాడు, వరాహాది అష్ట తీర్థములచే సేవించబడిన పాదపద్మములు గలవాడు అయిన శ్రీనివాసునికి నమస్కారము.

పాండవతీర్థం జలాలతో అభిషేకింపబడిన దేహం కలవాడు, ధర్మ రాజుకు వరాలనిచ్చినవాడు, భీముని అంతఃకరణంలో(హృదయంతో) అధిష్ఠించినవాడు, అర్జునుని స్నేహితుడు, నకులునికి అభయమిచ్చినవాడు, మాద్రిచేత, సహదేవుని చేత నమస్కరింపబడినవాడు, ద్రౌపదీదేవి శపథాన్ని నెరవేర్చినవాడు, కుంతీదేవి చేసిన స్తోత్రంతో సంతోషించిన వాడు, సంసార తాపాన్ని అణచేవాడు, నిగ్రహానుగ్రహసమర్థుడు అయిన వేంకటేశునికి నమస్కారం.

నారదాది మహర్షులచే స్తుతింపబడినవాడు, లోకసంగ్రహార్థం నిత్యకర్మలు చేసేవాడు, తన అవ్యక్త రూపాన్ని భక్తులకు చూపించేవాడు, వీణానాదంతో సంతోషించేవాడు, దేవతీర్థం వద్ద ఆశ్రమం కలవాడు, బిల్వాలతో నిర్మలమైన జలాలలో స్నానం చేసేవాడు, సరస్వతీ తీర్థంచే సేవించబడేవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

తుంబురు తీర్థంలోని నీటి స్పర్శతో భక్త జనుల చిత్తంలోని

అజ్ఞానాన్ని పోగొట్టేవాడు, మత్స్య–వామన– కూర్మాది తీర్థాలకు అధిపతి, పురాణాలను ధరించేవాడు, సుదర్శనునిచే ధ్యానించబడే పాదపద్మాలు కలవాడు, శంఖుడనే రాజుచేత, పూజింపబడిన పాదములు కలవాడు, రామ తీర్థంలో విహరించేవాడు, బలరామునిచేత ప్రతిష్ఠింపబడినవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

పరశురామ సరస్సులోని తీర్థజలసేచనంతో తృప్తి పొందింపబడిన వాడు, పాపనాశన తీర్థ జలాలలో యథావిధిగా స్నానం చేసేవారి పాపాలను నశింపజేసేవాడు, ఆకాశగంగా జలములచే అభిషేకింపబడినవాడు, (శేష) నాగతీర్థం జలంతో అభిషేకించబడేవాడు, కుమార తీర్థం వద్ద ఉన్నవాడు, వటువేషధారి, అప్పుడు ముంజెత్రాడు ధరించినవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

వృద్ధుని కుమారునిగా చేసినవాడు, పరమ సౌందర్యరూపి, సుఖస్వరూపుడు, ప్రియంగా మాట్లాడేవాడు, ప్రళయ కాలంలో పధ్నాలుగు లోకాలను యిముడ్చుకోగల గొప్ప ఉదరం కలవాడు ఇక్ష్వాకుల నందనుడు, కర్రి ఆవుల క్షీరధారలతో అభిషేకించబడి ఆవిర్భవించినవాడు, వరాహచలాధిపతి, భరద్వాజ మహర్షి వలన విఖ్యాతి చెందినవాడు, బృహస్పతిచేత విశేషంగా గౌరవించబడినవాడు, అంజనాదేవి చేత ఆరాధించబడినవాడు, ఆంజనేయుని హస్తములచే అర్చించబడినవాడు, అంజనాద్రిపై నివసించేవాడు, ముంజ గడ్డి వంటి కురులు కలవాడు, శివునికి తాను బాణంగా మారి త్రిపురాసురుల పురములను కూల్చినవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

కిరాత రూపంలో ఉన్న కిన్నరదంపతులకు శాపవిముక్తి కలిగించినవాడు, వైఖానసులచే ఆరంభించబడిన యజ్ఞం కలవాడు, ధర్మముచేత తెలియదగినవాడు, వృషభాసురునికి ధర్శనమిచ్చినవాడు, వృషాచల స్వరూపుడు, వృషభాసురుని దేహాన్ని ఛేదించినవాడు, క్రీడలయందు అనుష్ఠానములయందు ఉత్సాహం కలవాడు, సువర్చలాసుతుడైన విష్వక్సేనుని సర్వసైన్యాధిపతిగా నియమించినవాడు, నారాయణుడనే విప్రునికి ప్రియమైనవాడు, దుర్మేధసుడనే అసురుని చంపినవాడు, మహాప్రజ్ఞాశాలి, బ్రహ్మోత్సవము నందు మహోత్సాహం కలవాడు, భద్రాసురుని శిరస్సు ఖండించినవాడు, భద్రగిరివాసి, భద్రమైనక్షేత్రం కలవాడు, సర్వ శుభాలకు నిలయమైన శ్రీనివాసునికి నమస్కారము.

వేటయందు తరగని ఉత్సాహం కలవాడు, శంఖుడనే రాజుకు తృప్తి కలిగించినవాడు, స్థాణువువలె స్థిరంగా ఉండేవాడు, గరుత్మంతునిపై అధిరోహించి ఆయన చేత గౌరవింపబడేవాడు, పాంచ భౌతికమైన శరీరం లేనివాడు, ఆదిశేషుని దేహంపై స్థిరంగా నివసించేవాడు, బ్రహ్మాది దేవతాగణంచే సదా సేవించబడేవాడు, వేయి సూర్యుల కాంతిపుంజాలతో వెలుగొందే ఆనంద నిలయ విమానంతో విరాజిల్లేవాడు, అసంఖ్యాకములైన ఉత్తమ గుణ సంపన్నుడైన శ్రీనివాసునికి నమస్కారము.

సర్వ సేనాధిపతియైన విష్వక్సేనునిచేత స్తుతింపబడినవాడు, సనకసనందనాదులచేత పరివేష్టింపబడినవాడు, గంగాది నదులచేత సేవించబడేవాడు, దేవేంద్రాదులచే నమస్కరింప బడినవాడు, దేవతాస్త్రీలైన అప్సరసల నృత్యములందు ఆసక్తి కలవాడు, గంధర్వులు మాత్రమే పాడగల గంధర్వగానము నందు ప్రీతి కలవాడు, పున్నమి చంద్రుని వంటి గోళ్ళు కలవాడు, సుకుమారములైన పాదపద్మములు కలవాడైన శ్రీనివాసునికి నమస్కారము.

తాబేలు వంటి ముందరి కాళ్ళు కలవాడు, గుండు మొలలవంటి చీలమండలం కలవాడు, స్వచ్ఛమైన మోచేయి, మోకాళ్ళు కలవాడు, చక్కని చిక్కని స్వర్ణవస్త్రముపై విరాజిల్లుతున్న మొలతాడు కలవాడు, బాగా ప్రకాశించే చురకత్తితో వెలుగొందుతున్న కటి (నడుము) భాగము కలవాడు, శుభములు కలిగించేవాడు, అనంతుడైన బ్రహ్మదేవుడు పుట్టిన పద్మానికి జన్మస్థానమైన నాభి కలవాడు. ముత్యాలమాలలు ధరించినవాడు మందారకుసుమాలు సంపెంగపూల మాలలు ధరించినవాడైన శ్రీనివాసుని నమస్కారము.

రత్నాభరణాలతో నిండినవాడు, భుజముపై వ్రేలాడుచున్న యజ్ఞోపవీతం కలవాడు, పచ్చ కర్పూరం కలిసిన చందన మైపూత కలవాడు, కోరిన వరాలనిచ్చేవాడు, అందరికీ అభయమిచ్చేవాడు. సుదర్శన చక్రాయుధాన్ని ధరించేవాడు, పాంచజన్యమనే శంఖాన్ని ధరించినవాడు, కౌస్తుభమణితో ప్రకాశించేవాడు, శ్రీవత్సమనే పుట్టుమచ్చ వక్షస్థలంలో కలవాడు, లక్ష్మీదేవిచే ఆశ్రయించబడిన విశాలమైన వక్షస్థలము కలవాడగు శ్రీనివాసునికి నమస్కారం.

నల్ల కలువల కాంతిగల శరీరం కలవాడు, ఎర్రతామర వంటి ముఖం కలవాడు, కోటిమన్మథలావణ్య స్వరూపుడు, చల్లని వెన్నెల వంటి చిరునవ్వుతో విరాజిల్లేవాడు, పచ్చ కర్పూరముతో దిద్దబడిన ఊర్ధ్వ పుండ్రము (నామాలు) కలవాడు, నిర్మల స్వరూపుడు, తలపై కిరీటశోభతో విరాజిల్లే వేంకటేశ్వరునికి నమస్కారం.

పద్మపీఠంపై ఉన్నవాడు, పద్మనాభుడు, చంద్రమండల మధ్యవర్తి, ప్రాజ్ఞుడు, సర్వజ్ఞుడు, బుధుడు, తేజోమూర్తియైన అగ్నిమండల మధ్యవర్తి, సూర్యస్వరూపుడు, అఖిలప్రాణులకు ప్రేరకుడు, సవితృ(సూర్య) మండల మధ్యవర్తి, లక్ష్మీపతి, భూదేవిభర్త, వైకుంఠలోకంలో చామరగ్రాహిణులైన విమలాదులచేత పరివేష్టింపబడినవాడు, జగత్కుటుంబములను పుట్టించేవాడు, ఆశ్రితులను రక్షించేవాడు, కోరిన కోర్కెలను తీర్చే శ్రీనివాసునికి నమస్కారం.

బాల్య, కౌమార, యౌవనావస్థలు మూడు మాత్రమే కలవాడు, (నిత్య యువకుడు, వార్ధక్యము లేనివాడు, విశ్వతేజస్స్వరూపుడు, జ్ఞానస్వరూపుడు, తెలియదగినవాడు, జ్ఞానగమ్యుడు, జ్ఞానాతీతుడు, దేవతలనతి క్రమించినవాడు, బ్రహ్మాండానికి లోపల, బయట వ్యాపించి ఉన్నవాడు (అణువుకంటే అణుస్వరూపుడు, మహత్తుకంటె మహత్తరుడు) వేంకటాద్రిపై వెలసిన గదాధరుడైన వేంకటేశ్వరునికి నమస్కరిస్తున్నాను.

**"బ్రహ్మాండాంతర్బహిర్వ్యాప్తో వేంకటాద్రిగదాధరః"**

**-బ్రహ్మాండ పురాణం అధ్యాయం. 12.శ్లోకం.159.**

## ఫలశ్రుతి

వసిష్ఠ మహర్షీ! ఈ విధంగా పరమాద్భుతమైనది, పవిత్రమైనది, పుణ్యాన్ని పెంపొందించే శ్రీవేంకటేశ్వర స్వామివారి సహస్రనామ వైభవాన్ని నీకుపదేశించాను. ఇది తప్పకుండా వినదగినది. దీన్ని విన్నంతమాత్రానే సకల దోషాలు పోతాయి. ఇది రోగాలనన్నింటిని పారదోలుతుంది. మృత్యువును నశింపజేస్తుంది. దారిద్ర్యాన్ని పోగొడుతుంది. ఇది ధర్మ స్వరూపమైంది. సర్వైశ్వర్యాలను ప్రసాదిస్తుంది.

కాలసర్పవిషాన్ని కూడ హరిస్తుంది జ్వరాలు మూర్ఛనలను పోగొడుతుంది. శత్రువులను నశింపచేస్తుంది. రాజ గ్రహపీడలను నివారిస్తుంది. బ్రహ్మరాక్షసి కూష్మాండ భేతాళాది బాధలను పోగొడుతుంది. విద్యలు కోరేవాడు విద్యావంతుడవుతాడు. ధనం కోరేవాడు ధనవంతుడవుతాడు. ఆయుష్షు కోరేవాడు మహాకీర్తిమంతుడై అనంత కల్పకాలం జీవిస్తాడు.

ఈ సహస్రనామాన్ని పఠించడం వలన పుత్రులను కోరేవారు గుణవంతులు, ఆయుష్మంతులు అయిన పుత్రులను పొందుతారు యుద్ధంలో శత్రువులను జయిస్తారు. సభలలో ప్రతివాదులను జయిస్తారు. ఈ దివ్యసహస్ర నామాలతో తులసీదళాలతో ఒక్కసారి వేంకటేశ్వరుని పూజిస్తే అతడు వైకుంఠవాసియై విష్ణు సన్నిధిలో విష్ణుసారూప్యం పొందుతాడు.

ఒక నెలరోజులు కలువ పూలతో స్వామివారిని పూజిస్తే అతడు రెండవ కుబేరుడవుతాడు. నల్లకలువలతో పూజిస్తే అతడు ఎల్లప్పుడు రాజులందరిచేత పూజలందుకొంటాడు. ఈ సహస్రనామాలను భక్తితో హృదయంలో పదిల పరచుకొనేవారికి శ్రీహరి సాక్షాత్కరిస్తాడు. కోరిన కోర్కెలు నెరవేర్చి వైకుంఠప్రాప్తిని కలిగిస్తాడు.

ప్రతిరోజు మూడు పూటలా సర్వవ్యాపకుడైన శ్రీనివాసుని యథావిధిగా అర్చించి, మూడు పర్యాయాలు, కాని, అయిదు పర్యాయాలు కాని క్రమం తప్పకుండా నియమంతో ఈ సహస్ర నామాలను జపిస్తే, వారికి ఒక నెలలోపల దారిద్ర్యం నశిస్తుంది. రెండు నెలల్లో అతడు రాజవుతాడు. మూడు నెలల్లో గొప్ప ఐశ్వర్యం లభిస్తుంది. ఆ తరువాత సాక్షాత్తు భగవంతునితో సంభాషించే మహాభాగ్యం కలుగుతుంది.

ఈ నామాలను ఒక నెలరోజులు పఠించడం వలన అరకొరగా నిలిచిపోయిన పనులు పూర్తవుతాయి దారితప్పినవాడు మంచిదారిలోకి వస్తాడు. ధనం కోల్పోయినవాడు తిరిగి తన ధనాన్ని పొందుతాడు. చపలచిత్తునికి చపలత్వంపోయి అతని మనస్సుకి స్వస్థత చేకూరుతుంది. వీటిని పఠించుట వలన దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, ఐశ్వర్యం, జ్ఞానం, మోక్షం కలుగుతాయి. వారి కోరికలన్నీ సఫలమవుతాయి. శాశ్వతమైన వైకుంఠపదం సిద్ధి స్తుంది ఇది ముమ్మాటికీ సత్యం ఇందుకే మాత్రం సందేహం లేదు. అని నారదమహర్షి వశిష్ఠ మహర్షికి శ్రీవేంకటేశ్వర సహస్రనామ వైభవ విశేషాలను వివరించాను.

**ఏవం శ్రీవేంటేశస్య కీర్తితం పరమాద్భుతమ్ ।**
**రామ్నాం సహస్రం సంశ్రావ్యం పవిత్రం పుణ్యవర్ధనమ్ ॥**
**శ్రవణాత్సర్వదోషఘ్నం రోగఘ్నం మృత్యునాశనమ్ ।**
**దారిద్ర్యభేదనం ధర్మ్యం సర్వైశ్వర్యఫలప్రదమ్ ॥**
**సర్వా న్కామా నవాప్నోతి శాశ్వతం చ పదం తథా ।**
**సత్యం సత్యం పునస్సత్యం సత్యం సత్యం న సంశయః ॥**

**-బ్రహ్మాండపురాణం. అధ్యాయం.12.శ్లోకాలు.160,161,172.**

**శ్రీవేంకటాచల మహాత్మ్యంలోని**
**బ్రహ్మాండపురాణ భాగము సమాప్తం**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

### 79వ కళ్యాణం

తేది 23-05-2025 శుక్రవారం నాడు జరిగింది. ప్లాట్ నెం.96, లక్ష్మీనగర్ కాలనీ, బోడుప్పల్, హైదరాబాదులో శ్రీమాన్ సామ వేంకటరెడ్డి, ఉమారాణి దంపతులు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా జరిగింది.

ధారావాహికం

# శ్రీ కృష్ణ తత్వం

**- రాళ్ళబండి శ్రీనివాసన్**



**గత సంచిక తరువాయి**

తరువాత సభలో వున్న పరశురాముడు కణ్వమహర్షి ఇంకా నారదమహర్షి దుర్యోధనునికి హితోపదేశం చేసారు. అయితే ఆ మూర్ఖుడు వారి మాటలు వినలేదు.

యుద్ధం తప్పదు. నీవు వీరశయనాన్ని పొందుతావు అంటూ సుయోధనుని హెచ్చరించాడు కృష్ణుడు. వెంటనే దుశ్శాసనునితో కలిసి సభలో నుంచి వెళ్లిపోయాడు దుర్యోధనుడు.

తదనంతరము శంఖ చక్ర గదా శారజ్ఞ శక్తి నందకాది దివ్యమైన ఆయుధాలు కృష్ణ భగవానుని చేరాయి. అనేకానేక బాహువుల్లో అనేక దివ్యాయుధాలునూ వెలిసాయి. తరువాత నేత్రాల నుంచి ముక్కుపుటాల నుంచి ఇక చెవులలో నుంచి ధూమసహితమైన అగ్నులు ఉద్భవించాయి. అలాగే కృష్ణభగవానుని ప్రతి రోమ కూపాలలో నుంచి కూడా సూర్యకాంతుల్లాంటి భయంకర జ్వాలలు ఆవిర్భవించాయి.

కృష్ణ భగవానుని ఆ భయంకరమైనట్టి ఆకృతిని చూడడానికి దివ్య దృష్టిని ప్రసాదించగానే భీష్మ ద్రోణ విదుర సంజయులునూ మరి మహర్షులునూ తప్ప మిగిలిన వున్నటువంటి రాజన్యులునూ దుర్యోధనాదులునూ ఆ భగవద్రూపమును ఎవ్వరేగానీ దర్శించలేకపోయారు. ఆ సమయంలో అంతరిక్షం నుంచి దేవ దుందుభులు మోగాయి. పుష్పవృష్టి కురిసింది.భూమి కంపించింది. సముద్రాలు క్షోభించాయి.

తరువాత కృష్ణ భగవానుడు తనదైన దివ్యాద్భుతమైన విశ్వరూపమును ఉపసంహరించుకున్నాడు.

కృష్ణ భగవానుని విశ్వరూప సమయంలో కొలువులో ఏర్పడిన కలకల ధ్వనిని విన్నాడు గుడ్డిరాజు. అది గోపాలదేవుని విశ్వరూప ప్రదర్శనమని వూహించాడు.

**కరుణింపుము సంశ్రితభయ హరణా**
**ధురీణా !సహింపుమజ్ఞానంబున్**
**శరణంబు వేడద భవచ్చరణంబులు**
**కనుగొనం ప్రసాదింపగదే**

వాసుదేవా కృష్ణా! ఆశ్రితుల భయాన్ని పొగొట్టేవారిలో నీవు అగ్రేసరుడవు. నన్ను దయగల మనసుతో చూడు. నాలో వున్న అజ్ఞానాన్ని మన్నించు. నిన్నే శరణు వేడుతున్నాను. నీ పాదాలను దర్శించగల భాగ్యాన్ని అనుగ్రహించు.

అపుడు దయార్ద్ర హృదయుడైనట్టి ఆ దేవదేవుడు గుడ్డిరాజుకు దివ్యదృష్టిని ప్రసాదించాడు. ఇక ధృతరాష్ట్రుడు చూసాడు. పురుషోత్తమా! కృష్ణా! ధన్యుడనయ్యాను. నిన్ను చూసినట్టి ఈ కన్నులతో ఇతరులను చూడడానికి ఇష్టపడను. నీవు ఇచ్చిన ఈ చూపును నీవే వెనక్కి తీసుకోవయ్యా అన్నాడు.

తరువాత కృష్ణ భగవానుడు తిన్నగా విదురుని ఇంట్లోని కుంతీదేవిని కలిసాడు. అక్కడ కౌరవ సభలో జరిగిన విషయాలన్నింటినీ చెప్పాడు. అయితే సంధి కుదరకపోవడమే మంచిది. ఇక క్షత్రియ జాతికి వీరవృత్తి తగినదేనని-మళ్లీ ఇలా అంటోంది ఆమె.

**మరచిరె కొలువున ద్రౌపదిన్ పరచిన బన్నంబు?**
**ధర్మపథము తొరంగున్**
**వెరచుటకప్పటి కది తగున్ చెరచినచో**
**వెదక వలదె చిరతర కీర్తిన్?**

కౌరవుల నిండు సభలో పాంచాలిని అవమానించడము-నా కుమారులు మరచిపోయారా? మరి ధర్మమార్గాన్ని వదలడానికి అపుడు ఆవిధంగా జంకినారు. అందుకు అడవులకు వెళ్లడం యుక్తమే గానీ- న్యాయంగా రావాల్సిన అర్థరాజ్యాన్ని ఇవ్వకుండా తమకు తామే లాక్కోవడం- కౌరవులు ధర్మవినాశానికి పూనుకున్నపుడు- ఇక శాశ్వతమైన కీర్తిని పొందడానికి ప్రయత్నం చేయవద్దా? (పాండవులు)

కుం తీదేవితో మాట్లాడిన తరువాత కృష్ణ భగవానుడు దుర్యోధనుని ప్రాణమిత్రుడైన కర్ణుడిని కలవడానికి వెళ్లడం అనేది ఒక భేదోపాయప్రయోగం అనే చెప్పాలి. అక్కడ కర్ణుని జన్మ వృత్తాంతం చెప్పాడు. రాజ్యాన్ని ఎరగా చూపించాడు. అదేమీ సఫలం కాలేదు. అయితే యుద్ధంలో జరగబోయే పరిణామాలను అంగీకరించాడు కర్ణుడు. ఇక తన వంతు బాధ్యతగా దుర్యోధనుని పక్షాన నిలబడతానని– పోరాడుతానని చెప్పాడు.

**అయితే తిక్కన భారతంలో మూలంలో లేని విధంగా**
**కృష్ణుడు కర్ణునితో అన్నట్లు వుంది.**

**పాంచాలరాజపుత్రియు సంచితముగ**
**నిన్ను పొందు ఆరవ వరుసన్**
**సంచితపుణ్యుడవు ఒక ఇంచుకయును.**
**వేరుచేయక ఏతెమ్మెలన్**

కర్ణా! పాంచాలి ఐదుగురితో పాటుగా నిన్ను ఆరవ భర్తగా ఆప్యాయముతో స్వీకరిస్తుంది. పుణ్యాత్ముడవైన నీవు ఏవిధమైన భేదభావమనేది లేకుండానే సంతోషంతో మరి పంచ పాండవులతో కలిసిపోవడానికి రా–రమ్ము.

దుర్యోధనుడు పాండవుల సమీపానికి ఉలూకుని దూతగా పంపాడు. అనేక విధాలుగా దుర్భాషలాడినాడు. కృష్ణుని విశ్వరూప ప్రదర్శనం అనేది కేవలం మాయాజాలం అని రాబోయే యుద్ధంలో పాండవులు తమ బలపౌరుషాలని చూపాలన్నాడు. బుద్ధి పూర్వకంగా తాను పాండవుల రాజ్యభాగాన్ని ఇవ్వలేదని తీవ్రమైన ఆక్షేపణలతో అటు కృష్ణుని ఇటు పాండవుల మనసులు నొప్పించాడు. అది మరి దుర్యోధనుడు తనకు తానే స్వయంగా సమరానికి ఉసికొల్పాడని ఉలూకుని మాటలలో స్పష్టమైంది. దానికి కృష్ణ భగవానుని సందేశం ఇది–––

**మన్యసే యచ్చ మూఢ! త్వం న యోత్స్యతి జనార్దనః ।**
**సారథ్యేన వృతః పార్థైఃఇతి త్వం న బిభేషిచ ।**
**జఘన్యకాలమప్యే తన్నభవేత్ సర్వపార్థివాన్**
**నిర్దహేయ మహం క్రోధాత్ తృణానీవ హుతాశనః ॥**

ఓ మూఢుడా! విను. జనార్దనుడు యుద్ధం చేయడు. పాండవుల చేత సారథిగా ఎన్నుకోబడ్డాను అని నీవు భయపడడం లేదు. నా క్రోధ జ్వాలలతో సర్వరాజలోకాన్నీ దహించే ...

కురుక్షేత్రంలో కౌరవ పాండవుల సేనలు సమరానికి సంసిద్ధమైనాయి. అర్జునుడు బంధుమిత్రులను చంపేసి– విజయం సాధించినప్పటికీ రక్తపుకూడు తినలేనని శోకమోహాలతో కృంగిపోయి– రథంలో చతికిలపడ్డాడు.అపుడు ఇక కృష్ణ భగవానుడు అర్జునునకు గీతోపదేశం చేసాడు.ఏ అవతారంలో ఏ ఉపదేశం చేయని స్వామి ఈ కృష్ణావతారంలో అర్జునుని సాకుగా పెట్టుకుని సర్వ మానవాళికి ఉపదేశించాడు.

యుద్ధంలో కురువృద్ధుడు భీష్ముడు విజృంభించాడు. పాండసేనను చీల్చిచెండాడు. అర్జునుని శరపరంపరతో గాయపరిచాడు. అది చూసి కృష్ణ భగవానుడు రథంనుంచి దూకి భీష్ముని సంహరించాలని ఉరికాడు.

ఆ దృశ్యాన్ని సంస్కృత భాగవతంలో–భారతంలో కంటే పోతన భాగవతంలో అద్భుతంగా సుందరంగా వర్ణింపబడింది.

కృష్ణ భగవానుడు రథం నుంచి దూకిన వీరగంభీరస్వరుపాన్ని చూసి భీష్ముడు ఈవిధంగా అంటున్నాడు–––

**కుప్పించి ఎగసిన కుండలంబుల కాంతి**
**గగనభాగంబెల్ల కప్పికొనగ**
**ఉరికిన ఓర్వక ఉదరంబులో నున్న జగముల**
**వ్రేగున జగతి కదల**
**చక్రంబు చేపట్టి చనుదెంచు రయమున**
**పైనున్న పచ్చని పటము జార**
**నమ్మితి నాలావు నగుబాటు చేయక మన్నింపుమని**
**క్రీడి మరల దిగువ**
**కరికి లంఘించు. సింహంబుకరణి మెరిసి**
**నేడు భీష్ముని చంపుదు నిన్ను గాతు**
**విడువుమర్జున యనుచు మద్విశిఖ వృష్టి**
**తెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు.**

కుప్పించి పైకెగరినపుడు శ్రీకృష్ణుని కుండలాల కాంతులు– ఆకాశమండలం నిండా వ్యాపించాయి. మరి ముందుకు దూకినపుడు బొజ్జ లోని ముల్లోకాల బరువును భరించలేక అపుడు భూమి కంపించింది. చేతిలో చక్రాన్ని ధరించి వస్తున్న వేగానికి పైనున్న బంగారు పైపంచ జారిపోయింది. నమ్ముకున్న నన్ను నలుగురిలో నవ్వులపాలు చేయవద్దు.

యుద్ధం సమయంలో కృష్ణ భగవానుని సమగ్రమైన స్వరూప స్వభావాలను పరిశీలిస్తే– అటు మనుష్యత్వం ఇటు దైవత్వం రెండూ కొట్ట వచ్చినట్లుగా కనిపిస్తాయి. ధర్మం దానంతట తాను విజయాన్ని సాధించి ఇవ్వదు. మనం ధర్మంతో సాధించి తీరాలి. ముల్లును ముల్లుతోనే తీయాలి. మంచిని మంచితో, చెడును చెడుతోనే ఎదుర్కోవాలి.

భీష్మద్రోణ సైంధవ కర్ణాదుల వధలోకృష్ణ భగవానుని చతురత ఎంతో తేటతెల్లమవుతుంది. ఖాండవ వన దహన సందర్భంలో అశ్వసేనుడనే నాగుడు తప్పించుకుని– అర్జునునిమీద పగతో కర్ణుని అంబులపొదిలో బాణంలా చేరాడు.

ఇక యుద్ధంలో కర్ణుడు నాగాస్త్రాన్ని ప్రయోగించాడు. పార్థునికి మరణము తప్పదని ఇంద్రుడు భయపడ్డాడు. ఆ అస్త్రం మహా వేగముతో రావడాన్ని చూసాడు కృష్ణదేవుడు. అంత కంటే వేగంగా తన పాదంతో తన రథాన్ని తొక్కాడు. అది కొద్దిగా భూమిలోనికి దిగింది. గుర్రాలు కూడా మోకాళ్ల మీద నిలిచాయి.

**(సశేషం)**

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ

ధారావాహికం



గత సంచిక తరువాయి

## శ్రీవారి ప్రసాద విశేషాలు - శ్రీవారి భోజన ప్రియత్వం

శ్రీవారు అలంకార, పుష్ప, సంకీర్తన ప్రియుడే కాదు, నైవేద్య ప్రియుడు కూడా. ఆనందనిలయుడైన శ్రీనివాసుడు ఆరగించే లెక్కకు మిక్కిలిగా ఉన్న పిండివంటలను, దివ్యాన్నాలను లెక్కపెట్టలేక తికమక పడ్డ తెనాలి రామలింగ మహాకవి ''తిండిమెండయ్య గారు'' అని తిరుమలేశునికి ఒక బిరుదు తగిలించి ఆ స్వామివారి భోజన ప్రియత్వాన్ని చాటిచెప్పాడు.

''ఇందిర వడ్డించ ఇంపుగను'' అంటూ అన్నమయ్యా, ''పాలు, వెన్న, బకాళాబాతు'' అంటూ మరొక కవి, ఇలా ఎందరెందరో కవులు తిరుమలేశుని భోజన ప్రియత్వాన్ని ఎలుగెత్తి చాటారు.

## శ్రీవారికి మడులు మాన్యాలు

శ్రీవారి నివేదనకు నాటి రోజుల్లో ఎందరో చక్రవర్తులు, సామాన్యులు మడులూ, మాన్యాలూ సమర్పించారు. ఆ విధమైన మాన్యాలు తిరుపతి పరిసరాల్లోనూ, చిత్తూరుజిల్లా అంతటా, ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సుదూర ప్రాంతాలలోను ఈనాటికీ లెక్కలేనన్ని ఉన్నాయి. అయితే శ్రీవారి భక్తుల హృదయాలను కలచివేసే విధంగా ప్రసాదాల రూపంలో తరతరాలుగా కోట్లాది భక్తుల ఆకలి తీర్చిన మరెన్నో మాన్యాలు వివిధ పాలకుల హయాంలో అన్యాక్రాంతం అయ్యాయి కూడా. మిగిలివున్న వాటిని పదిల పరచుకోవాల్సిన బాధ్యత తి.తి.దే సంస్థదే కాదు, ఆ అంతులేని ఆధ్యాత్మిక, చారిత్రాత్మక సంపదకు వారసులమైన మన అందరిదీ కూడా.

## భక్తుల ఆకలి తీర్చిన ప్రసాదాలు

శ్రీవారి ఆలయంలో గోడలనిండా ఉన్న శాసనాలలో ఎక్కువ భాగం ఏయే రాజులు, ఏయే ప్రసాదాలకు, ఎంతెంత రొక్కం చెల్లించారో, ఎన్నెన్ని మాన్యాలు ఇచ్చారో లాంటి వివరాల గురించే ప్రస్తావించాయి. తిరుమల కొండపై ఏవిధమైన హోటళ్ళు, ఇతరత్రా భోజన ఏర్పాట్లు లేని ఆ రోజుల్లో ఈ ప్రసాదాలే సుదూర ప్రాంతాల నుండి వచ్చి తిరుమలను సందర్శించుకునే యాత్రికుల క్షుద్బాధను తీర్చేవి. యాత్రికుల సంఖ్య పెరిగేకొద్దీ ప్రసాదాల పరిమాణం కూడా పెరుగుతూ వచ్చింది. ఈనాడు తిరుమలలో, ప్రసాదాలు భోజనాల నిమిత్తం జరిగే వంట ఏర్పాట్లు ప్రపంచ స్థాయిలో ఉంటాయంటే అతిశయోక్తి కాదు. దేవాలయానికి వచ్చిన ఏ భక్తుడూ ఆకలితో లేదా అర్థాకలితో తిరిగి వెళ్ళరాదనే హిందూ సంప్రదాయం తిరుమలలో అనూచానంగా పాటించబడుతోంది.

## శాస్త్రోక్తంగా వంటలు

వంటవారు ''వైఖానస ఆగమ సాంప్రదాయానికి'' గానీ, ''పాంచరాత్ర ఆగమ సంప్రదాయానికి'' గాని చెంది ఉండాలి. వైఖానసాన్ని గురించి ఇంతకుముందే చెప్పుకున్నాం. ''పాంచరాత్ర సంప్రదాయం'' అనగా – హయవదనుడనే రాక్షసుడు బ్రహ్మ నుండి వేదాలను తస్కరించి సముద్ర

గర్భానికి వెళ్ళి దాక్కున్నప్పుడు, వేదాలు మరియు అందులో పొందుపరచబడిన మంత్రాలు అందుబాటులో లేనందున, అయిదు రాత్రుల పాటు దేవతలంతా మంత్రం బదులుగా, తంత్రంతో విష్ణువుకు పూజ చేశారు. ఆ అయిదు రోజులు ఒక ప్రత్యేక పద్ధతిలో భగవదారాధన జరిగింది కావున ఆ పూజా విధానానికి ''పాంచ రాత్రమ''నే పేరొచ్చింది. వేదాలను అసురుల నుండి రక్షించిన ''వేదనారాయణ స్వామి'' వారి అత్యద్భుతమైన ఆలయాన్ని తిరుపతి సమీపంలో ఉన్నా ''నాగులాపురం'' అనే గ్రామంలో నేడు మనం చూడవచ్చు.

శ్రీవారి అర్చా ప్రక్రియలో ఒక ముఖ్య ఘట్టమైన ''భోజ్యాసనం'' అంటే నైవేద్యం సమర్పించే ప్రక్రియ.

విస్తారంగా జరిగే ఈ ప్రక్రియలో ప్రసాదాల వంటలకు సంబంధించి ఖచ్చితమైన విధి విధానాలు, నివేదించే పద్ధతులు, నివేదనా సమయాలు, జరగవలసిన ఉపచారాలు, వంటలో ఉపయోగించే దినుసులు, వాటి నిష్పత్తులు మొదలైనవన్నీ తూచా తప్పకుండా పాటిస్తారు.

శ్రీవారికి నివేదించే హవిస్సును (ప్రసాదాలను) గర్భాలయ ప్రాకారానికి ఆగ్నేయ మూలలో ఉన్న ''పోటు'' అనబడే ప్రధాన వంటశాలలో సిద్ధం చేస్తారు. వకుళమాత ఈ వంటశాల గోడకు ఉన్న రంధ్రం లోంచి చూస్తూ, తన కుమారుడైన శ్రీనివాసుని కోసం తయారయ్యే వంటలన్నింటినీ నిత్యం పర్యవేక్షిస్తుంటారు. తల్లి ప్రేమ మరి.

ఈసారి తిరుమల వెళ్ళినప్పుడు ఈ వకుళమాతను కూడా దర్శించుకుందాం.

శ్రీవారి ప్రసాదాల గురించి మొట్టమొదటి 614 వ సంవత్సరానికి సంబంధించిన శాసనం విమాన ప్రాకారంలోని ఉత్తరపు గోడమీద చెక్కబడింది. ఆలయ చరిత్రకు సంబంధించి మనకు లభ్యమైన తొలి శాసనం కూడా ఇదే.

ఈ శాసనంలో తెలిపిన వివరాల ప్రకారం నాలుగు నాళీల (ఒక నాళీ అంటే 16 పిడికిళ్ళు. సుమారు కిలోపైన) బియ్యంతో వండిన అన్నాన్ని కులశేఖరపడి లోపల శ్రీవారికి నివేదన చేయాలి. దీనికోసం ఒక దాత తిరుచానూరు సమీపంలోని పైడిపల్లి అనే గ్రామాన్ని అర్చకులకు దత్తత ఇచ్చారు.

## ప్రసాదాల విక్రయం

తిరుమల ఆలయంలో ప్రసాదాలకు సంబంధించి జనబాహుళ్యానికి అంతగా పరిచయం లేని ఆసక్తికరమైన చరిత్ర ఎంతో ఉంది. ఆలయంలో లభించిన శాసనాల ప్రకారం (శాసనం సంఖ్య 286 టి.టి.) ఆరేడు వందల సంవత్సరాల క్రితం అప్పటివరకూ ఏ దక్షిణ భారత ఆలయంలోనూ లేనివిధంగా శ్రీవారి అర్చకులు, దేవాలయంలో పని చేసే సిబ్బంది, ఇతర రాజోద్యోగులు, శ్రీవారి నైవేద్య కైంకర్య నిమిత్తం భూములను దానమిచ్చారో, ఆయా ప్రసాదాల్లో నాలుగోవంతు వాటా వారికి దక్కేది. ఆవిధంగా వారి హక్కుభుక్తమైన వాటాను ''ప్రసాదక్కరార్''లు అనబడే ప్రసాదం విక్రయదారులకు అమ్ముకునేవారు. అలా వారికి దత్తమైన విక్రయ హక్కులకు సంబంధించి దస్తావేజులను వ్రాయించి, ఆలయ రికార్డుల్లో నమోదు చేసి ఆ లావాదేవీలకు చట్టబద్ధత కల్పించెబడేది. ఆ విక్రేతలు తమకు హక్కుగా సంక్రమించిన నాలుగవ వంతు ప్రసాదాన్ని ఆలయంలో ''ప్రసాదం పట్టెడ'' అనే ప్రదేశంలో ఉంచి భక్తులకు విక్రయించుకునేవారు. ఇలా దేవస్థానం వారి గుర్తింపుతో చట్టబద్ధంగా జరిగే లావాదేవీలు ఉభయతారకంగా ఉండేవి. ఈ ఏర్పాటుతో అప్పట్లోనే విపరీతంగా గిరాకీ ఉన్న ప్రసాదాలను భారీ మొత్తంలో తయారు చెయ్యడం కోసం ఆలయానికి కావలసిన ఆదాయ వనరులు, సాధన సంపత్తులు సమకూరేవి. అలాగే జీతభత్యాలు లేకుండా లేదా అరకొర ఆదాయంతో స్వామివారిని నమ్ముకొని తరతరాలుగా అర్చనలు చేస్తున్న అర్చకులకు, ఆలయంలో ఇతర విధులు నిర్వర్తిస్తున్న చిరుద్యోగులకు స్వల్ప ఆదాయం ఒనగూడేది. నాలుగవ వంతు ప్రసాదం దాతలకు కేటాయించగా, మిగిలిన మూడు వంతుల ప్రసాదంలో దేవస్థాన యాజమాన్యం కొంతభాగం విక్రయించి, మరికొంత భాగాన్ని ఆర్జిత సేవా భక్తులకు వితరణ చేసి, మిగిలిన ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా పంచిపెట్టేవారు. నాలుగోవంతు ప్రసాదం దాతలకు ఇచ్చే ఆనవాయితీ ఈనాడు లేకపోయినా, మొత్తం ప్రసాదంలో కొంత భాగాన్ని భక్తులకు ఉచితంగా పంచిపెట్టి, మిగిలిన దానిని దేవస్థానం వారు నిర్ణయించిన ధరలకు విక్రయించే సాంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. తిరుమలలో ప్రారంభమైన ఈ ''ప్రసాదం హక్కుల విక్రయ'' సంప్రదాయం, తర్వాతి కాలంలో దక్షిణ భారత దేశంలోని అనేక దేవాలయాలకు విస్తరించినట్లు తెలుస్తోంది.

## ప్రసాదాల తయారీకి నిబంధనలు

ప్రసాదాల తయారీకి కొన్ని ఖచ్చితమైన నియమాలున్నాయి.

- వంట చెరకుగా మామిడి, అశ్వత్థ, పలాస వృక్షాల ఎండు కొమ్మల్నే ఉపయోగించాలి. దీనికి వ్యావహారిక పారమార్థం ఏమిటంటే భూగర్భ జలాలు తక్కువగ ఉన్న ప్రాంతాల్లో కూడా ఈ చెట్లు పెరుగుతాయి. ఇలాంటి వృక్షాలను వంట చెరకుగా వాడడం వల్ల, నేలనుండి నీటిని అధికంగా సంగ్రహించే వృక్షాలు పరిరక్షించబడతాయి. నీటి సంరక్షణా పద్ధతుల్ని అప్పట్నించే పాటించేవారన్న మాట.
- పాలుకారే చెట్లనూ, ముండ్ల చెట్లనూ ఉపయోగించరాదు. కట్టెలు కొట్టేవారికి, వంట చేసేవారికి ఏవిధమైన శారీరక

హాని జరగకుండా ఈ కట్టుబాటు.

- నివేదన సిద్ధం చేయడానికి వాడే పాత్రలు బంగారం, వెండి, రాగి, ఇత్తడి లోహాలతో గాని, మట్టితో గాని తయారు చేయబడి ఉండాలి. ఇతరత్రా లోహాలతో తయారు చేయబడ్డ పాత్రలు ఆరోగ్యరీత్యా మంచివి కావని అప్పుడే గ్రహించారు.
- మట్టి కుండలను ఒక మాసం పైబడి వాడరాదు. ఎక్కువకాలం వాడితే మట్టిపాత్రలు అరిగిపోయి, ఎక్కువ వేడి తగిలినప్పుడు పగిలిపోయే ప్రమాదం ఉంది.
- స్వామివారికి సిద్ధం చేసిన ప్రసాదాలను వాసన చూడరాదు – అందుకొరకు వంటవారు ముక్కుకి, నోటికీ గుడ్డ కట్టుకుంటారు. ఒకరకంగా ఇది ఈనాడు మనం నోటికి, ముక్కుకి తగిలించుకుంటున్న ''మాస్కు'' లాంటిదన్నమాట. ఆ విధంగా వంటవారికి ఏమైనా శారీరక అస్వస్థతలుంటే, వారి నిశ్వాస ద్వారా వచ్చే క్రిముల వల్ల ఆహారం కలుషితం కాకుండా ఉంటుంది. ఈ రోజుల్లో మనం ఆపత్కాల పరిస్థితుల్లో మాత్రమే ప్రాధాన్యతనిచ్చే ''శుచి–శుభ్రత''కు ఆ రోజుల్లోనే మన పూర్వీకులు పెద్ద పీట వేశారు. ఈ విషయంలో ఏమాత్రం అశ్రద్ధగా ఉన్నా, ఆ ప్రసాదాలు భుజించే అసంఖ్యాక భక్తులు అనారోగ్యానికి గురవుతారు.
- ఒక పాత్రలో ''ద్రోణం'' (సుమారుగా 7,168 గ్రాములు) కంటే ఎక్కువ అన్నం వండరాదు. ఇంతకంటే ఎక్కువ వండితే, వంటపాత్ర పొయ్యిమీద ఉన్నప్పుడు పాత్రను వేరేచోటుకి తరలించడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతాయి.
- పూర్తిగా పక్వం కానిదీ, వెంట్రుకలు, చెమట, కీటకాలు పడినదీ, మాడినదీ, చల్లబడినదీ అయినటువంటి ప్రసాదాలను శ్రీవారికి నివేదించరాదు. ఇవన్నీ కూడా అనారోగ్యకరం అని మనకు తెలుసు.
- పాత్రలో మిగిలిన అన్నాన్ని నివేదించరాదు. ఆనాడు, ఈనాడు కూడా మనం భుజించగా మిగిలింది అతిథులకు వడ్డించడం హైందవ సంప్రదాయం కాదన్న విషయం మనందరికీ సుపరిచితమే.
- శ్రీవారికి నివేదించే వరకూ ప్రసాదాలపై అన్యుల దృష్టి పడరాదు. నోరూరుతున్న సిద్ధాన్నాలను చూస్తే, భక్తుల ధ్యాస దర్శనానికి ముందే దేవుని మీద నుండి ప్రసాదాల పైకి మళ్ళే అవకాశం ఉంది. ఆ విధంగా ఎన్నో కష్టనష్టాలకోర్చి చేపట్టిన తిరుమల యాత్ర నిష్ఫలం కావచ్చు.

ఇలా కట్టెలు కొట్టేవారు, వంట చేసేవారు, పాత్రలు మోసే పరిచారకులు, నివేదించే అర్చకులు, ఆరగించే భక్తులు, సమస్తమైన వారి క్షేమాన్ని, భక్తుల తిరుమల యాత్రా లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని; శ్రీవారికి అత్యంత శుచి–శుభ్రతలు కలిగిన ప్రసాదాలు నివేదించే లక్ష్యంతో, దాదాపు వెయ్యేళ్ళ క్రితమే ఇంతటి సమగ్రమైన విధి – విధానాలను పొందుపరచిన మన పూర్వీకుల దూరదృష్టికి జోహార్లు.

పూర్వం శ్రీవారి ప్రసాదాలను సిద్ధం చేయడానికి మట్టికుండలను ఎక్కువగా వాడేవారు. మిగతా అన్ని ప్రసాదాలను కులశేఖరపడికి ఇవతల నుండే నివేదించగా, తెల్లవారు ఝామున జరిగే తొలి నైవేద్యంలో మాత్రమే ''మాత్రాన్నం'' (కుమ్మరి భీమన్న అనే మహాభక్తునికి గుర్తుగా అన్నం, గడ్డపెరుగు, శొంఠి, ఉప్పు, వెన్నతో తయారు చేయబడిన పెరుగన్నం) మాత్రం గర్భాలయంలోనికి తీసుకుని వెళ్ళి పగిలిన కొత్తకుండ పెంకులో నివేదిస్తారు. కాబట్టి దాన్ని ''ఓడు ప్రసాదం''గా వ్యవహరిస్తారు.

## ఎన్నిరకాల ప్రసాదాలో!

శ్రీవారి ప్రసాదాన్ని, ప్రముఖంగా ఉపయోగించే దినుసులను బట్టి నాలుగు రకాలుగా విభజించవచ్చు.

1. అన్నప్రసాదాలు బియ్యంతో చేసేటటువంటి ముద్గాన్నం (కట్టెపొంగలి), తింత్రిణీఫల రసాన్నం (చింతపండు పులిహోర), చక్కెరపొంగలి (బెల్లంతో చేసేది), దధ్యోదనం (పెరుగన్నం), తీపి అన్నం (పంచదారతో చేసేది), మారీచ్యాన్నం (మిరియాల అన్నం లేదా ''మొళిహోర''), కదంబం (పులుసన్నం లేదా శాకాన్నం), బకాళా బాతు (మసాలా పెరుగన్నం) మరియు మాత్రాన్నం (అన్నం, గడ్డపెరుగు, శొంఠి, వెన్నతో తయారు చేయబడినది).
2. బెల్లం లేదా చక్కెర ప్రధానంగా గలవి పాయసం, సిరా (కేసరి), చిన్నలడ్డు, పెద్దలడ్డు, ఆస్థానలడ్డు, అప్పం, జిలేబి, మనోహరం (బియ్యం, పెసరపప్పు, నెయ్యి, బెల్లం, మిరియాలతో చేసిన లడ్డు), పోళీలు, సుఖియం (పూర్ణం బూరెలు), బెల్లం దోసె, అమృతకలశం (బియ్యంపిండి, బెల్లం, నెయ్యి, మిరియాలతో చేసేది) మరియు కొలువు ప్రసాదం (నల్లనువ్వులు, బెల్లం, శొంఠి మిశ్రమం).
3. ఉప్పుతో కూడినవి (లేదా పణ్యారములు), వడ, దోసె, నెయ్యిదోసె, తేనె తోళీలు (పెద్ద జంతికలు లేదా మురుకులు), సుండలు (పచ్చి సెనగపప్పు, కొబ్బరితో చేసిన గుగ్గిళ్ళు.
4. అపక్వ (వండని) ప్రసాదాలు పంచకజ్జాయం (జీడిపప్పు, గసగసాలు, ఎండుకొబ్బరి తురుము, చక్కెర, యాలకులపొడి – ఈ ఐదు పదార్థాల మిశ్రమం), బెల్లం, పానకం, ఆవుపాలు, వెన్న, వడపప్పు, మధురఫలాలు (ఒక్కో రకానికి 25 ఫలాల చొప్పున), ఎండు ఫలాలు, తమలపాకులు మరియు వక్కలు.

అన్న ప్రసాదాలను శ్రీవారి కైంకర్య నిమిత్తం సమర్పించే ముందు పాత్రలన్నింటిలో ఆవునెయ్యి వేసి, తులసిదళాలను ఉంచి, అష్టాక్షరీ మంత్రాన్ని (ఓం నమో నారాయణాయ) ఉచ్చరిస్తారు.



శ్రీవారికి త్రికాల కైంకర్యం జరుపబడుతుంది. మూడు పూటలా జరిగే నైవేద్య సమర్పణ సమయాన్ని ''మూడు ఘంటలు''గా వ్యవహరిస్తారు.

**మొదటి ఘంట – ఉదయం అయిదు గంటలకు జరిగే నైవేద్యాన్ని బాలభోగం అని కూడా అంటారు.**

* కులశేఖరపడి లోపల శ్రీవారికి అభిముఖంగా, రెండడుగుల ఎత్తైన వేదిక మీద మాత్రాన్నం ఉంచుతారు.
* శ్రీవారికి ఎడమవైపు లడ్డు, వడ వంటి పణ్యారాలు; కుడివైపు బలిప్రసాదం (శుద్ధాన్నం లేదా తెల్ల అన్నం) ఉంచుతారు.
* కులశేఖరపడి బయట, శ్రీవారికి కుడివైపున దధ్యోదనం, శుద్ధాన్నం, పులిహోర, కదంబం, ముద్గాన్నం; ఎడమవైపున గుడాన్నం (చక్కెరపొంగలి), నాలుగు గంగాళాలతో దధ్యోదనం (పెరుగన్నం) ఉంచుతారు.

  ఇది మొదటి ఘంట ప్రసాదాలుంచే క్రమం.

**2వ ఘంట – ఉదయం 10 గంటలకు మొదలయ్యే ప్రసాద సమర్పణను రాజభోగం అని కూడా అంటారు.**

* ఈ నివేదనలో భాగంగా, శ్రీవారికి అభిముఖంగా, శుద్ధాన్నం ఉంచుతారు.
* బలిప్రసాదాన్ని (శుద్ధాన్నం) గర్భాలయ దక్షిణ ద్వారం వైపు ఉంచి; కులశేఖరపడి వెలుపల దక్షిణం వైపు సిరా, పులిహోర, కట్టెపొంగలి, ఉత్తరం వైపు చక్కెరపొంగలి, దధ్యోదనం ఉంచుతారు.
* తరువాత ఘనసారం (ముఖవాసం లేదా తాంబూలం) పేరుతో తమలపాకులు, వక్కలు, పచ్చకర్పూరం, యాలకులు, ముక్తాచూర్ణం (ముత్యాలపొడి) సమర్పిస్తారు.

**3వ ఘంట లేదా రాత్రిఘంట – రాత్రి 7.30 గంటలకు సమర్పించే నైవేద్యాన్ని శయనభోగంగా పిలుస్తారు.**

* సన్నిధి లోపల నున్న వేదిక మీద మారీచ్యాన్నం (మిరియాల అన్నం), బలి అన్నం, రెండు వెదురు బుట్టలలో తాంద్రవం (తోమాల దోసె), లడ్డు, వడ ఉంచుతారు.
* కులశేఖరపడికి వెలుపల దక్షిణం వైపు పులిహోర, కదంబం; ఉత్తరం వైపు గుడాన్నం ఉంచుతారు.
* పులిహోరను శ్రీవారికి అర్పించిన తరువాత బేడి ఆంజనేయస్వామికి నివేదించుతారు.

ఇవే కాకుండా, మనం చిరుతిళ్ళు తిన్నట్లే స్వామివారికి ప్రతిరోజూ నాలుగు రకాల పణ్యారములు (స్నాక్స్, లడ్డూ, వడ, జిలేబి లాంటివి) కూడా అర్పిస్తారు.

వీటితోపాటుగా శ్రీవారికి నిశిరాత్రి (అర్ధరాత్రి) నివేదన సైతం చేస్తారు. దీనిలో భాగంగా తిరువీశం అనబడే బెల్లపు అన్నాన్ని స్వామివారికి నివేదన చేస్తారు.

సాధారణంగా శ్రీవారికి ప్రసాదాల నివేదన జరిగే సమయంలో, (తిరుమామణి మంటపంలో ఉన్న బంగారువాకిలి ముందున్న పెద్ద మంటపం) పెద్దగంటను వాయిస్తూ, ఆలయంలోనూ, పరిసర ప్రాంతాలలో ఉన్న వారందరికీ నివేదన సూచననిస్తారు. శ్రీవారికి నివేదన జరిగిన తరువాత మాత్రమే ఆహారాన్ని తీసుకునే భక్తులు నేటికీ ఎందరో ఉన్నారు. అయితే, నిశిరాత్రి జరిగే తిరువీశం నివేదనలతో మాత్రం పెద్దగంటలకు బదులుగా ''స్నపనమండపం''లోని చిన్నగంటను మోగిస్తారు. అంటే అది దాదాపుగా నడిరేయి సమయం కాబట్టి, స్వామివారికే తప్ప భక్తులకు సూచన అవసరం లేదన్నమాట.

కొద్దిసేపటి తరువాత స్వామివారు పట్టెమంచం మీద శయనించటానికి సిద్ధంగా ఉన్నప్పుడు, ఆ రోజుకు చిట్టచివరి నైవేద్యంగా వేడిపాలతో పాటుగా నేతిలో వేయించిన ఎండు ఫలాలు మరియు తాజా పండ్లముక్కలు (''మేవా'' అనబడే పంచామృతం) సమర్పిస్తారు.

ప్రతిరోజూ జరిగే సహస్ర దీపాలంకరణసేవ, డోలోత్సవం తరువాత పంచకజ్జాయం నివేదిస్తారు.

శ్రీవారి భోజనాల ''మెనూ''ని నిశితంగా పరిశీలిస్తే, మనకు కొన్ని అబ్బురపరిచే విశేషాలు అవగతమవుతాయి. శ్రీవారిది సమతుల్యాహారం – కడుపు నింపే పదార్థాలు, జిహ్వకు రుచిగా

ఉండేవి, పుష్టికరమైనవి, ఔషధగుణాలు కలిగినవి, సులభంగా జీర్ణమయ్యేవి, చలువ చేసేవి, ఎముకలను పటిష్ఠం చేసేవి (శరీరంలో అదనపు కాల్షియం కోసం, ప్రతిరోజూ అత్యంత స్వల్ప మోతాదులో మంచి ముత్యాలపొడిని ఆహారంలో తీసుకునే ఆనవాయితీ కొందరు శ్రీమంతుల కుటుంబాల్లో నేటికీ ఉందని చెప్తారు) – వీటన్నింటి సమాహారం.

ఇంచుమించుగా ప్రతిరోజూ నైవేద్య క్రమం, ప్రసాదాలు ఇలాగే ఉంటాయి. అయితే ఋతువులను బట్టి స్వల్పమార్పులు చేస్తారు. అలాగే వారంలో కొన్ని రోజులు అదనపు నైవేద్యాలు సమర్పిస్తారు (పైన చెప్పుకున్న నిత్య నైవేద్యాలతో పాటుగా).

బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణ (గరుడిని జెండా ఎగురవేయడం) సందర్భంగా "కోడెపొంగలి" అనే ప్రత్యేకమైన ప్రసాదాన్ని నివేదిస్తారు.

**వారక్రమానుసారం సమర్పించే ప్రసాదాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.**

సతమతమవుతున్నారు కదూ!

ఈ తికమక వికటకవి తెనాలి రామలింగడికి, నందకఖడ్గ అంశతో కారణజన్ముడిగా జన్మించిన అన్నమయ్యకు కూడా తప్పలేదు. ఆ సాహితీ, సంగీత సార్వభౌముల ముందు సామాన్యులమైన మనమెంత?

జగన్నాటక సూత్రధారి శ్రీవేంకటేశ్వరుడు ఇన్నిన్ని తినుబండారాలను ఆరగిస్తున్నట్లుగా నటిస్తూ, తెనాలి రామలింగడి లాంటి వికటకవుల వెటకారాలకు (వారు కూడా శ్రీవారికి పరమ భక్తులే! వెటకారంతో కూడిన వారి "నిందాస్తుతుల"లో శ్రీవారి పట్ల సాన్నిహిత్యం, చొరవ, ప్రియసఖుల పట్ల ఉండే సాన్నిహిత్యం ధ్వనిస్తాయి) గురౌతూ తన భక్తుల జిహ్వాచాపల్యాన్ని, అన్నార్తిని తీరుస్తున్నాడు.

భక్తులను కాపాడటానికి, ఉద్ధరించటానికి తాను స్వయంగా శారీరక బాధలను, నీలాపనిందలను భరించటం శ్రీమహావిష్ణువుకు అన్ని యుగాల్లోనూ పరిపాటే.

**వారక్రమానుసారం అర్పించే ప్రసాదాలు**

| సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం | ఆదివారం |
|---|---|---|---|---|---|---|
| | | | తిరుప్పావడ సేవ | అభిషేకం | | |
| 51 పెద్ద దోసెలు | ప్రత్యేక ప్రసాదాలు ఏవీ ఉండవు | పెసరపప్పు | 484 కిలోల పులిహోర | 51 పోళీలు | రోజువారీ నైవేద్యాలు మాత్రమే | అమృత కలశం లేదా గరుడ ప్రసాదం |
| 51 చిన్న దోసెలు | | పానకం | 51 తేనె తోళీలు | పాయసం | | |
| 51 పెద్ద అప్పాలు | | పాయసం | 51 పెద్ద జిలేబీలు | | | |
| 102 చిన్న అప్పాలు | | | వడలు | | | |
| | | | పాయసం | | | |

ఆదివారం రోజున సమర్పించే ప్రసాదం పేరు అమృత కలశం లేదా గరుడప్రసాదం వెనుక గల ఐతిహ్యం ఏమిటంటే స్వామివారి వాహనమైన గరుడునికి సర్పాలంటే జాతివైరం. అందువల్ల సర్పదోష పీడితులై, సంతాన లేమితో బాధపడుతున్నవారు ఈ ప్రసాదం సేవిస్తే గరుత్మంతుడు వారిని సర్పదోష విముక్తులను చేసి, సంతానప్రాప్తి కలిగిస్తాడు.

లెక్కకు మించిన ప్రసాదాలను గుర్తుంచుకోలేక

గర్భాలయంలోని ఇతర ఉత్సవ మూర్తులకు కూడా మధ్యాహ్న, సాయం సమయాల్లో నాలుగు రకాల అన్నప్రసాదాలు, నాల్గు రకాల పణ్యారాలు, పంచకజ్జాయం నివేదిస్తారు.

ప్రత్యేక సందర్భాలలో, అంటే – మూడు రోజుల పవిత్రోత్సవాలు, తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు, మూడు రోజుల జ్యేష్ఠాభిషేకం – ఉగాది, శ్రీరామనవమి, దీపావళి – ఆస్థాన సందర్భాల్లో ఈ ప్రసాదాల పరిమాణం రెట్టింపవుతుంది.



# తిరుమల వేంకటేశ్వరునికి నిత్యమూ జరిపే సేవలు

తిరుమల వేంకటేశ్వరుని ఐదు రూపాలు, మూడు గంటలు. విమాన వేంకటేశ్వరస్వామి తిరుమల వేంకటేశ్వరుని ఐదు రూపాలు. వీటి గురించి తెలుసుకుందాం.

తిరుమల వేంకటేశ్వరుని ఆలయంలో మూలవిరాట్టు కాకుండా మరో నాలుగు మూర్తులు ఉన్నాయి. ఈ మూర్తులు వరుసగా,

**భోగ శ్రీనివాసమూర్తి**
**ఉగ్ర శ్రీనివాసమూర్తి, మూలమూర్తి**
**కొలువు శ్రీనివాసమూర్తి**
**శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి**
**ఏయే రూపాల ప్రాధాన్యత ఏమిటో తెలుసుకుందాం.**

### మూలమూర్తి (ధ్రువబేరం)

నిత్యం లక్షలాదిమంది భక్తిప్రపత్తులతో దర్శించుకునే మూలవిరాట్టును ధ్రువబేరం అంటారు.ధ్రువబేరం అంటే స్థిరంగా ఉండేదని అర్థం. ధృవబేరం అంటే నేలలో స్తంభం పాతుకున్నట్లు స్థిరంగా ఉండే విగ్రహమూర్తి.

మూలవిరాట్టు అయిన ధ్రువబేరానికి తెల్లవారు జామున సుప్రభాత సేవ మొదలు అర్థరాత్రి ఏకాంత సేవ వరకూ రోజంతా ఆరాధనలు జరుగుతాయి. ఈ మూలవిరాట్టు సాలగ్రామమూర్తి. మూలమూర్తి శిరస్సు నుండి పాదం వరకూ ఎనిమిది అడుగుల ఎత్తులో ఉంటుంది. వీరస్థానక పద్ధతిలో నిలబడి ఉన్న మూలవిరాట్టు పక్కన శ్రీదేవి, భూదేవి విగ్రహాలు ఉండవు. నిత్యం లక్షలాది మంది భక్తులు తిరుమలేశుని దివ్యమంగళ దర్శనం కోసం ఎదురు చూస్తారు కనుక ఈ మూలవిరాట్టును (ధృవబేరం) దర్శించుకోవడానికి రెండు క్షణాల కంటే సమయాన్ని కేటాయించలేరు.

### భోగ శ్రీనివాసమూర్తి (కౌతుక బేరం)



ఒక అడుగు ఎత్తులో ఉండే భోగ శ్రీనివాసమూర్తిని వ్యవహారంలో భోగ శ్రీనివాసుడు అంటారు. ఇంకోరకంగా కౌతుకబేరం లేదా పురుషబేరం అంటారు. నిత్యం జరిపే దిపారాధన, నైవేద్యం, అభిషేకం, ఏకాంతసేవలు భోగ శ్రీనివాస మూర్తికి జరిపిస్తారు.

ఈ వెండి శ్రీనివాసుని విగ్రహాన్ని క్రీస్తుశకం 614 లో పల్లవమహారాణి సామవాయి పేరిందేవి ఆలయానికి సమర్పించినట్లు శాసనాలలో ఆధారాలు లభించాయి. మహారాణి ఈ శ్రీనివాసమూర్తిని సమర్పించిన నాటినుండి నేటివరకు ఎన్నడూ ఆలయం నుండి విగ్రహాన్ని తొలగించలేదు. ఆగమ శాస్త్రాన్ని అనుసరించి మూలవిరాట్టుకు చేసే సేవలు భోగశ్రీనివాసమూర్తికి అందుతాయి.

## ఉగ్ర శ్రీనివాసమూర్తి (స్నపనబేరం)

ఉగ్ర శ్రీనివాసమూర్తిని స్నపన బేరం అంటారు. ఈ మూర్తి శ్రీదేవి, భూదేవి సమేతంగా ఉంటుంది. నిజానికి శ్రీనివాసమూర్తి రూపం 11వ శతాబ్దం వరకూ ఉత్సవ విగ్రహంగా ఉండేది.



క్రీస్తుశకం 1330లో ఒకసారి ఉత్సవ విగ్రహంగా ఊరేగింపు జరుపుతుండగా అగ్నిప్రమాదం సంభవించింది. దాంతో అది ఉగ్రశ్రీనివాసుని రూపానికి సంకేతంగా భావించారు. అప్పటినుచి శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప రూపాన్ని ఉత్సవ విగ్రహంగా రూపొందించారు. ఆ విధంగా అగ్నిప్రమాదం జరిగినప్పటినుంచి ఉగ్రశ్రీనివాసమూర్తిని సంవత్సరానికి ఒకసారి సూర్యోదయానికి ముందు సర్వాలంకారాలతో సుందరంగా తీర్చిదిద్ది ఊరేగింపుకు తీసుకెళ్ళి తిరిగి అంతరాలయానికి తీసుకొస్తారు.

శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామిని ఉత్సవబేరం అంటారు. ఈ మూర్తి మూడు అడుగుల ఎత్తు ఉంటుంది. బ్రహ్మోత్సవాలతో సహా ప్రతి ఉత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామినే ఊరేగిస్తారు.

## కొలువు శ్రీనివామూర్తి (బలిబేరం)

గర్భగుడిలో మూలవిరాట్టు పక్కన ఉండే మరొక చిన్న విగ్రహాన్ని కొలువు శ్రీనివాసమూర్తి అంటారు. ఆగమ పరిభాషలో బలిబేరం అంటారు. మూలవిరాట్టుకు తోమాలసేవ నిర్వహించిన తర్వాత కొలువు శ్రీనివాసుని బంగారు సింహాసనంపై ఉంచి పంచాంగ శ్రవణం చేస్తారు. తిరుమలలో ఆవేళ జరిగే ఉత్సవ వేడుకలు ఏమైనా ఉంటే వాటి వివరాలను తెలియజేస్తారు. శ్రీవారి



హుండీలో గతరోజు వచ్చిన కానుకల వివరాలను, ఆదాయ, వ్యయాలను తెలియజేస్తారు.

## మూడు గంటలు

తిరుమలలో మొదటి గంట, నైవేద్యం, సుప్రభాత సేవ, అభిషేకాలు, కొలువు

సహస్ర నామార్చనల తర్వాత శయన మంటపాన్ని శుభ్రం చేసి బంగారు వాకిలి తలుపులు మూస్తారు. తిరుమామణి మంటపంలో రెండుసార్లు గంటలు మోగిస్తారు. ఇలా తిరుమామణి మంటపంలో గంటలు మోగగానే అర్చకులు స్వామివారికి తొలి నైవేద్యం సమర్పిస్తున్నట్లు ప్రకటిస్తారు.

జీయంగారు లేదా ఆయన సహాయకుడు వైష్ణవ సంప్రదాయంలోని ప్రబంధ అధ్యాయాలను పఠిస్తారు. దీన్ని శాత్తుమురా అని అంటారు. వేంకటేశ్వరుని ముందు మెట్టుకు ఇవతలి నుండి నైవేద్యం పెడతారు. స్వామివారికి నైవేద్యంగా



పులిహోర, దధ్యోదనం, లడ్డూలు, వడలు, పొంగలి, చక్రపొంగలి, అప్పాలు, పోళీలు నివేదిస్తారు.

నైవేద్యం స్వామివారికి కాకుండా విష్వక్సేనుడు, గరుడుడు, నిత్యాసురులకు కూడా నివేదిస్తారు. ఇలా గంటలు మోగించి నైవేద్యం సమర్పించడాన్ని వ్యవహారంలో మొదటి గంట లేదా ఆలయ మొదటి గంట అంటారు.

## తిరుమలలో రెండో గంట

అర్చన. తిరుమలేశుని దేవాలయంలో అష్టోత్తర శతనామార్చన తర్వాత రెండో గంట మోగిస్తారు. ఈ సంప్రదాయాన్ని రెండో గంట లేదా అపరాహ్న పూజ అంటారు. ఇలా రెండో గంట మోగించినప్పుడు స్వామివారికి రెండోసారి నైవేద్యం సమర్పిస్తారు. రెండోసారి జరిగే ఈ అర్చనలో వరాహపురాణం లోని శ్రీవేంకటేశ్వరుని నామావళిని జపిస్తారు.

పోటు నుండి తెచ్చిన అన్న ప్రసాదాలు, పిండివంటలు స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఆనక తాంబూలం సమర్పించి కర్పూర హారతి ఇస్తారు.

తిరుమల వేంకటేశ్వర ఆలయంలో రెండో గంట మోగినప్పుడు చేసే అష్టోత్తర నామార్చనను చూసేందుకు భక్తులను అనుమతించరు. ఇది ఏకాంత సేవ.

ప్రత్యేక సేవల కోసం టికెట్లు కొనుక్కున్న భక్తులు నివేదించిన చెరుపులు 9పులిహోర, దధ్యోదనం, పణ్యారాలు (లడ్డూలు) మొదలైన నైవేద్యాలను తిరుమల వేంకటేశ్వరునికి సమర్పిస్తారు. భక్తులు తెచ్చిన దాంట్లో నుండి కొంత మాత్రమే వేంకటేశ్వరునికి సమర్పించి తక్కిన పదార్థాలను వారికి తిరిగి ఇచ్చేస్తారు.

## తిరుమలలో మూడో గంట

తిరుమల వేంకటేశ్వర ఆలయంలో ఉదయం జరిపే తోమాలసేవ, రాత్రిపూట కూడా జరుపుతారు. ఆ సేవ అనంతరం స్వామివారికి హారతి ఇచ్చి అష్టోత్తర శతనామార్చన చేస్తారు. శ్రీదేవి, భూదేవి మూర్తులకు లక్ష్మీ నామార్చన జరుపుతారు. ఆ సమయంలో మూడో గంట మోగిస్తారు. అప్పుడు నైవేద్యాన్ని సమర్పిస్తారు. అనంతరం సర్వదర్శనం తిరిగి ప్రారంభమవుతుంది.

## తిరుమల విమాన వేంకటేశ్వరస్వామి

పూర్వం తిరుమల శ్రీవేంకటేశ్వర ఆలయ అర్చకులు తొమ్మిదిమంది స్వామివారి ఆభరణాలను దర్శించారు. అది స్వామివారి దర్శనానికి వచ్చిన విజయనగర రాజు కంటపడింది. దాంతో ఆ రాజుకు ఆగ్రహం ముంచుకొచ్చింది. తొమ్మిదిమంది అర్చకులనూ విచక్షణా రహితంగా అక్కడికక్కడే చంపేశాడు.



నరహత్య మహాపాపం అనుకుంటే ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఏకంగా తొమ్మిదిమందిని హత్య చేశారు రాజు. పైగా పవిత్ర దేవాలయంలో హత్య చేశాడు. అది సామాన్య దోషం కాదు. మహాపాపం. ఆ పాప పరిహారం కోసం వ్యాసరాయలు ప్రయత్నించారు. పన్నెండేళ్ళ పాటు భక్తులెవర్నీ ఆలయంలోకి అనుమతించలేదు.

వ్యాసరాయలువారు గర్భగుడిలో ప్రవేశించి పాప నిష్కృతి అయ్యేందుకు కఠోర దీక్షతో పూజలు నిర్వహించారు. ఆ పన్నెండేళ్ళ కాలంలో భక్తులకు గర్భగుడిలో ఉన్న మూలవిరాట్టును దర్శించుకునే భాగ్యం కలగలేదు కానీ, అందుకు ప్రతిగా ఆనంద నిలయ విమానం మొదటి అంతస్తులో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఇలా ప్రతిష్ఠించిన వేంకటేశ్వరస్వామివారి విగ్రహం ఉత్తర వాయువ్యంలో ఉంటుంది. అప్పుడు ప్రతిష్ఠించిన స్వామివారి విగ్రహమే విమాన వేంకటేశ్వరస్వామి. అప్పుడు స్వామివారికి బదులుగా ప్రతిష్ఠించిన విమాన వేంకటేశ్వరస్వామిని ఇప్పటికీ భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటారు. తిరుమల వెళ్ళిన భక్తులు తప్పనిసరిగా విమాన వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఆచారంగా మారింది.

ప్రస్తుతం ఆనంద నిలయానికి ఉత్తర వాయువ్యంలో విమాన వేంకటేశ్వరుని విగ్రహం వద్ద బంగారు, వెండి పూత పూసి, మరింత శోభాయమానంగా తీర్చిదిద్దారు. తిరుమల దర్శించుకున్న భక్తులు తప్పనిసరిగా విమాన వేంకటేశ్వరుని దర్శించుకుంటారు.

వినా వేంకటేశం ననాథో ననాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి
హరే వేంకటేశం ప్రసీద ప్రసీద

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆకస్మిక నిర్ణయములు, తొందరపాటు ఆలోచనల వలన, స్థిరాస్తిని కొనుట వలన ఆర్థికంగా తెలియని విధంగా అప్పులు చేయవలసి వస్తుంది. పట్టుదలకు సమయం కాదు. ప్రతి విషయంలో జాగ్రత్తగా ఆలోచన చేయండి. లక్ష్మిగణపతి హోమం, సరస్వతిదేవి ఆరాధన చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. కీర్తి ప్రతిష్ట బాగుంటుంది కాని మానసిక ఒత్తిడి ఉన్నది. ప్రతి విషయంలో ఇబ్బంది ఉంటుంది. అందరితో అనుకూలంగా ముందుకు సాగండి. నరములకు సంబంధమైన అనారోగ్య సమస్యలు. ఆరాధన చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు శ్రమ అధికం. ఫలితం తక్కువ. అలా అని భయపడనవసరం లేదు. దొంగతనము జరుగుటకు అవకాశములు కలిగి ఉన్నారు. అంతా గురువుపైన భారం పెట్టండి. పరిస్థితులు చక్కదిద్దుకొనగలవు. ఒత్తిడి తగ్గి అనుకూలంగా పరిస్థితులు ఉంటాయి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. బంధుమిత్రుల కలయిక సంతృప్తి కాని అధికారులతో ఇబ్బందులు ఉన్నవి. వ్యాపారంలో దాడులు ఉన్నవి. అకౌంట్స్ చాలా జాగ్రత్తగా ఉంచుకొనగలరు. ఉల్లాసంగా ఉండగల రు. నవగ్రహ జపములు ప్రదక్షిణలు దానాలు చేయండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు సహనంగా ఉండాలి. తొందరపాటుతనంతో తగాదాలు, కోర్టు సంబంధమైన టెన్షన్ ఉంటుంది. వాహన ప్రమాదములు. నిర్లక్ష్యంగా ఉంటే దొంగల భయం. నూతన వ్యక్తుల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు వృథా ప్రయాణములు. ఏవిధమైన మార్పులు కనిపించవు. అయినా ఏకాగ్రతతో పాజిటివ్‌గా ఆలోచన చేయండి. జరిగిన పొరపాట్లకు పశ్చాత్తాపం చెంది, తొందరపాటు తనానికి బాధపడి ముందుకు సాగి పనిలో నిమగ్నమవ్వండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆదాయ వనరులు సమకూర్చుకొనుటకు సరైన సమ యం. వస్తు వాహన అలంకరణ కావలసిన అమర్చుకుంటారు. తీర్థయాత్రలు. పెద్దల ఆదరాభిమానాలు, అనారోగ్య సూచనలు. సంతానముతో ఫ్రెండ్‌షిప్ వలన ఖర్చులు తగ్గును. నవగ్రహ ప్రదక్షిణలు జప దానములు చేయండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. కొన్ని విషయములు వాయిదా వేసుకొనుట మంచిది. స్నేహితుల ఆదరాభిమానాలు. కొన్ని విషయములలో పెద్దవారితో సంప్రదించి సలహాలు తీసుకొనుట మంచిది. కార్యము పట్ల తొందర పనికిరాదు. దేవతారాధనలు అఖండ దీపారాధన గృహశాంతి ఉంటుంది.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు శుభకార్యములు, విందు వినోదములు. మీరు ప్రతి విషయంలో లౌకికభావం కలిగి ప్రయత్నం చేసిన మీకు శత్రుశేషం తగ్గిపోతుంది. మీరు చాలా విషయాలలో తొందరపడి ఇతరులను చులనకగా మాట్లాడగలరు. నవగ్రహ ఆరాధనల వలన ఫలితం ఉంటుంది.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వివాహ ప్రయత్నములు ఫలించుట. బంధుమిత్రుల ప్రేమాభిమానములు, గౌరవ మన్ననలు. పనుల యందు ఆటంకములు తొలగి ముందుకు సాగండి. ఎవరినైన నమ్మినట్లు ఉండండి. పూర్తిగా నమ్మరాదు. ఇష్టదైవారాధన సంతృప్తినిస్తుంది.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉన్నట్లు కనిపిస్తుంది. మాసం చివరిలో ఊహకు అందని విధంగా ఫలితములు ఉండగలవు. విందు వినోదములు గౌరవ మన్ననలు స్త్రీలతో చాలా జాగ్రత్తగా ఉండవలసిన కాలం. నవగ్రహ శాంతి హోమం. ప్రదక్షిణలు చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన రోజులు. శుభకార్యములలో బంధుమిత్రుల కలయిక ఆనందంగా తిలకించుట నరగోష కలిగి కొన్ని సమస్యలు వచ్చి పనులు వాయిదా పడుట. సుదర్శన హోమం చేయుట వలన మరల ప్రతి విషయంలో అనుకూలత కలుగును.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




**శ్రీ వేంకటేశం**
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. జయ విజయులను ఎవరు శపించారు?
2. గోవిందదాసు – జీయరు స్వామికి ఎంత ఇచ్చారు?
3. "వాదోనావలంబ్యం" అన్నది ఎవరు?
4. శ్రీవారి చేత "మామా" అని పిలిపించుకున్నది ఎవరు?
5. పుష్కరుని పూర్వనామం ఏది?
6. "మీరా" అసలు పేరేమిటి?
7. కంసునిగా జన్మించిందెవరు?
8. "శ్రీవేంకటాచలేతిహాసమాల" రచించింది ఎవరు?
9. ఆంజనేయుడు లంఘించిన సముద్రం కొలత ఎంత?
10. శ్రీవారి సుప్రభాత రచయిత ఎవరు?
11. ఆది శంకరాచార్యుల జయంతి ఎప్పుడు?
12. శని దేవుని భయపెట్టిందెవరు?
13. "వివేక చూడామణి" ఎవరు రచించారు?
14. త్రాసులో తూగి భక్తిని చాటిందెవరు?
15. శనిదేవుని తల్లితండ్రులెవరు?

1. ______________________
2. ______________________
3. ______________________
4. ______________________
5. ______________________
6. ______________________
7. ______________________
8. ______________________
9. ______________________
10. ______________________
11. ______________________
12. ______________________
13. ______________________
14. ______________________
15. ______________________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1.రత్నాకరుడు, 2. 2002 దసరా నాడు, 3. కాంతిమతి, కేశవాచార్యులు, 4. వ్యాఘ్నపాదుని కుమారుడు, 5. ఉపమన్యుడు, 6. శ్రీకృష్ణుడు, 7. రజో గుణానికి, 8. చిన్నగుండవెల్లి, 9. సత్యవతి, 10. శివుడు, 11. దాసప్ప, 12. విష్వక్సేనుడు, 13. సదక్షణుడు, 14. ప్రయాగలో, 15. సంపాతి

## సరైన సమాధానాలు రాసినవారు

1. వనమాల రామలింగాచారి, 2. పి.యశోద
3. చిల్లర సీతారామారావు, 4. చింతలపాటి శివశంకర శాస్త్రి
5. ఎం.రామ్ మోహన్

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**చిల్లర సీతారామారావు**


గోవింద గోవింద గోవింద

RNI No.: APTEL/2008/23122 | Postel Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



**If Un Delivered Please Return to:**

**SRI VENKATESHAM,**

(Sri Venkateshwara Maha Mantra Peetham)

H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq